SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 12
May-2023, Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

మే 2023
వెల రూ. 20/-
పుటలు-56




తిరుపతి

## శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

2023 మే 26 నుండి జూన్ 03 వరకు

## తిరుమల, శ్రీవేంకటేశ్వరస్వామివారికి
## 03-04-2023 నుండి 05-04-2023 వరకు జరిగిన వసంతోత్సవ కార్యక్రమ దృశ్యమాలిక.
## అందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు మరియు భక్తులు





# గీతాశ్లోకార్థసారం

**శ్లో : కథం భీష్మమహం సంఖ్యే ద్రోణం చ మధుసూదన ।**
**ఇషుభిః ప్రతియోత్స్యామి పూజార్హావరిసూదన ॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం- 04వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అరిసూదన= శత్రువులను నశింపజేయునట్టి; మధుసూదన= ఓ కృష్ణా!; పూజార్హౌ= పూజింపదగినట్టి; భీష్మమ్= భీష్ముని; ద్రోణం చ= ద్రోణుని; సంఖ్యే= యుద్ధమునందు; అహమ్= నేను; ఇషుభిః= బాణములతో; కథమ్= ఎట్లు; ప్రతియోత్స్యామి= ఎదిరించి యుద్ధము చేయగలను?

**భావం:** ఓ కృష్ణా! భీష్మద్రోణు లిరువురును పూజింపదగినవారు. అట్టివారిపై బాణములను వదలి నేనెట్లు యుద్ధము చేయగలను?

## తపము ఫలియింపించ గతి గలదుగా నీ కమలాదేవి

కలియుగ మెటులైనాఁ - గలదుగా నీ కరుణ
జలజాక్ష! హరి హరీ! - సర్వేశ్వరా!

పాపమెంత గలిగినఁ - బరిహరించే యందుకు
నా పాలఁగలదుగా నీ నామము,
కోపమెంత గలిగిన - కొచ్చి శాంత మిచ్చుటకు
చేపట్టి కలవుగా నా - చిత్తములో నీవు.

ధర నింద్రియా లెంత - తరముకాడిన నన్ను
సరిగావఁ గద్దుగా నీ - శరణాగతి,
గరిమఁ గర్మబంధాలు - గట్టిన తాళ్లు వూడించ
నిరతిఁ గలదుగా - నీ భక్తి నాకు.


హితమైన యిహపరా - లిష్టమైన వెల్లా నియ్య
సతమై కలదుగా నీ - సంకీర్తన,
తతి శ్రీవెంకటేశ నా - తపము ఫలియింపించ
గతి గలదుగా నీ - కమలాదేవి.

(సంపుటం- 02 , సంకీర్తన-430)



*కమలములబోలు కన్నులు గలవాడా! హరిహరీ! సర్వమునకు ప్రభువైనవాడా! దోషభూయిష్ఠమైన కలియుగ మెట్లున్నను నన్ను కాపాడుటకు నీ కృపకలదు కదా! ఇక నాకేమి భయము?*

*నా యెడల ఎన్ని పాపములు గల్గినను, వాటిని సమూలంగా తుదముట్టించుటకు నీ నామమున్నదిగదా! నాకెంత కోపము గల్గినను నశింపజేసి శాంతమును ప్రసాదించుటకు నామనస్సులో నీవు నెలకొని ఉన్నావు గదా!*



*ఇంద్రియములు ఎంతగా తరుముకొనివచ్చినను నన్ను వాటి బారినుండి తప్పించుటకు నీ శరణాగతి గలదుగదా! ఘనమైన కర్మబంధములనెడు కట్టిన త్రాళ్ళనుండి నన్ను విడిపించుటకు నాకు నీయెడల ఉన్న భక్తి కలదు కదా!*

*నా కిష్టములైనవి, హితకరములైనవియు అగు ఇహమునకు పరమునకు సంబంధించిన వాటినెల్ల ఇచ్చుటకు శాశ్వతమైన నీ సంకీర్తన కలదు కదా! తగిన కాలమున నాతపస్సు ఫలింపజేయుటకు నీ లక్ష్మీదేవియే నాకు గతియై ఉన్నది గదా!*

- కీ.శే. డా॥ సముద్రాల లక్ష్మణయ్య

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

## ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడం, హిందీ, ఆంగ్లం, సంస్కృతభాషలు)

'సప్తగిరి' పట్ల మీరు చూపిస్తున్న అభిమానం అనన్యసామాన్యం.
తి.తి.దే.కి, పాఠకులకు మధ్య వారధిలా ఉన్న సప్తవర్ణ 'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక.

సెప్టెంబరు, 2022 నుండి
'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక వెలలో మార్పు అమలులోకి వచ్చింది.

ఇది నూతన చందాదారులకు
మాత్రమే ఈ మార్పు వర్తిస్తుంది.



### చందా వివరాలు

విడిప్రతి- రూ.20/-
సంవత్సర చందా- రూ.240/-
జీవిత చందా(12 సం॥లకు మాత్రమే)- రూ.2400/-
విదేశాలకు సంవత్సర చందా- రూ.1030/-

శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి!

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి!!




'సప్తగిరి' ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రికకు
చందాకట్టండి! చందాకట్టించండి!!

వివరాలకు: ప్రధాన సంపాదకుడు,
తి.తి.దే.ప్రెస్ ప్రాంగణం, కే.టి.రోడ్డు, తిరుపతి-517 507.
ఫోన్: 0877-2264363, 2264543

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 మే, 2023 సంచిక : 12



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| వసంతోత్సవాలు | డా॥ దేవులపల్లి పద్మజ | 07 |
| విశ్వానికి అక్షరభిక్ష వేదం | డా॥ పి.లలితవాణి | 09 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం | వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| ఓమ్ గోవిందాయ నమః | డా॥ మైలవరపు లలితకుమారి | 12 |
| శ్రీకృష్ణుని హస్తభూషణం వేణువు! | డా॥ పులిగడ్డ విజయలక్ష్మి | 14 |
| శుభసింధూరం | ఎస్.లావణ్య | 16 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 17 |
| నారాయణనామస్మరణ మహిమ | శ్రీ ఎం.కామేశ్వరరావు | 18 |
| శరణాగతి | ఆచార్య గోగినేని యోగ ప్రభావతీదేవి | 19 |
| అభయహస్తం | శ్రీ చాకిచెర్ల నాగసుదర్శన్ రావు | 20 |
| నాగవల్లీదళం | శ్రీమతి ఎన్.సి.హెచ్.శ్రీలక్ష్మి | 22 |
| తిరుక్కుడందై (కుంభకోణం) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| కదళి | శ్రీమతి వావిలాల నాగవల్లి | 31 |
| జాబాలితీర్థం హనుమంతుడు | డా॥ ఎస్. పద్మావతి | 33 |
| బ్రహ్మమానసపుత్రుడు భృగుమహర్షి | డా॥ పి.వి.ఉమాశశి | 35 |
| నారాపురవాసుని నవ్యమందారాలు (కవిత) | శ్రీ కె.హరి మధుసూదనరావు | 36 |
| విష్ణ్వార్చనలో.. సుందరనామం హృషీకేశుడు! | డా॥ ఎన్. సి.హెచ్.సుధా మైథిలి | 37 |
| శంఖచక్రనామ గోవిందా!! | శ్రీ యం.వి.యస్.రామశేషు | 39 |
| ధర్మసూక్ష్మం | శ్రీ బలిజేపల్లి సుబ్బారావు | 40 |
| 'చిటిక' సేవలో.. ఆంజనేయుడు | డా॥ ఎ.బి.సాయిప్రసాద్ | 41 |
| శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో... మహిళా భక్త శిరోమణులు | డా॥ నాగోలు కృష్ణారెడ్డి | 42 |
| కొత్తిమీర | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| ఐరావతవ్రతం (భాస్కరశతకం) | ఎస్.రమ్య | 45 |
| అల్లునకు అధికారం ఇవ్వరాదు (విశ్వదాభిరామం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- కీ.శే.మహామహోపాధ్యాయ ఎస్.లక్ష్మణయ్య | 47 |
| కూర్మావతారం (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాస దీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.తులసీప్రసాద్ | 48 |
| దృఢభక్తి | శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి | 50 |
| బాలవినోదం | | 51 |
| క్విజ్ (10) | | 52 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |

ముఖచిత్రం : శ్రీదేవిభూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి, తిరుపతి
వెనుకచిత్రం : శ్రీపద్మావతీదేవి తెప్పోత్సవం, తిరుచానూరు

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333



వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# అభయకారకం! నృసింహమంత్రం!!

"నారదుడు జపియించె నారాయణమంత్రము, చేరె ప్రహ్లాదుడు నారసింహమంత్రము"- అంటూ అన్నమయ్య మంత్రం గురించి కీర్తించాడు. నరసింహస్వామి కేవలం అవతారమూర్తి మాత్రమే కాదు. మంత్రమూర్తి కూడా. వేదాంతాలుగా భాసిల్లే ఉపనిషత్తుల్లో నరసింహతత్త్వం వర్ణించబడి ఉంది. ఆ స్వామి నామమంత్రంలో తన భక్తులకు అభయమిచ్చే అంతరార్థం ఇమిడి ఉంది. ఆ మంత్రం...

ఉగ్రం వీరం మహావిష్ణుం, జ్వలంతం సర్వతోముఖం,
నృసింహం భీషణం భద్రం, మృత్యుమృత్యుం నమామ్యహం!

ఇందులో ఒక్కొక్కనామంలో స్వామి ఒక్కొక్కతత్త్వం ఇమిడి ఉంది. స్వామి ఉగ్రమూర్తి. నరసింహుని హుంకారాన్ని విన్నంతమాత్రంతోనే అంతర్గత, బహిర్గత శత్రునాశనం జరుగుతుంది. సకల కార్య కారణాలకు మూలంగా ఉన్నశక్తినే వీరం అంటారు. స్వామి వీరమూర్తి కనుక సకలకార్యకారణస్వరూపుడు ఆయనే. అన్నిలోకాల్లో అంతటా ఉండే నరసింహతత్త్వానికి మహావిష్ణునామం ప్రతీక. సకలజీవరాశు లన్నింటిలోనూ తానే వ్యక్తంగానూ, అవ్యక్తంగానూ పరమాత్మ భాసిస్తాడు. సకలలోకాల్లో, సర్వాత్మల్లో తన తేజస్సును ప్రకాశింపజేయడంద్వారా వాటి ప్రకాశానికి కారణమైన తత్త్వమే జ్వలంత శబ్దానికి అర్థం.

ఇంద్రియసహాయంలేకుండా సకలవిశ్వాన్ని చూడగల పరమాత్మతత్త్వమే సర్వతోముఖత్వం. సకలజీవుల్లో సింహం చాలా శ్రేష్ఠమైనది. సింహాకృతి ప్రధానంగా నరసింహుడిగా ఆవిర్భవించాడు. నృసింహుని శాసనశక్తి ప్రతీక భీషణత్వం. అత్యంత భయంకరరూపమిది. భయాన్ని కల్గించే భీషణుడైన పరమాత్మ ఆ భయాన్ని పోగొట్టి అభయాన్నికూడా ఇస్తాడు. ఇదే భద్రత్వం. స్మరణమాత్రంచేత అపమృత్యువును దూరం చేసేవాడు. మృత్యువుకే మృత్యువైనవాడు నృసింహుడు మాత్రమే. మృత్యువును కల్గించేదీ, దాన్ని తొలగించేది కూడా ఆ స్వామి అనుగ్రహమే. అలాంటి నృసింహునికి నమస్సులు.

ఆ కోవలో నృసింహస్వామిపై తన అపారభక్తిని తరిగొండవెంగమాంబ అనే మహాభక్తురాలు తన సంకీర్తనలరూపంలో చాటుకుంది. విష్ణువు దశావతారాల్లో ఒకటైన నరసింహావతార వర్ణన ఇది.

ఫెళఫెళ నుక్కు కంబమున చిట్టుఁగ బుట్టి, హిరణ్యకశ్యపున్,
చెళువుగ గర్భగోళమును జించి, సమంచిత రక్తధారలన్,
గళగళఁద్రావి, డింభకునిఁ గాచిన దేవుఁడవంచుఁ జాలఁగాఁ
గొలచితినయ్య! నిన్నుఁ దరిగొండ నృసింహ! దయాపయోనిధీ!

దయాసముద్రుడవైన శ్రీ తరిగొండ లక్ష్మీనరసింహదేవా! ఉక్కుకంబాన్ని ఫెళఫెళధ్వనులతో చీల్చుకొని అవతరించిన నరసింహస్వరూపా! హిరణ్యకశ్యపుని చంపి వాని గర్భగోళంలోని రక్తాన్ని గళగళధ్వనితో పానంచేసి పరమబాలభక్తుడైన ప్రహ్లాదుణ్ణి పరిరక్షించిన దేవదేవునికి ప్రణామాలు అంటూ వెంగమాంబ కీర్తించింది.

ప్రస్తుతం సమాజంలో ఎవరిని పలకరించినా, కదిలించినా వారి నోటివెంట ఏదో ఒకదానికి భయం! భయం! అనే పదాలే వినిపిస్తుంటాయి. మనమనస్సులో రెండేభావాలుంటాయి. అది ఇష్టం, మరియు కష్టం అంతే! 'ఇష్టం' అన్నదాన్ని తీసుకున్నంత సంబరంగా 'కష్టం' అన్నదాన్ని మనం తీసుకోం. తీసుకోలేం కూడా! ఆ కష్టం తీసుకోవడంలోనే మనలో భయం ఆవహిస్తుంటుంది. కానీ, ఆ కష్టంలోని భయాన్ని తొలగించేదే ఈ నృసింహమంత్రరాజం. ఈ మంత్రజపమే మన భయాల్ని పోగొట్టేది. కాబట్టి ఈ మంత్రాన్ని పఠిద్దాం. మనలోని భయాల్ని పోగొట్టుకుందాం. స్వామి అనుగ్రహాన్ని పొందుదాం.



# వసంతోత్సవాలు

- డా॥ దేవులపల్లి పద్మజ,
98496 92414

తి రుచానూరు, శ్రీఅలమేలుమంగమ్మకు, శ్రీనివాస మంగాపురం, శ్రీ కల్యాణవెంకన్నకు ఈ 'మే' మాసంలో వసంతోత్సవాలు చాలా రమణీయంగా జరుగుతాయి. భార్యాభర్తలిద్దరికీ ఎక్కడ ఎన్ని ఉత్సవాలు జరిగినా ఈ వసంతోత్సవాలంటేనే ఎంతో ప్రీతి. ఎంతో ఇష్టమైనవి కూడా. ఆ విషయాన్నే అన్నమయ్య వసంతోత్సవాలకు సంబంధించి ఎన్నో సంకీర్తనలు అద్భుతంగా, రసరమ్యంగా వర్ణించాడు కూడా. ఆ వసంతోత్స వాల సంబరాలే ఇవి.

"వసంతం" నామవాచకం పరిశీలిస్తే వృద్ధికాలంగా చెప్పబడింది. ఆవిర్భవించే మొగ్గలు, వసంతకాలంయొక్క ఖచ్చితమైన సంకేతం. బలహీనమైన ఆకులు రాల్చేసి, క్రొత్త చిగుళ్లు తొడిగే చైతన్యకాలమే మానవులకు ఆశావహదృక్పథం స్ఫూర్తిగా వసంతం చెప్పబడుతోంది. ప్రకృతినుంచి గతంవదిలి రాబోయేకాలం నూతన చైతన్యం నింపుతుందని తెలియజేస్తుంది.

## శ్రీపద్మావతిదేవి వసంతోత్సవశోభ, తిరుచానూరు

జగజ్జనని లోకపావని, సంపదలతల్లి, సౌభాగ్యవల్లీ, శ్రీనివాసుని అర్ధాంగి పద్మావతీమాత వసంతోత్సవసంబరాలు మే నెల 02 నుండి 05 వరకు జరుగుతాయి. వీటి ప్రారంభానికి ముందు తిరుచానూరు ఆలయప్రాంగణం గోడలు, పైకప్పు, పూజాసామాగ్రి అన్ని వస్తువులను శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధంపొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణ చేస్తారు. ఇది వైశాఖమాసంప్రారంభంలో చేస్తారు. వైశాఖశుద్ధద్వాదశి నుండి వసంతోత్సవ శ్రీకారం చేస్తారు.

పద్మోద్భవాం పద్మముఖీం పద్మనాభ ప్రియాం రమాం!
పద్మమాలాధరాం దేవీం పద్మినీం పద్మగంధినీమ్!!

మరి పద్మనాభుని ప్రియపత్ని పద్మావతీదేవి వసంతోత్సవవేడుకలు వైశాఖశుద్ధ త్రయోదశిరోజు శుభఘడియలలో అంకురార్పణ చేస్తారు. చతుర్దశిరోజు స్నపనతిరుమంజనంతో వేడుకగా ప్రారంభిస్తారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్న సమయంలో అమ్మవారి ఉత్సవర్లను ఆలయంనుండి శుక్రవారపు తోటకు బాజాభజంత్రీలతో ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం చేయిస్తారు. ఇందులోభాగంగా పసుపు, కుంకుమ, పాలు, తేనె, చందనం, కొబ్బరినీళ్ళతో అభిషేకిస్తారు.

మరునాడు స్వర్ణరథోత్సవం కన్నులపండువుగా జరుపుతారు. మహాలక్ష్మి పురవీధుల్లో ఊరేగుతూ గడపగడపకూ వచ్చి పలకరిస్తున్న అనుభూతి కలుగుతుంది. వసంతఋతువులో సూర్యకిరణాల వేడి తక్కువగా ఉండి హాయినిస్తాయి. ఐతే ఆ శీతలకిరణాలు కొంతమందికి సరిపడవు. లోకమాత అమ్మవారు పద్మావతీదేవిని వసంతోత్సవాలు నిర్వహించి ఆరాధించడం వల్ల మానసిక శారీరకఆరోగ్యాలు లభిస్తాయని అనాదిగా ఆచరిస్తున్న ఉత్సవాలు ఇవి.



మేనెల 02నుండి 05వరకు తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారికి, మేనెల 10నుండి 12వరకు శ్రీనివాసమంగాపురం, శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివార్ల వసంతోత్సవాలసందర్భంగా...

## శ్రీకల్యాణవెంకన్న వసంతోత్సవశోభ, శ్రీనివాసమంగాపురం

"శ్రీనివాసమంగాపురం"లో కొలువై ఉన్న శ్రీనివాసునికి ఏటేటా జరిగే వార్షిక వసంతోత్సవాలు అంగరంగవైభవంగా వైశాఖ బహుళపంచమినుంచి సప్తమివరకూ జరుగుతాయి. వేసవిలో వచ్చే వేడినుంచి ఉపశమింపజేయుటకు విశేష అభిషేకాలను నిర్వహించే కార్యక్రమమే వసంతోత్సవం. ఈ శోభకృత్‌నామసంవత్సర వార్షిక వసంతశోభలు మే నెల 10, 11, 12 తేదీల్లో జరుగుతాయి.

ఉగాదినుంచి వసంతఋతువు ఆరంభం అవుతుంది. శ్రీనివాసునికి వైశాఖబహుళపంచమినాడు తొలిరోజు వసంతోత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం ఉభయనాంచారులతో స్వామి స్వర్ణపీఠంపై ఆశీనులై ఆలయ అర్చకస్వాములచే వైఖానస ఆగమోక్తంగా అభిషేకసేవలను అందుకుంటారు. ఈ విశేష అభిషేకాలను స్నపనతిరుమంజనం అంటారు. ఈ స్నపన తిరుమంజనసేవ తిలకించు నేత్రములు అదృష్టనేత్రములే. అనంతరం మెత్తటి పట్టువస్త్రంతో, సుతిమెత్తగా తుడిచి ప్రత్యేకించి నేయించిన పట్టుపీతాంబరాలతో నవరత్నఖచిత స్వర్ణాభరణాలతో అలంకరించిన సర్వాంగసుందరుడైన స్వామికి సహస్రనామార్చనలు చేసి, దేవేరులతో "ఊంజల్‌సేవ" జరిపిస్తారు.



రెండవరోజు వసంతవేడుకలలో శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు వేదోక్తంగా స్నపనతిరుమంజనం పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనం, పరిమళ ద్రవ్యాలతో మధ్యాహ్నసమయంలో విశేష అభిషేకం జరిపిస్తారు.

శ్రవణానక్షత్రం మూడవరోజు సప్తమితిథినాడు ఆలయ ముఖమండపంలో శ్రీభూసమేత కల్యాణవేంకటేశ్వరులు, శ్రీసీతారామలక్ష్మణసమేత ఆంజనేయస్వామి, శ్రీరుక్మిణీ సత్యభామా సహిత వేణుగోపాలస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం కావిస్తారు. ఏ రూపంలో ఉన్నా ఏ యుగమైనా జగత్తును శాసించేది జగన్నాథుడే అనేభావంతో విష్ణువును విశేషసేవల ద్వారా లోకమును సంరక్షించుమని వేడుకొంటూ ఈ ప్రత్యేక సేవలు చేస్తారు. వేసవిలో వచ్చే వేడికి ఉపశమనం కలిగించడానికి పరిమళద్రవ్యాలతో అభిషేకం, పరిమళపుష్పాలతో సహస్రనామార్చనలు చేసి, స్వామీ! మానవాళిని సంరక్షించటంలో నిమగ్నం కావాలనే వేడుకోలు ఉత్సవమే వసంతోత్సవం. వసంత శోభలతో స్వామి ఊరేగుతూ సర్వదర్శనం కూడా ప్రసాదిస్తారు.

ఈ వసంతోత్సవం సందర్భంగా అన్నమయ్య కీర్తనలో..

వాడల వాడల వసంతము
జాడతో చల్లేరు నీపై జాజర జాజర జాజ
వలచూపు కలువల వసంతము
కులికి మాట్లాడినదె కుంకుమ వసంతము
చలమున చల్లె నీ పై జాజర జాజర జాజ
కామిని జంకెన నీకు కస్తూరి వసంతము
వాముల మోహపునీటి వసంతము
బూమెల సరసముల పుప్పొడి వసంతము
సామజ గురుడ నీ పై జాజర జాజర జాజ
అంగన అధరమిచ్చె అమృత వసంతము
సంగడి శ్రీవేంకటేశ సతి గూడితి
ముంగిట రతి చెమట ముత్తేల వసంతము
సంగతాయె నిద్దరికి జాజర జాజర జాజ

అంటూ వసంతంపై కీర్తన రచించి సేవ చేశాడు.

# విశ్వానికి అక్షరజ్యోతి వేదం

- డా॥ పి.లలితవాణి,
98490 26107



మేనెల 04నుండి 12వరకు నాగులాపురం, శ్రీవేదవల్లీసమేత శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవంసందర్భంగా...

హిందూసనాతనధర్మంలో మహాప్రామాణికమైనవి- వేదాలు. "విద్" అనే ధాతువునుండి ఆవిర్భవించిన శబ్దం వేదం. విద్- అంటే తెలియడం. వేదం- అంటే ఈశ్వరీయమైన జ్ఞానం. జ్ఞాన, కర్మ, ఉపాసనలకు పుట్టినిల్లు- వేదం. అందుకే వేదాన్ని త్రయీ అన్నారు. వేదాలు నరమానవమాత్రునిచేత రచింపబడినవి కావు. భగవంతునిద్వారా మాత్రమే తెలుపబడ్డాయి. మానవాళికి పరమాత్మ ప్రసాదించిన మొట్టమొదటి వాఙ్మయం వేదాలు. అందుకే వేదాలను అపౌరుషేయాలు అన్నారు. వేదాలు మౌఖికమైనవి. గురుశిష్యపరంపరగా ఒకరినుండి ఒకరికి సంప్రాప్తించాయి. అందుకే వేదాలను శ్రుతులు అన్నారు.

సాక్షాత్తు సృష్టికర్త బ్రహ్మదేవుని ముఖంనుండి వేదం ఉద్భవించిందని ఉపనిషద్వాక్కు. బ్రహ్మదేవుని నాలుగుముఖాలే నాలుగువేదాలని పురాణోక్తి.


వేదాలు అస్తవ్యస్తంగా కలగలిసిపోయి, ఒక ముద్దలా ఉన్నసమయంలో శ్రీకృష్ణద్వైపాయనుడనే వ్యాసమహర్షి- ఆ ముద్దను ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం- అని నాలుగుభాగాలుగా విడదీసి, చక్కదిద్ది వేదవ్యాసునిగా కీర్తింపబడ్డాడు.

విశ్వసంస్కృతిభవనానికి ఈ నాలుగు వేదాలూ నాలుగుస్తంభాలవంటివి. వ్యాసమహర్షి శిష్యులు వేదాలను భూలోకంలో ప్రచారం చేశారు. అంతకుముందే- అగ్నిదేవుడు- ఋగ్వేదాన్ని; వాయుదేవుడు- యజుర్వేదాన్ని; సూర్యదేవుడు- సామవేదాన్ని; అంగీరసుడు- అధర్వణవేదాన్ని లోకాలన్నిటిలోను వ్యాప్తి చేశారు.

ఒకసారి సోమకుడనే రాక్షసుడు బ్రహ్మనుండి వేదాలను అపహరించి, సముద్రంలో దాగాడు. దాంతో సృష్టికార్యం ఆగిపోయింది. బ్రహ్మ ప్రార్థనను మన్నించి శ్రీమహావిష్ణువు మత్స్యరూపం దాల్చి, ఆ సోమకుని సంహరించి, వేదాలను తెచ్చి, తిరిగి బ్రహ్మదేవునికి అందించాడని పురాణగాథ.

ఋగ్వేదంలోని మంత్రాలను రుక్కులు అంటారు. ఇవి ఛందోబద్ధాలు. అత్యంత పురాతనమైనవి. ఈ వేదంలో శాకల, బాష్కల, అశ్వలాయన, మాండూక్య, సాంఖ్యాయన- అని ఐదు శాఖలున్నాయి. సృష్టిఆవిర్భావం, జీవులసముత్పత్తి, దేవతల గుణగణాలు, ప్రకృతిరహస్యాలు, ఆశ్రమవ్యవస్థ, ఆయుర్వేదం, ఆకాశయానం మొదలైన వైజ్ఞానిక అంశాలున్నాయి ఋగ్వేదంలో. ఋగ్వేదాన్ని దేవవేదం అంటారు. అందుకే ఈ వేదం జ్ఞానకాండ.

యజుర్వేదంలో రెండు శాఖలున్నాయి. శుక్లయజుర్వేదం, కృష్ణయజుర్వేదం. ఇందులో యజ్ఞయాగాదులు, మానవధర్మాలు, రాజ్యాంగవిధానం, గణితవిద్య, శారీరకవిద్య, యజ్ఞకర్మలకు కావలసిన వివిధ అంశాలు- ఉన్నాయి. ఈ వేదాన్ని యజ్ఞవేదం అంటారు. ఇది కర్మకాండ.



**సాక్షాత్తు సృష్టికర్త బ్రహ్మదేవుని ముఖంనుండి వేదం ఉద్భవించిందని ఉపనిషద్వాక్కు. బ్రహ్మదేవుని నాలుగుముఖాలే నాలుగువేదాలని పురాణోక్తి.**

సామవేదం చాలా చిన్నది. వేదాలన్నీ స్వరప్రధానమైనవి. అందునా సామవేదం విశిష్టమైనది. సంగీతశాస్త్రానికి ఈ వేదమే మూలం. ఇందులో భగవన్నుతి, ప్రార్థనావిశేషాలు, పూజాదిదైవకర్మవివరణ, గానవిద్యలు ఉన్నాయి. "వేదానాం సామవేదోస్మి" వేదాలలో నేను సామవేదాన్ని- అని పరమాత్మ- భగవద్గీతలో స్వయంగా చెప్పుకున్నాడు. సామవేదం- శాంతి వేదం. ఇది ఉపాసనాకాండ.

అధర్వణవేదంలో లౌకికవిషయాలు ఎక్కువగా ఉన్నాయి. రాజ్యం, రాజ్యాంగం, రాజకీయవ్యవస్థ, పాలనా యంత్రాంగం, యుద్ధవిద్య, అనేకానేక చికిత్సావిధానాలు, విశేషించి మూలికాచికిత్స- ఈ వేదంలో వివరంగా వర్ణితమయ్యాయి. అన్నిటినీ మించి బ్రహ్మవిద్య ప్రత్యేకం- ఈ వేదంలో. దీనిని బ్రహ్మవేదం అంటారు. రాజకీయ విషయ వివరణవలన క్షత్రవేదమని; చికిత్సావివరణవలన- భిషగ్వేదమని అంటారు. ఇది మోక్షకాండ.

వేదం- స్వరయుతమైనది. ఉదాత్త, అనుదాత్త స్వరబద్ధంగా-గురుముఖతః నేర్వవలసింది వేదం. ఏమాత్రం ఉచ్చారణాదోషం కలిగినా, ఆ మంత్రార్థం తిరగబడి, వికటిస్తుంది.

వేదాలను అర్థం చేసుకోవడం అంత సులభం కాదు. అందుకే మహర్షులు- ఒక నిర్దిష్టపద్ధతిని ఏర్పరిచారు. అవగాహనకోసం ఆరువేదాంగాలను, నాలుగుఉపవేదాలను అందించారు. శిక్ష, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం, కల్పం- అనేవి వేదాంగాలు. గాంధర్వవేదం, ఆయుర్వేదం, ధనుర్వేదం, అర్థవేదం- అనేవి ఉపవేదాలు. ఈ నాలుగువేదాలకు అధర్వణ వేదమే మూలం.

వేదసూక్తులు- జీవనవిధానాన్ని బోధిస్తున్నాయి. దంతధావనందగ్గరనుండీ కుటుంబ జీవనపద్ధతులనన్నిటినీ విశదంగా వివరించాయి వేదాలు. సృష్టిలోని అన్ని ధర్మాలకు వేదమే మూలం. కులాలకు, మతాలకు అతీతమైనది వేదం. సకల జనులకు, సకలకాలాలకు, సకలదేశాలకు వేదాలే ఆధారాలు. వేదం- శాంతి, సౌభాగ్యాలను చేకూరుస్తుంది.

శ్రీమన్నారాయణుని అవతారాలలో హయగ్రీవరూపం ఒకటి. అంటే గుర్రంతలని తలగా కలవాడని. గుర్రం తల మహాజ్ఞానానికి ప్రబలప్రతీక. ఈ సందర్భంలో జ్ఞానం అంటే ఆధ్యాత్మిక వైజ్ఞానిక సాంకేతిక సామాజిక వేదజ్ఞానం- అని. అందుకే హయగ్రీవుడు వేదశిరుడు. వేదముఖుడు. వేదరూపుడు. వేదపురుషుడు. వేదజ్ఞానప్రదాయకుడు.

వేదమే- విశ్వానికి అక్షరభిక్ష పెట్టింది. వేదమే లేకపోతే- మానవుడికి జ్ఞానం లేదు. కర్తవ్యకర్మ లేదు. ధర్మం లేదు. ధర్మం దైవస్వరూపం. ధర్మమే లేకపోతే దైవమే లేదు. సమస్తసృష్టికీ వేదాలే అధారం. వేదాలే లేకపోతే- సృష్టే లేదు. కాబట్టి- జ్ఞానం, కర్మ, ధర్మం, సృష్టి, దైవం- సమస్తం వేదస్వరూపమే.

దైవమే వేదం- వేదమే దైవం

ఓం తత్సత్

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



గత సంచిక తరువాయి...

అప్పుడు పూలవానలు కురిశాయి. మంగళవాద్యాలు మ్రోగాయి. ఆ సమయాన ఇలాంటి విపత్తులు పునరావృతం కాకుండా ఉండడానికోసం స్వామితో 'సర్వలోకకంటకుడైన రాక్షసుని సంహరించారు. మాదొక విన్నపం. ఈ ప్రదేశంలోనే తమరు అర్చావతారమూర్తిగా భక్తులను కటాక్షించాలని మా కోరిక. అపుడే భూలోకవాసులకు చింతలేని సుఖనివాసం అన్నారు. భక్తవత్సలుడైన స్వామి వారి కోరికను మన్నించాడు.

తదనంతరం భూమి నిలకడగా నిలవడానికోసం ఆ ప్రదేశాన్ని చదును చేశాడు. ఈ చేతకు దేవతలందరు ఊపిరి పీల్చుకొన్నారు. ఆ పై దేవతలు తమ తమ స్వస్థానాలకు తరలి వెళ్లిపోయారు.

శ్వేతవరాహమూర్తి తన ఆనకోసం ఎదురుచూసే గరుడునికేసి చూశాడు. ఖగేంద్రా! భూతలం మునిగిపోవడంతో ఆ భూమిని యథాస్థితికి లేపడానికి రాక్షస నిర్మూలనార్థం నేను ఘోరాకారం ఎత్తాను. సర్వాంగసుందరాకారంతో నన్ను చూచిన శ్రీదేవి ఈ వేషంతో చూస్తే పగలబడి నవ్వదా? అంతేకాదు. రసాతలంనుండి ఉద్ధరించిన రమణి భూదేవి నా ధైర్య సాహసాలకు మెచ్చుకొని కామించింది. నేనూ ఆ వసుంధరను కామించాను. ఇరువురం అన్యోన్యానురక్తులమయ్యాం. ఇలాంటివేళ అ భామామణిని వదలి రావాలనిపించడం లేదు. పక్షిరాజా! మనసులో ఏమి దాచకుండా చెబుతాను. నిగనిగలతో, ఒయ్యారాలతో దర్శనీయ అయిన కనకలక్ష్మి నా కఠినశరీరాన్ని, గగుర్పొడిచేలాంటి దేహంతో, ఒళ్లంతా చీకాకు కలిగించే వెంట్రుకలతో, ఎవరైనా చూస్తే చెదిరిపోయే కోరలతో వికారంగా ఉండే నన్ను చూస్తే జడుసుకోదా? ఇలాంటి జుగుప్సావహమైన వేషంతో వైకుంఠానికి ఎలా రాను? నా క్రూర రూపాన్ని చూచి 'నీవెవడ'వని గద్దించి అడిగితే నేనే నేనే నీ పతిదేవుణ్ణి' అని పరిచయం చేసుకోవడం ఎబ్బెట్టు కాదా! ఇన్ని కారణాలతో, సందేహాలతో ఇప్పుడు వైకుంఠం చేరుకోవడం ఏ మాత్రం సబబుకాదు. ప్రస్తుతం నన్ను, నా రూపాన్ని వలచిన వనితతోనే ఉండాలనిపిస్తుంది ఏమంటావు?' అన్నాడు వెన్నుడు.

స్వామీ! అమ్మగురించి మీరు ఇలా అనడం నాకు వింతగా ఉంది. భూలోకవాసుల హితార్థం మీరు శ్వేతవరాహ రూపం ధరించారని, రాక్షససంహారం చేసి స్థావరజంగమాలను రక్షించారనే మీ లోకోత్తరమైన చేతలకు ఆదిలక్ష్మి పొంగిపోతుంది. పరవశిస్తుంది. అంతేకాని, వేరే రకంగా ఊహించుకోవడం నాకు చిత్రంగా ఉంది. లేనిపోని సందేహాలతో ఏవేవో ఊహించుకొంటూరెందుకు? అధికప్రసంగమైతే నన్ను క్షమించండి అన్నాడు.

స్వామీ! అమ్మ అనపాయిని కదా! మిమ్మల్ని విడిచి ఉండలేని వనితాశిరోమణి. సదా వక్షఃస్థలవాసిని అయిన అమ్మ మీ సూకరాకారం చూసి జడుసుకొంటుందనుకోను. మీరు సర్వజ్ఞులు. మీకు ఏది తోస్తే అదే చేయండి అంటూ చేతులు జోడించాడు. పుణ్యాత్మ! ఏమైనా సరే నేను ఈ వేషంతో వైకుంఠానికి రానే రాను. కొంతకాలం భూతలవాసం చేయాలని ఉంది. హిరణ్యాక్షసంహారంతో దుష్టశిక్షణ పూర్తికాలేదు. ఇంకా ఎందరో రాక్షసులు మిగిలి ఉన్నారు. వారిని నామరూపాలు లేకుండా చేయాలి. సరే! సరాసరి నీవు వైకుంఠానికి వెళ్లు. అన్నట్లు ఇక్కడి వ్యవహారాలను ఆదిలక్ష్మితో చెప్పు. అన్నట్లు మరిచా! నాకు క్రీడాచలంలో విహరించాలని ఉంది. అంచేత వైకుంఠంనుండి క్రీడాచలాన్ని భూతలానికి తీసుకురా! అనడంతో రెక్కలు విదిల్చి గరుత్మంతుడు వైకుంఠం వెళ్లాడు. గరుత్మంతుడు వాయువేగంతో వైకుంఠంకేసి వెళ్ళగా హరి తానెక్కడ ఉండాలా అని ఆలోచించాడు. చివరకు గౌతమీనదికి దక్షిణంవైపు 60యోజనాల దూరం, తూర్పుసముద్రతీరానికి పడమట ఐదుయోజనాలదూరాన, సువర్ణముఖరీ నదికి ఉత్తరంవైపు ప్రదేశంవరకు వాసయోగ్యమని భావించి అక్కడే ఉంటూ గరుత్మంతునికోసం ఎదురు చూడసాగాడు.

(ఇంకా ఉంది)

# ఓమ్ గోవిందాయ నమః

- డా॥ మైలవరపు లలితకుమారి,
99595 10422

మేనెల 26నుండి జూన్ 03వరకు తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం సందర్భంగా...


శ్రీనివాసా గోవిందా।
శ్రీవేంకటేశా గోవిందా।
భక్తవత్సలా గోవిందా।
భాగవతప్రియ గోవిందా।
గోవిందాహరి గోవిందా ।
గోకులనందన గోవిందా। .....

అని తిరుమలకొండల్లో ఎల్లవేళలా గోవిందనామం ప్రతిధ్వని స్తూంటుంది. గోవిందా అంటేనే సర్వత్రాస్మరణం **"భజగోవిందం భజ గోవిందం గోవిందంభజే మూఢమతే"** అని శంకరాచార్యులవారు చెప్పారు. గోవిందా అని గట్టిగా అంటే నాభిదగ్గరనుంచి పలుకుతాం. "మానవజాతికి ఉద్ధారకశబ్దం గోవిందనామస్మరణం". గోవిందా అనే పదం విష్ణుతత్త్వమును తెలియచేస్తుంది.

**"గోభిరేవయతో వాచ్యో గోవిందస్స ఉదాహృతః"** వేదవాక్కులచే ప్రతిపాదింపబడేవాడే **"గోవిందుడు"** అని కొందరు పేర్కొన్నారు.

**'వేదైశ్చ సర్వై రహమేవ వేద్యః"** అని పేర్కొన్నారు. హిరణ్యాక్షునిచే భూదేవి అపహరింపబడినప్పుడు వరాహరూపం ధరించిన మహావిష్ణువు తిరిగి భూదేవిని పొందాడు. కనుక గోవిందుడు అని ప్రస్తుతించారు.

ఏది ఏమైనా గోవింద శబ్దార్థం చతుర్యుగములకు సంబంధించిన ఒక మంత్రరాజం అని చెప్పవచ్చు. అదే **"ఓమ్ గోవిందాయ నమః"** అనే మంత్రం.



దీనిని గురించి శ్రీమద్భాగవతం విపులంగా వర్ణించి చెప్పింది. దేవకీ వసుదేవులకు జన్మించిన కృష్ణస్వామి యశోదానందుల కుమారునిగా గోకులంలో జన్మించాడు. గోవులను కాస్తూ, గోపాలబాలకుడిగా పెరిగాడు. పూతనాది రాక్షససంహారం చేశాడు. కాళిందిమడుగును విషపూరితం చేస్తున్న కాళీయుని అక్కడినుండి తరిమికొట్టాడు. అఘాసురుని సంహారం, దావాగ్నిని మ్రింగివేయటం మొదలుగా గల అనేకకార్యాలను చేసి గో, గోపికా గోపాలకులను రక్షించాడు. ఈ చర్యలన్నీకాక గోకులంలో మరొక మహత్తరమైన కార్యమును సాధించాడు.

నందుడు వర్షంకోసం ఇంద్రుణ్ణి ఆరాధించాలని గోపాలకులకు చెప్పాడు. కృష్ణుడపుడు ఏడువత్సరాల వయసు బాలకుడు. అపుడతడు తండ్రితో ఇంద్రుని పూజించటానికి గల కారణమేమి? అని ప్రశ్నించాడు, అప్పుడు నందుడు ఇంద్రుడు సకలదేవతలకు అధిపతి. వర్షాధిదేవత ఐన ఆయన ఆజ్ఞప్రకారం మేఘములు, జలములు వర్షిస్తాయి. వానితో భూమిమీద సకలజీవులు ఆనందజీవనం గడుపుతున్నారు. అందువల్ల దేవేంద్రుని సంతృప్తిపరచుటకై ఇంద్రయాగమవశ్యం చేయాలి అన్నాడు.

కృష్ణుడపుడు తండ్రీ! మనం సర్వత్రా వనవాసులం. గోవులు మనకు జీవనాధారములు. బ్రాహ్మణాశీర్వాదంచే మన వంశాభివృద్ధి

జరుగుతోంది. గోవర్ధనపర్వతం మనకు గడ్డి, జలములను ఇస్తోంది. కనుక గోవర్ధనపర్వతమును పూజిద్దాం అన్నాడు. కృష్ణునిమాటతో నందాదులు అందరూ గోవర్ధనమును పూజించారు. బ్రాహ్మణాశీర్వాదాలనంతరం అందరూ గోవర్ధనగిరికి నమస్కారాలు చేసి, నైవేద్యాలను సమర్పించారు. గోపాలకులకు నమ్మిక కలిగించటానికై కృష్ణపరమాత్మ గోవర్ధనపర్వతంపైకి చేరి మహారూపాన్ని ధరించి ఇదిగో మీ నైవేద్యం స్వీకరిస్తున్నానంటూ వారితోకూడి తనకుతానే నమస్కరించుకున్నాడు. అదే కృష్ణమాయ.

గర్వాంధుడైన ఇంద్రుడు ఆ దృశ్యాన్ని చూచి తన్ను కాదని ఒక పర్వతాన్ని పూజించారనే క్రోధంతో పుష్కలావర్త మేఘాలనురప్పించి జడివాన కురిపించాడు. అంతేగాక రాళ్ళ వర్షాన్ని కురిపిస్తుండగా గోపాలకులు, గోపికలు, గోవులు అన్నీ కూడా భీతావహులై కృష్ణుణ్ణి శరణుజొచ్చాయి. అంత భగవానుడు రామావతారంలో–

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చయాచతే
అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ॥

అని ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. యుగాలు మారి అవతారాలు మారినా ఆర్తత్రాణపరాయణత్వమే స్వామి వ్రతం కదా! అందువల్ల బాలుడైన కృష్ణుడు వెంటనే తన ఎడమచేతి చిటికెన వ్రేలితో ఆ గోవర్ధనపర్వతాన్ని పెళ్ళగించి ఆ వ్రేలిపై నిలిపి గోపాలకులందరిని వారి వారి గోసంపద, గోపికాజనం, వారి సంబారాలతో సహా కొండకిందికి వచ్చి నిలబడమని పిలిచాడు. పిల్లవాడని వారు సందేహించగా–

బాలుండీతడు కొండ దొడ్డది మహాభారంబు సైరింపగా
జాలండో యని దీనిక్రిందనిలువన్ శంకింపంగా బోలదీ
శైలాంభోనిధి జంతుసంయుత ధరాచక్రంబు పైబడ్డ నా
కేలల్లాడదు బంధులారా! నిలుడీక్రిందన్ ప్రమోదంబునన్ ॥

అని పలికాడు. కృష్ణునిమాటలు విన్న వారందరూ, స్వామిపై భారంవేసి గోవర్ధనగిరికిందకి చేరారు. స్వామిని నమ్మిన వారెన్నడూ చెడిపోరు. ఏడురోజులు వర్షింపచేసిన ఇంద్రుడు చివరికి పరమాత్మతత్త్వాన్ని తెలుసుకొని నీ లీలలు తెలుసుకోలేక పోయాను అని స్వామిని శరణువేడుకున్నాడు. దయాసముద్రుడైన స్వామికృపకు పాత్రుడయ్యాడు. అంత గోగణసమేతమైన కామధేనువు సురభి క్షీరములతో, గంగానదీజలములతో ఇంద్రుడు స్వామినభిషేకించి గోవు, గోపగణాన్ని రక్షించిన నీవు గోవిందుడవని ప్రశంసించాడు.

"త్వం గవా మింద్రతాంగతః గోవింద ఇతిలోకాస్త్వాం స్తోష్యంతి భువి శాశ్వతమ్" అని ప్రస్తుతించాడు.

ఆ విధంగా గోవర్ధనపర్వతాన్నెత్తి "గోప గోగణపతి త్వంబునకు" కృష్ణునకు దేవతలు గోవింద పట్టాభిషేకం చేశారు. నాటినుండి గోవిందా! గోవిందా! యని భక్తులు స్వామిని కీర్తిస్తున్నారు. ఈ "గో" శబ్దానికి నేత్రం, కిరణం, భూమి, నీరు అనేఅర్థాలు కూడా చెబుతారు.

"స్వర్గేషు పశువాగ్వజ దిఙ్నేత్రఘృణి భూజలే"

స్వర్గం, బాణం, పశువు, వాక్కు, వజ్రాయుధం, దిక్కు, గోపురం అనే అర్థాలను "అమరకోశం" వివరించింది.

గోవిందా! అని స్మరిస్తే మానవులకు ఉన్న కష్టాలన్నీ దూదిపింజలవలె ఎగిరిపోయి, సర్వపాపాలు నశించి, సుఖాన్ని పొందుతారు. అందుకే అన్నమయ్య–

గోవింద గోవిందయని కొలువరే ।
గోవిందాయని కొలువరే ॥

యని గోవిందనామప్రాశస్త్యాన్ని కీర్తించి ధన్యుడయ్యాడు. గోవిందనామస్మరణమున భక్తులు తమ పాపాలను పోగొట్టుకొని తరిస్తారు.

"లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు"

## 2023, జూన్ నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 02-04 | తిరుమలశ్రీవారి జ్యేష్ఠాభిషేకం |
| 04 | ఏరువాక పూర్ణిమ |
| 20 | పూరీజగన్నాథ రథయాత్ర |
| 24-26 | శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవం, శ్రీనివాసమంగాపురం |
| 29 | తొలిఏకాదశి |

# శ్రీకృష్ణుని హస్తభూషణం



# వేణువు

మేనెల
13నుండి 21వరకు
కార్వేటినగరం,
శ్రీవేణుగోపాలస్వామివారి
బ్రహ్మోత్సవం
సందర్భంగా...

- డా॥ పులిగడ్డ విజయలక్ష్మి,
99890 63761

శ్రీకృష్ణపరమాత్మునిచేతిలో నిరంతరం నిలిచి ఉండేది వేణువు. వేణువు చేతిలో లేని శ్రీకృష్ణుని ఎవ్వరూ చిత్రించలేరు. అంతటి అవినాభావసంబంధమున్నది కృష్ణునికి, వేణువుకి. అలాగే నెమలిపింఛానికి కూడా.

వేణువుకు మురళి, పిల్లనగ్రోవి, వంశీ, బాసురి, స్వరలాసిక, తూతకొమ్ము- అనే పేర్లున్నాయి. వేణువు ఒక గొప్ప సంగీతవాయిద్యపరికరం. వెదురుముక్కను బాగా ఆరబెట్టి- నాణ్యతగా తయారుచేస్తారు. ఒకవైపు తెరచి, మరోవైపు మూసి ఉంచుతారు. గాలి ఊదేందుకు పైభాగంలో రంధ్రాలు చేస్తారు. అవి ఒకటినుండి ఎనిమిదివరకు విభిన్నాలుగా ఉంటాయి. వేణువుని పెదవికి చేర్చి, సన్నగా గాలి ఊదితే ఆ రంధ్రాల నుండీ ఊదిన గాలి సుస్వరంగా బయటికి వస్తుంది. అది మహత్తరమైన సంగీతస్వరంగా పేరు పొందింది. గాలితో సాధన చేస్తే మురళీరవం వశం అవుతుంది. ఏ విద్య ఐనా సాధనద్వారానే సాధ్యమవుతుంది. ఏమాత్రం సంగీతజ్ఞానం లేనివాడైనా వేణువుని తీసుకుని ఊదుతూ ఉంటే ఆ గాలి స్వరంగా మారి సుమధురసంగీతాన్నే అందిస్తుంది. అంతటి సులభమనోహరమైనది వెదురుముక్కలో దాగిఉన్న సంగీతధ్వని.

శాస్త్రీయసంగీతంలో తప్పనిసరిగా వేణువును ఉపయోగిస్తారు. ఎక్కువగా కర్ణాటక, హిందుస్థానీసంగీతాల్లో వేణునాదం ఉంటుంది. వేణువు- ఎప్పుడు పుట్టిందో తెలుసుకోవడం- అసాధ్యం. మనదేశంలోను, తదితర కొన్నిదేశాలలోను వేణువును-వెదురుతోనే చేస్తారు. పురాతన కాలంలో ఈజిప్ట్‌లో చెక్కతోను, దంతముతోను చేశారు.

వేణునాదానికి శ్వాసే ఆధారం. అసలు లాటిన్‌భాషలో- వేణువు- అంటేనే శ్వాస. వేణువుయొక్క రంధ్రాలు- ఊదే పెదవికి సమాంతరంగా ఉంటాయి. అలాగే తయారుచేస్తారు. అప్పుడే వేణుస్వరం- స్పష్టంగా, స్వచ్ఛంగా, సరిగ్గా ఏర్పడుతుంది. అలాంటిస్వరమే మనోహ్లాదంగా ఉండి, పరవశులను చేస్తుంది.

పరమశివుడు తానే స్వయంగా తయారుచేసి వేణువును శ్రీకృష్ణునికిచ్చాడని పురాణోక్తి.

త్రేతాయుగంలో శ్రీరాముడు వనవాసం చేస్తున్నప్పుడు- అడవిలో ఉన్న పూలను తాకి ఆ మెత్తదనాన్ని, ఆ పరిమళాన్ని, ఆ చక్కదనాన్ని ఆస్వాదిస్తున్న సమయంలో చెంతనే ఉన్న వెదురు కంటతడి పెట్టుకున్నదట. అదిచూచి రాముడు చంచలించిపోయి- కారణమడిగాడట. అందుకు వెదురు "నన్ను ఎవరూ ఆదరించరు. నాలో పరిమళం, మెత్తదనం లేవుగా" అని వాపోయిందట. వెంటనే రాముడు కరుణించి - "రాబోయే యుగంలో నేనే శ్రీకృష్ణునిగా జన్మించినపుడు నిన్నే నా హస్తభూషణం చేసుకుంటాను. నిన్నే స్వరపరికరంగా మలచుకుంటాను. నీలోనే స్వరాలు పలికిస్తాను. నిన్నే లోకప్రసిద్ధిగా చేస్తాను" అని వరమిచ్చాడని ఒక ఐతిహ్యం.

ఏ సంగీతానికైనా పశువులు, శిశువులు, పాములు కూడా తలలాడిస్తూ ఆహ్లాదాన్ని పొందుతాయి. అందుకే

వేణులోలుడైన వేణుగోపాలకృష్ణుడు తన వేణునాదంతో గోపాలురను, గోపికలను, గోవులను తన వశం చేసుకుని గోపాల కుడిగా ప్రసిద్ధిచెందాడు.

కొండలమీదకి గోవులను తోలుకు పోయినప్పుడు ఏ గోవు ఐనా తప్పిపోతే వెంటనే శ్రీకృష్ణుడు మురళిని ఊదుతాడు. అంతే. ఎంత దూరంలో ఉన్న గోవు ఐనా ఆ స్వరానికి పరవశమై పరుగులు పెట్టు కుంటూ ఆ బాలునిచెంతకు చేరుకుం టుంది. ఆ వేణుస్వరంవలన గోవులన్నీ సమయానికి తమ తమ యజమానుల ఇళ్ళకు చేరేవని సహజకవి పండితుడైన పోతన అభివర్ణించిన తీరు అద్భుతమే. శ్రీకృష్ణుడు తన వేణుగానంతో గోపికలను తరింపచేశాడు. యమునాతీరాన్ని, బృందా వనాన్ని పరవశింపచేశాడు.

మురళీధరుడు, మురళీలోలుడు, వేణుమాధవుడు, వంశీకృష్ణ, పిల్లనగ్రోవి ప్రియుడు, మురళీమనోహరుడు– అంటూ శ్రీకృష్ణుని కొలుచుకుంటున్నాం. ఆ స్వామి వెనువెంటనే ప్రసన్న మవుతున్నాడు. శ్రీకృష్ణుని మురళికి వివిధపేర్లున్నాయి. కాస్త పొడవుగా ఉంటే మహా నంద. ఈ మురళీరవంతో రాధాదేవిమనసును గెలుచు కున్నాడు. మరికాస్త పొడవుగా ఉంటే మురళి ఆకర్షిణి. ఇది బంగారంతో తయారుచేయబడి ఉంటుంది. ఇంకా కాస్త పొడవుగా ఉంటే ఆనందిని. ఈ వేణునాదంతో గోపాలురను, గోపికలను మొత్తంగా గోకులాన్నే వశం చేసుకుని, తన సొంతం చేసుకున్నాడు. మరో మురళి సరళ. దీని స్వరం– కోకిలస్వరంలాగా మనోజ్ఞంగా ఉంటుంది. మొత్తానికి శ్రీకృష్ణుని వేణువు సమ్మోహనాశక్తి కలది.

ఇక్కడ మరో ముఖ్యవిషయాన్ని అర్థం చేసుకోవాలి. వేణునాదం– ప్రణవనాదం. ఓంకారనాదం. ఓంకారనాదంనుండే సృష్టి జరిగిందన్నది ఉపనిషద్వాక్కు. వేణువు– జీవాత్మకు ప్రతీక. వేణువు– బోలుగా ఉంటుంది. అంటే లోపల నాదశక్తి తప్ప ఏదీ ఉండదు. ఖాళీ. నాదం కనిపించేది కాదు. కేవలం వినిపించేది. మానవుడి మనసులోకూడా ఏ కోరికలూ లేకుండా బోలుగా ఉండి, పవిత్రంగా, నిష్కల్మషంగా





ఉండి పరమాత్ముని నింపుకోవాలి. "నన్ను నీ మురళిగా మలచుకో. నాలో స్వరాలు పలికించి, నీలో కలుపుకో" అని జీవాత్మ అంటే భక్తుడు కోరితే– శ్రీకృష్ణుడు శరణాగతి పొందిన ఆ భక్తుని తనలో చేర్చుకుంటాడు. వేణువులోని రంధ్రాలు– మానవశరీరంలోని చక్రాలు. వాటిని మేల్కొలుపుతాడు పరమాత్మ. ఇదంతా ఒక యోగప్రక్రియ. యోగశక్తి. ధ్యానశక్తి. స్వరశక్తి.

శ్రీకృష్ణుడు వేణువునూది సృష్టినే వశం చేసుకున్నాడు. అలాగే భక్తుడుకూడా వేణు నాదంతో ఆ శ్రీకృష్ణునే వశం చేసుకో వచ్చునట. ఎవరైనా తదేకచిత్తంతో శ్రీకృష్ణునే మనసులో నింపుకుని వేణువును ఊదితే అంతటి పరమాత్మకూడా పరవశి స్తాడట.

సంగీతప్రపంచంలో నేటికీ వేణువుకు ఒక ప్రత్యేక స్థానముంది.

*"వేణునాదప్రియా,*
*శ్రీకృష్ణా నమోస్తుతే"*

# శుభసింధూరం

- ఎస్. లావణ్య

సింధూరం హనుమంతుల వారికి ఎంతో ప్రీతి. అందుకే శరీరమంతా సింధూరమయం చేసుకున్నాడు. శరీరమంతా సింధూరమయం చేసుకున్న హనుమంతుడంటే శ్రీరామునికి ఇంకా ఎంతో ప్రీతి. కనుకనే సింధూరంతో ఆంజనేయుణ్ణి పూజించినవారికి తాను సకలసౌభాగ్యాలనొసగి వారికి తాను రక్షణగా నిలబడతానని వరమిచ్చాడు రాముడు.

ఒకనాడు హనుమంతుడు సీతమ్మవద్దకు వచ్చి శిరస్సువంచి నమస్కరించి శిరస్సు పైకెత్తి సీతమ్మవంక చూశాడు. అప్పుడు సీతమ్మ నుదుటికుంకుమతోపాటు ముంగురుల మధ్య అంటే పాపిడి మొదట్లో సింధూరంబొట్టు పెట్టుకుని ఉంది. అది చూసి హనుమంతుడు 'అమ్మా! పాపిడిలో అలా సింధూరం పెట్టుకున్నావు ఎందుకు?' అని అడిగాడు.



అప్పుడు సీతమ్మ "అది రాముని క్షేమంకోసం సింధూరాన్ని ఇలా పెట్టుకుంటే అది రామునికి రక్షణకవచంలా ఉండి అతనికి ఏ కష్టమూ, బాధా కలుగకుండా కాపాడుతుంది. అందుకే పెట్టుకున్నాను." అని చెప్పింది. "అలాగా! ఇదంతా రాముని రక్షణకోసమా!" అనుకొంటూ వెళ్లాడు హనుమంతుడు.


అలా వెళ్లిన హనుమంతుడు తన ఒళ్లంతా సింధూరం దట్టంగా అద్దేసుకుని అరుణోదయ సూర్యునివలె ప్రకాశిస్తూ రామునివద్దకు వచ్చి రామునికి నమస్కరించాడు. హనుమంతుని వాలకం చూసి రాముడు చిరుదరహాసం చేస్తూ "ఏమిటి హనుమా! ఒళ్ళంతా అలా సింధూరం పూసుకున్నావెందుకు?" అని అడిగాడు.

"రామా! నీ రక్షణకోసం సీతమ్మ సింధూరంతో చిన్నబొట్టు పెట్టుకుంది. నీ రక్షణకోసం అంతకొంచెం సింధూరం పెట్టుకుంటే సరిపోదు. అందుకే నేను ఇలా ఒళ్ళంతా సింధూరం పూసేసుకున్నాను. ఇప్పుడిది నీకు పరిపూర్ణరక్షణగా ఉండి నిన్ను కాపాడుతుంది. నీ రక్షణకోసం, నీ సంతోషంకోసం నేను ఏమైనా చేస్తాను అన్నాడు ఆంజనేయుడు.

అది విన్న రాముడు హనుమంతునికి తనపై ఉన్న ప్రేమకు, భక్తికి ఆనందపారవశ్యం పొందాడు. "హనుమా! నీ భక్తి అనన్యం. నాపట్ల నీకున్న శ్రద్ధ అమోఘం. నా రక్షణకోసం నువ్వు ఇలా ఒళ్లంతా సింధూరం పూసుకున్నావు కాబట్టి సింధూరంతో నిన్ను పూజించినవారికి నేను రక్షణగా నిలిచి కాపాడుతాను. వారికి సకల సౌభాగ్యాలు ఇస్తాను. వారికి శత్రుభయంగానీ, గ్రహదోషాలుగానీ, భూత, ప్రేత, పిశాచాది దుష్టశక్తుల భయంగానీ లేకుండా వారికి నేనే రక్షణగా నిలిచి కాపాడుతాను" అని హనుమంతునికి వరమిచ్చి తద్వారా లోకోపకారం చేశాడు రాముడు.

అందువల్ల, ఆంజనేయస్వామికి ఒళ్లంతా సింధూరం రాయడం, సింధూరంతోనే నామం దిద్దడం ఆచారమయ్యింది. సింధూరంతో హనుమంతుణ్ణి సేవించినవారికి శ్రీరాముని రక్షణ లభిస్తుంది. సకల సౌభాగ్యాలు కలుగుతాయి.

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఎ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

'కులశేఖరపడి' అను గర్భగృహపు గడపవద్ద నిలచి 'ఆపాదచూడమనుభూయ హరిం శయానమ్' (పవ్వళించియున్న శ్రీహరిని ఆపాదమస్తకము అనుభవించి) అనురీతి సంస్కార వశమున దివ్యపాదారవిందములు మొదలు దివ్యకిరీటము వరకు ఆశతో అనుభవించి ప్రాచీనసంస్కారముచేత అవశముగ 'కంగులుమ్ పగలుమ్' అని ఆరంభమగు పదిపాశురములను (గీతములను) దేవగానపద్ధతిననుసరించి పాడి నిలచిరి.

అంత శ్రీవేంకటేశ్వరుడు సంతసించి అర్చకముఖమున 'ప్రబంధగాయకా! మునుపు (నమ్మ)ఆళ్వార్ మాయెడ మోహము వహించి, నాయికాభావము పూని అనుభవించిన తీరును మీరిప్పుడు అనుకరించి ప్రదర్శించుటవలన ఈ తిరువాయ్‌మొళి (దశకము) మాకెంతో ఆనంద మొనగూర్చినది. ఇట్లే మాపై పరకాలుడు (తిరుమంగైఆళ్వారుకూడ) వ్యామోహముచేత నాయికాదశను పొంది అనుభవించి చెప్పిన గీతమునం దొక్కదానిని అనుసంధించుచు అభినయించుచు చూపుడు' అని పలుకగ అప్పుడు ఆళ్వార్ అరైయరు (గాయకులు) అతిముగ్ధ హృదయులై వారనుగ్రహించిన సరసపు పలుకులందు ఆసక్తి గలవారై 'కారార్‌వరై క్కొంగై' అని తొడగి తిరుమంగైయాళ్వారు (పరకాలుడు) 'తాటిమట్టపై నెక్కి' భగవదనుభవము పొందిన శిఱియ తిరుమడల్ ప్రబంధమును పరవశగాత్రులై నాయికా దశానుభవమును అభినయించి చూప, శ్రీవేంకటాచలపతియు ఆకర్ణించి మనమున నుప్పొంగి దివ్యచరణరూపమగు శ్రీశఠ కోపము, దివ్యమాలిక మున్నగు బహుమానములన్నిటిని ఒసగి అనుగ్రహింపగ కృతార్థులైరి.

అప్పుడు సన్నిధియందున్న పెద్దలగు అంజనవెఱ్ఱనార్, భగవద్రామానుజులు, తిరువేంకట జియ్యరు మొదలగు వారెల్లరును సంతుష్టులై ఈ మధ్యాహ్నసమయమున దివ్యమాలిక సమర్పించునప్పుడు 'శిఱియతిరుమడల్' ప్రబంధము అను సంధింపగ విని దివ్యమాలికను సమర్పింపవలెను. ఈ భగవ దాజ్ఞచేత వీథులందు విజయము చేయునప్పుడును ఈ తిరు మడల్‌ప్రబంధమునే వినిపింపవలయును అని నియమము చేసిరి.

మునుపు 'అళగియ మణవాళప్పెరుమాళ్' అను శ్రీరంగనాథస్వామి ఇట వలసయై విజయము చేసియుండి మరలిపోవునప్పుడు తమకు అసాధారణమైన 'కఙ్గులుమ్ పగలుమ్' పాశురమును (గీతమును) అనుగ్రహించిరను ఐతిహ్యము ప్రచారమున ఉండుటచేత ఇప్పుడు కఙ్గులుమ్ పగలుమ్ పాశురమును విని అంతరంగమున ఆనందించుట చేతను ప్రతిదినము సాయంకాలమున నిత్యానుసంధానముతో బాటు ఈ తిరువాయ్‌మొళి (దశకమును) శ్రీస్వామివారికి విని పింపవలయును అనియు- నియమము కల్పించారు.

**(ఇంకా ఉంది)**

# నారాయణనామస్మరణ మహిమ

మే 31నుండి జూన్ 08వరకు
నారాయణవనం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం సందర్భంగా...

- శ్రీ ఎం.కామేశ్వరరావు, 99890 13020

***మానవుడు తన జీవనగమనంలో అనేకరకాలైన తప్పులూ, పొరపాట్లూ, పాపాలూ చేస్తూంటాడు. కాని తాను చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి అని మాత్రం అనుకోడు. ప్రతీపాపపుపనికీ ఒక ప్రాయశ్చిత్తం నిర్దిష్టంగా చెప్పబడి ఉంది. కాబట్టి ప్రతీవ్యక్తి పశ్చాత్తాపంతో కూడిన మనస్సుతో పాపరహితమైన, దోషరహితమైనమనస్సుతో, సత్ప్రవర్తనతో స్వధర్మాన్ని ఆచరించడంద్వారా భగవత్భక్తిమార్గంలో పాపకర్మలను నశింపచేసుకోవాలి. భగవద్భక్తియే ఏకైక పాప విమోచనసాధనం. నారాయణనామ ఉచ్చారణద్వారా పాపాత్ముడైనవాడుకూడా ఏ విధంగా రక్షింపబడ్డాడో ఈ కథ ద్వారా తెలుసుకుందాం...***

శుకమహర్షి నారాయణ నామస్మరణ చేస్తే కలిగే ఫలితాన్ని గురించి పరీక్షిత్తు మహారాజుకు ఇలా చెప్పాడు. అజామిళుడు అనే ఒక బ్రాహ్మణోత్తముడు ఉండేవాడు. అతడు ఉత్తమసంస్కారం కలవాడు. సదాచారసంపన్నుడే అయినప్పటికీ విధివశాత్తు దరిద్రుడైపోయాడు. వృద్ధాప్యంలోకూడా అన్నిరకాల



రోగాలు దేహంమీద దాడిచేసినప్పటికీ ఆ సంసారబంధంలో, వ్యామోహంలో పడి జీవితాన్ని గడుపుతూ తన చిన్నకుమారుడైన 'నారాయణ'యందు విపరీతమైన ప్రేమతో ఆ కొడుకును, 'నారాయణా! ఇలారా!' అని మాటిమాటికీ పిలిచేవాడు. అలా అతడు తన మరణసమయంలోకూడా తన చిన్నకొడుకును నారాయణా! నా దగ్గరకురా! అంటూ ప్రాణాలు విడిచిపెట్టాడు.

'నారాయణా' అన్న పిలుపువిని విష్ణుదూతలు అక్కడకు వచ్చి ఆ జీవుణ్ణి వైకుంఠానికి తీసుకొనిపోవడానికి సిద్ధమవుతూండగా, యమదూతలు వచ్చారు. వారితో విష్ణుదూతలు ఓ యమదూతలారా! మీరు ధర్మదేవత దూతలు కదా! మీరు చెప్పినట్లు పాపకర్మలు చేసినవారు శిక్షార్హులు. కాని ఈ బ్రాహ్మణుడు తన అవసానదశలో చివరిగా 'నారాయణా' అని పిలుస్తూ ప్రాణాలు వదిలాడు. నారాయణనామస్మరణంవల్ల కోటిజన్మల పాపసంశయం భస్మమైపోయింది. కాబట్టి, ఇప్పుడు ఇతడు పాపరహితుడు. అతడు తన పుత్రుణ్ణే పిలిచినప్పటికీ, నారాయణ నామఉచ్చారణే చాలా మహిమాన్వితమైనది.

సందర్భం ఎటువంటిదైనా, సరదాగా పలికినా, పరిహాసంగా పలికినా, హేళనగా పలికినా 'నారాయణ' నామం సర్వపాపక్షయ కారకం. ఔషధంయొక్క గుణం తెలిసి సేవించినా, తెలియక సేవించినా పనిచేస్తుంది కదా! అదేవిధంగా అంత్యకాలంలో నారాయణనామస్మరణం సర్వపాపహరం. యమదూతలు వారి మాటలకు సంతోషించి వెంటనే వెనక్కి వెళ్లిపోయారు. పరమపాపాత్ముడైనప్పటికీ నారాయణనామస్మరణ చేత పరమపదాన్ని పొందవచ్చు అనే విషయం ఈ 'అజామిళుడు' కథ మనకు తెలియజేస్తోంది.



మానవునిలోని అన్ని గుణాలకీ అలంకారం మంచి శీలం

# శరణాగతి

- ఆచార్య గోగినేని యోగ ప్రభావతీదేవి,
99080 73543

శ్రీ వేంకటేశ్వరుని పాదారవిందములపై భక్తి నిలిపిన అన్నమయ్య 'నమ్మిన దొకటే నాకు నీ శరణము' అని పలికాడు. భగవంతుని శరణుకోరి సేవించిన అన్నమయ్య

'సిరివరుఁడితనిని జేకొని కొలిచిన, పరమసుఖమె పో భయమెక్కడిది' అని భయము లేదని పరమసుఖమే దక్కినదని కీర్తించాడు. అన్నమయ్య శరణాగతిధర్మాన్ని చాలరమ్యముగ ప్రతిపాదించాడు.


'శరణు శరణు నీకు సర్వేశ్వరా నీ, శరణాగతే దిక్కు సమాజ వరదా' అని అన్నమయ్య స్వామిని సవిశేషంగ ప్రార్థించాడు. అన్నమయ్యదృష్టిలో శరణాగతిని మించిన ధర్మం లేదు. ఏమనగా- జీవునకు శక్తియుక్తులేమియు లేవు. ఒకవేళ ఉన్నా అవి అహంకారానికే దారితీస్తాయి గాని వేరుకావు. అందుచేత భక్తితో భారమంతటినీ భగవంతునిమీద వేచి శరణు వేడుటయే శరణాగతి. ఆత్మనిక్షేపం అంగిగా తక్కినవి అంగములుగా గ్రహింపవలసిన షడ్విధ శరణాగతులను అన్నమయ్య చక్కగా వర్ణించాడు.

## 1) ఆనుకూల్యసంకల్పం

భక్తికనుగుణమైన భక్తుని స్వసంకల్పమిందుకు ముఖ్యం.

ఇదియె నాకు మతమిది వ్రతము
నుదుట కర్మము నొల్లనింకను

చక్కగ వేదాలకు, సకలశాస్త్రాలకు గురువైన శ్రీవేంకటనాథునకు శరణంటూ భగవద్విషయంనందు మాత్రమే శ్రద్ధ గలిగియున్నట్లు అన్నమయ్య వర్ణించాడు.



## 2) ప్రాతికూల్యవర్జనం

భగవద్వ్యతిరిక్తములు, భగవద్విరుద్ధములు ఐన విషయాలను పరిత్యజిస్తూ పలికిన వర్ణనమిట్లున్నది.

తలఁగరో లోకులు తడవకురో మమ్ము
కలిగినదిది మా కాపురము

శ్రీపతిని పూజించిన కరములు యాచనకు ప్రయత్నింపవని, హరికడకేగిన కాళ్లు పరులఇండ్లకు పారవని వర్ణిస్తున్నాడు.

## 3) సంశయరాహిత్యం

భగవంతుడు నన్ను తప్పక రక్షిస్తాడు అనేదే మహా విశ్వాసం. 'సంశయాత్మా ప్రణశ్యతి' అని గీతావాక్యం. ఇందువల్ల పరమాత్ముని రక్షకత్వమునుగూర్చికాని, సర్వశక్తిమత్వమును గూర్చికాని భక్తునకు సంశయముండరాదు. ఈ విషయాన్ని అన్నమయ్య ఇలా వర్ణించాడు.

యిదియో కామని దానమిదియో మూలధనము
యిదియె నమ్ముట గాక యితరము లేల

ఇందు భగవద్వాక్యమును అన్నమయ్య త్రికరణశుద్ధిగ విశ్వసిస్తున్నాడు.

## 4) గోప్తృత్వవరణం

భగవంతుడు తప్ప వేరొకరు రక్షణ లేరను భావంతో వర్ణించటం. ఇంకను 'సంసారమనే మంటి కిందటి భక్తునికి భక్తియను బిలద్వారమే దిక్కు' అని 'అన్నింటా అంతర్యామి ఐన శ్రీవేంకటేశుడే దిక్కు' అని వర్ణించాడు.

## 5) కార్పణ్యం

దీనత్వంతో భక్తుడు భగవంతుని వేడుకొనే వర్ణన మిట్లుంది.

విదువరాదెంతైన వెర్రివాఁడనైన నీకు
కదవారు నవ్వకుండాఁ గాచుకో నన్నును

## 6) ఆత్మనిక్షేపం

సర్వేంద్రియ సర్వాత్మ సమర్పణ బుద్ధి. అన్నమయ్య ప్రపత్తినిట్లు నిర్వచించాడు.

భారము నీపై వేసి బ్రదికి యుండుటే మేలు
నారాయణుండ నీవే నాకుంగలవనుచు

అందువలన ఆత్మనిక్షేపం గావించుటొక్కటే గతి. అదియే ప్రపత్తి. అట్టి ప్రపత్తియందే లోకంనందలి వేదములు, వాదములు, వర్ణాశ్రమధర్మాలు, కర్మములు సమస్తము లీనమై పోతాయి.

మే 06న అన్నమాచార్య జయంతి సందర్భంగా...



# అభయహస్తం

- శ్రీ చాకిచెర్ల నాగసుదర్శన్ రావు,
97013 85006

ఇది ఏ జన్మలో చేసిన పుణ్యఫలమోగాని కొలచినవారల కొంగుబంగారమైన ఆ వైకుంఠవాసి మన ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రం లోని శ్రీతిరుమలక్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి అవతారంలో వెలసి,మణిరత్నఖచితమైన అభయముద్ర మరియు వర ముద్రలతో మనల్ని అనుగ్రహిస్తున్నాడు. అందుకే మన అన్నమయ్య ఆ బంగారుచేతుల్ని ఈవిధంగా కీర్తించాడు

**ఇందరికీ అభయంబు లిచ్చు చేయి**
**కందువగు మంచి బంగారు చేయి ॥** , అని

ఈ జీవనపయనం సుఖదుఃఖాల సమన్వయం. అయితే ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఆ స్వామిని మనం శరణు వేడాలి. శరణాగతిద్వారానే మన కష్టాలన్నీ తొలగుతాయి. దీనికి తార్కాణం ఆ శ్రీవేంకటేశ్వరస్వామి అభయముద్రయొక్క విశేషం. మనం తిరుమలకి వెళ్ళి ఆ శ్రీవేంకటేశ్వరుని కుడిహస్తాన్ని దర్శించినప్పుడు ఈ సందేశం మనకు తెలుస్తుంది.

ఆ స్వామి అభయహస్తమైన కుడిచేయి, చిత్రపటంలో చూపిన విధంగా, కిందకి సూచిస్తూ ఉంటుంది, అంటే ఆయన పాదాలను ఎవరు శరణువేడుతారో వారికి ఎటువంటి కష్టాలు కలగకుండా నేను కాపాడుతాను అని అభయాన్ని ఇస్తున్నారు శ్రీవేంకటేశ్వరస్వామి. మన కష్టాలభయాన్ని తొలగిస్తాడు. ఇదే ఆ అభయముద్రలోని విశేషం.

అదేవిధంగా ఆ స్వామి వరముద్ర ఐన ఎడమచేతిని దర్శించినప్పుడు మనకు మరోవిషయం ద్యోతకమౌతుంది, అదేం టంటే, ఈ సంసారసాగరాన్ని మోకాలులోతుకంటే ఎక్కువ మునుగనీ కుండా దాటిస్తాను అని. మన కష్టాలన్ని తొలగిపోయి ఈ సంసార మనే సాగరాన్ని అమిత సునాయాసంగా దాటాలంటే ఆ మంగళ స్వరూపునికి శరణాగతి చేయటంద్వారానే వీలవుతుందనే అమిత ముఖ్యమైన ఈ విషయాన్ని మనం కడు శ్రద్ధతో గమనించాల్సి ఉంటుంది. ఇది అభయముద్ర, వరముద్రలోని విశేషం.

ఆ శ్రీవేంకటేశ్వరస్వామి అభయముద్ర, వరముద్రల అను గ్రహాన్ని పొందాలంటే ఆ స్వామిని దర్శించటంతో పాటు ఆయన మనకు శృతిలో తెలియచేసిన మరికొన్ని విషయాలను మనం ఆచరిం చాల్సి ఉంటుంది.

ఈ శరీరం స్థూలపదార్థంతో తయారయింది. దానికన్నా ఉన్నతమైనవి ఐదు జ్ఞానేంద్రియములు (రుచి, స్పర్శ, చూపు, వాసన మరియు శబ్దముల అనుభూతిని గ్రహించేవి). ఇంద్రియములకన్నా మించినది మనస్సు. మనస్సుకన్నా ఉన్నతమైనది విచక్షణాశక్తి కలిగిన బుద్ధి. కానీ ఈ బుద్ధికన్నా మించినది దివ్యఆత్మ.

ఇంద్రియములు, మనస్సు, బుద్ధి- ఇవి కోరికల మూల స్థానం అని చెప్పబడుతాయి. వాటిద్వారా అది వ్యక్తి జ్ఞానాన్ని మరుగు పరుస్తుంది మరియు జీవాత్మని భ్రమకి గురిచేస్తుంది. చాలా అసంబద్ధము, అధర్మమైన కోరికలు ఇంద్రియాలు. మనస్సు - బుద్ధిలో నుండి వాటి ఆధిపత్యాన్ని జీవాత్మపై చలాయిస్తుంది. ఇంద్రి యాలు మనస్సుని, బుద్ధిని తప్పుదారి పట్టిస్తాయి. నిప్పు పొగచే కప్పబడినట్టుగా, దుమ్ముచే అద్దం మసకబారినట్టుగా, గర్భాశయంచే భ్రూణశిశువు ఆచ్ఛాదింపబడ్డట్టుగా-ఒక వ్యక్తి జ్ఞానం, కామం (కోరిక)తో కమ్మివేయబడుతుంది. అప్పుడు బుద్ధి తన విచక్షణాశక్తిని కోల్పోతుంది. కామమనేది ఎంత బలమైన శత్రువంటే అది బుద్ధి యొక్క విచక్షణాశక్తిని కప్పివేస్తుంది. బుద్ధి మసకబారినప్పుడు, వ్యక్తి చిత్తభ్రాంతికి లోనయ్యి ఆ కోరికలని తీర్చుకోటానికి ఎంతటి దుష్కర్మలు చేయటానికయినా సిద్ధమవుతాడు. మన కోరికల స్థాయిని బట్టి మనం విన్న, చదివిన ఆధ్యాత్మికజ్ఞానం మరుగునపడిపోతుంది.

ఈ ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి- అనేవి తమంత తామే చెడ్డవి కావు. అవి మనకు భగవత్ప్రాప్తికి సహకరించ టానికి ప్రసాదించబడ్డాయి. కానీ మనమే అధర్మమైన కోరికలకు వశమై, నిగ్రహశక్తిని కోల్పోయి, అవి మనపై దాడి చేయటానికి అనుమతిస్తున్నాం. భగవంతుడు ప్రసాదించిన ఆత్మశక్తి, సాధన ద్వారా మనం నిగ్రహశక్తిని పెంపుందించుకుని మన మనస్సుని, బుద్ధిని సన్మార్గంలో పెట్టినప్పుడు ఆ స్వామి సంపూర్ణ అభయాన్ని పొందగలం. ఇంద్రియ మనోబుద్ధులను మన ఉద్ధరణకోసం వినియోగించుకోవాలి.

శ్రీకృష్ణభగవానుడు కామమనే(కోరికలు) శత్రువుని ఆత్మ జ్ఞానంద్వారా నిర్మూలించమని ఉద్ఘాటిస్తున్నాడు. ఆత్మ అనేది భగవంతుని అంశ కాబట్టి అది దివ్యమైనది. అంటే, అది కోరు కునే దివ్యానందం ఆత్మజ్ఞానంద్వారానే లభ్యమవుతుంది. ఎందు కంటే ప్రాపంచికవస్తువులన్నీ భౌతికమైనవే. ఈ భౌతికవస్తు / విషయాలు, ఆత్మయొక్క గాఢమైన అంతర్లీనతపనని తీర్చలేవు. కాబట్టి వాటికోసం కోరికలను సృష్టించుకోవటం నిష్ప్రయోజన మైన పని. కాబట్టి నిజమైన సుఖాన్ని పొందాలంటే పరమాత్మ జ్ఞానంద్వారా మనస్సును, బుద్ధిని నియంత్రించి ఇంద్రియాలను వశపరుచుకొని సన్మార్గంలో నడవాలి.

కఠోపనిషత్తులో ఈ విషయం, ఒక రథం ఉదాహరణ ద్వారా చాలా అద్భుతంగా వివరించబడింది.

ఐదుగుఱ్ఱాలచే గుంజబడే ఒక రథం ఉంది. ఆ గుఱ్ఱా లకు నోటియందు పగ్గాలున్నాయి. ఆ పగ్గాలు రథసారథి చేతిలో ఉన్నాయి. ఆ రథం వెనుకభాగంలో ఒక ప్రయాణికుడు ఉన్నాడు. అసలైతే, ఆ ప్రయాణికుడు, రథసారధికి దిశానిర్దేశం చేయాలి. సారథి అప్పుడు పగ్గాలతో గుఱ్ఱాలకి దిశానిర్దేశం చేయాలి. కానీ, ఈ విషయంలో ప్రయాణీకుడు నిద్రపోతు న్నాడు. కావున గుఱ్ఱాలు తమ ఇష్టానుసారం ఉన్నాయి.

ఈ ఉపమానంలో రథం అంటే శరీరం. గుఱ్ఱాలు అనేవి ఐదు ఇంద్రియాలు. గుఱ్ఱాల నోటియందు ఉన్న పగ్గాలు మనస్సు. రథసారధి బుద్ధి. వెనుక కూర్చున్న ప్రయాణికుడు శరీరంలో ఉన్న జీవాత్మ. ఇంద్రియాలు (గుఱ్ఱాలు) భోగాలని కోరతాయి. మనస్సు (పగ్గాలు) ఇంద్రియాలపై (గుఱ్ఱాలపై) నియంత్రణ చేయటం లేదు. బుద్ధి (సారధి) పగ్గాల (మనస్సు) లాగుడుకి వశమైపోతాడు. కాబట్టి భౌతికంగా బద్ధుడై ఉన్న స్థితిలో అయోమయానికి గురై ఉన్న ప్రయాణికుడు అనే జీవాత్మ బుద్ధిని సరియైనదిశలో నడిపించటం లేదు. అప్పుడు రథం ఎట్లాపోవాలి అన్న విషయాన్ని ఇంద్రియాలే నిర్దేశిస్తాయి. ఇంద్రియసుఖాలను జీవాత్మ పరోక్షంగా అనుభవిస్తుంది, కానీ అవి దానికి సంతృప్తిని ఇవ్వలేవు. ఈ రథంలో కూర్చునిఉన్న జీవాత్మ(ప్రయాణికుడు) అలా అనంతకాలంనుండి భౌతిక ప్రపంచంలో తప్పుదారిలో తిరుగుతూనే ఉన్నాడు.

కానీ, ఒకవేళ జీవాత్మ తన ఉన్నతమైనస్వభావంతో మేల్కొని చురుగ్గా వ్యవహరిస్తే అది బుద్ధిని సరియైనదిశలో పెట్టవచ్చు. అప్పుడు బుద్ధి, తక్కువస్థాయి అస్థిత్వాలయిన మనస్సు, ఇంద్రియాలను సరిగ్గా నియంత్రిస్తుంది- అప్పుడే రథం శాశ్వతసంక్షేమందిశగా కదులుతుంది. ఈ జీవాత్మ సరైనదిశలో ప్రయాణించటానికి ఎల్లప్పుడూ ఆ పరమాత్మను ఆశ్రయించాలి. ఈవిధంగా, తక్కువస్థాయిస్వరూపాన్ని (ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి) నియంత్రించటానికి పరమాత్మను ఆశ్రయించాలి.

***మే 31నుండి జూన్ 08వరకు అప్పలాయగుంట,***
***శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం సందర్భంగా...***

దైవీసంపదతో కూడిన లక్షణాలను కలిగి, ఆసురీ సంపద లక్షణాలను వదిలివేయటంద్వారా మనం చాలా సులభంగా ఆ ప్రసన్న శ్రీవేంకటేశ్వరుని అభయవరముద్రల అనుగ్రహాన్ని తప్పకుండా పొందగలం.

దైవీసంపద కలవాని లక్షణాలు ఇవి- కల్మషం లేని మనస్సు, దానం, ఇంద్రియనిగ్రహం, పవిత్రగ్రంథపఠనం, అహింస, సత్యసంధత, క్రోధంలేకుండటం, త్యాగం, శాంతం, ఇతరులదోషాలు వెతక్కుండా ఉండటం, సర్వప్రాణులపట్ల దయ, దురాశ లేకుండటం, సౌమ్యత, అణకువ మరియు క్షమా గుణం, ఎవరిపట్లా శత్రుత్వం లేకుండటం మరియు దాంభికం లేకుండటం. ఆధ్యాత్మికజ్ఞానంలో దృఢసంకల్పం.

తద్విరుద్ధమైన లక్షణాలు ఆసురీలక్షణాలు- ద్వేషం, దంభం, దురహంకారం, గర్వం, క్రోధం, లోభం, హింస మరియు అజ్ఞానం అనేవి ఆసురీస్వభావమున్న వారి గుణాలు. ఆత్మవినాశనానికి దారితీసే ఈ ఆసురీగుణాలు నరకద్వారాలు. కనుక అందరూ వీటిని విడిచిపెట్టాలి. అప్పుడే భగవతాశ్రయం లభిస్తుంది. కనుక మనమందరం దైవీసంపదలక్షణాలు కలిగి, ఆసురీలక్షణాలను విడిచిపెట్టి ఆ కలియుగదైవమైన ఆ శ్రీవేంకటేశ్వరస్వామిని శరణు వేడుకుందాం. ఆ స్వామి పరిపూర్ణ అభయాన్ని పొంది సుఖజీవితాన్ని గడుపుదాం.

# నాగవల్లీదళం

– శ్రీమతి ఎన్.సి.హెచ్.శ్రీలక్ష్మి, 73969 55116

హిందూధర్మంలో నాగవల్లీదళం విశిష్టమైన ప్రాముఖ్యతను కలిగిఉన్న పర్ణము. ఈ నాగవల్లీదళంకే తమలపాకు అని మరొక పేరు. తమలపాకును అష్టమంగళాల్లో (పూలు, అక్షతలు, ఫలాలు, అద్దం, వస్త్రం, తమలపాకు మరియు వక్క, దీపం, కుంకుమ) ఒకటిగా భావిస్తారు.

కలశపూజలో మరియు సంప్రోక్షణలు చేసేటప్పుడు తమలపాకును వాడతారు. పూజల్లో, నోముల్లో, వ్రతాల్లో తమల పాకు మొట్టమొదట ఉండవలసిన వస్తువు. పసుపు గణపతినీ, గౌరీదేవినీ తమలపాకుపైనే అధిష్ఠింపజేస్తాం. క్షీరసాగర మథనంలో వెలువడిన అనేక అపురూపమైన వస్తువుల్లో తమల పాకు ఒకటని స్కాందపురాణంలో చెప్పబడింది.

తమలపాకు మొదటిభాగంలో కీర్తి, చివరిభాగంలో ఆయువు, మధ్యభాగంలో లక్ష్మీదేవీ నిలిచిఉంటారు. తమలపాకు సకలదేవతాస్థానంగా చెప్పబడుతుంది. తమలపాకు పైభాగంలో ఇంద్రుడు, శుక్రుడు; మధ్యభాగంలో సరస్వతీదేవి, చివరలో మహా లక్ష్మీదేవి; కాడకీ కొమ్మకీ మధ్యన జ్యేష్ఠా దేవి, తమలపాకు అంతటా విష్ణుమూర్తి; పైభాగంలో శివుడు, కామధేనువు ఉంటారు. ఎడమవైపున పార్వతీదేవి, మాంగల్యదేవి; కుడి భాగంలో భూమాత నెలవై ఉంటారు. ఇలా గోమాతవలె సర్వదేవతలకు ప్రతిరూపంగా తమలపాకు వైశిష్ట్యాన్ని పొంది ఉంది.

ముఖ్యంగా ఆంజనేయునిపూజలో తమలపాకులకు అత్యంత ప్రాధాన్యత ఉంది. ఆంజనేయుడు ఎక్కువగా తమల పాకుతోటల్లో విహరిస్తాడని పురాణవచనం. హనుమంతునికి తమలపాకుమాలవేస్తే సకలసంపదలు చేకూరుతాయనీ, గ్రహ దోషాలుకానీ, దృష్టిదోషాలుకానీ దూరమౌతాయి.



**ఆంజనేయస్వామి రుద్రసంభూతుడు. తమల పాకులు శాంతినిస్తాయి. అందువల్ల తమలపాకులతో పూజించడంవల్ల మనకుకూడా శాంతి, సుఖం లభి స్తాయి. తమలపాకులతో పూజించడంవల్ల నాగదోష శాంతికూడా కల్గుతుంది. శని, మంగళవారాల్లో తమల పాకులతో పూజ హనుమంతుని ఆరాధనలో ముఖ్య మైనది. హనుమారాధన భోగ, మోక్షములను రెండిం టినీ ఇస్తుంది.**

చిన్నపిల్లలు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు సైతం తమలపాకుమాలను ఆంజనేయునికి సమర్పిస్తే చాలు వారు ఆరోగ్యభాగ్యాలతో విలసిల్లుతారని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇన్ని విశేషసుగుణాలు కలిగినవి కాబట్టే తమలపాకులు అంజనాసుతుడైన ఆంజనేయుని అర్చనలో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. హనుమప్రీతిని పొందాయి.

విశిష్టశక్తిసంపన్నుడైన హనుమ వైశాఖమాసం, కృష్ణపక్షం, దశమితిథి, శనివారం, పూర్వాభాద్ర నక్షత్రయుక్త కర్కాటక లగ్నం, వైధృతినామయోగం, గ్రహాలన్నీ శుభస్థానాలలో ఉన్న మధ్యాహ్నతరుణంలో జన్మించాడు.

రామచంద్రుడు సీతమ్మకోసం అన్వేషణ మొదలు పెట్టాడు. రామునికి అన్వేషణలో సాయపడుతోన్న హనుమంతుడు అశోకవనం చేరుకున్నాడు. అక్కడే సీతమ్మ ఉన్న విషయాన్ని




శ్రీరామునితో చెప్పాలని బయలదేరాడు. ఐతే ఆ సమయంలో తమకు ఇంత మేలు చేస్తున్న ఆంజనేయుణ్ణి సీతమ్మ ఆశీర్వదించే ప్రయత్నం చేసింది. కానీ, అక్కడ చుట్టుపక్కలా ఎక్కడాకూడా సీతమ్మకి పుష్పాలు దొరకకపోవడంతో.. పుష్పాలకు బదులుగా తమలపాకును కోసి, ఆంజనేయుని తలమీదపెట్టి దీవించిందట. అందుకే హనుమంతుడికి తమలపాకులు అంటే ప్రీతిపాత్రమైనవి. అంతేకాదు, సీతమ్మవద్దనుంచి తిరిగి వెళ్తూ.. ఆకాశంలో పయనిస్తూ, గట్టిగా హూంకరించాడు ఆంజనేయుడు. అది విన్న వానరులకు.. ఆంజనేయుడు ఖచ్చితంగా సీతమ్మజాడ తెలుసుకునే వస్తున్నాడని అర్థం చేసుకున్నారు. దీంతో వానరులంతా హనుమంతుడు రాగానే తమలపాకులతీగలతో సన్మానం చేశారు. అదిచూసి హనుమంతుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడని ఒక కథనం.

హనుమంతుడు లంకానగరానికి వెళ్ళి సీతమ్మవారి జాడ తెలుసుకున్నాడు. ఆమెకు ధైర్యం చెప్పి.. శ్రీరాముడి సైన్యంపట్ల లంకానగరవాసులకు భయం కలిగేలా చేశాడు. ఆ తరువాత అక్కడినుంచి తిరిగివచ్చి రాముణ్ణి కలుసుకుని.. సీతను చూసిన విషయం చెప్పాడు. సంతోషించిన శ్రీరాముడు అక్కడున్న తమలపాకులను తెంపి మాలగా చేసి ఆయన మెడలో వేసి అభినందించాడు. శుభవార్తను తెచ్చినవారికి తమ దగ్గరున్న ఖరీదైన వస్తువును బహూకరించడం అప్పట్లో ఒక సంప్రదాయంగా ఉండేది. రాముడు వనవాసంలో ఉన్నాడు కనుక ఆభరణాలకు బదులు శ్రేష్ఠమైన తమలపాకులమాల వేశాడు.


ఇక హనుమంతుడు లంకానగరంలోని కొన్ని భవనాలను తగులబెట్టి మరీ వచ్చాడు. అందువల్ల ఆయన శరీరం వేడిగా ఉండటంతో, తాపాన్ని తగ్గించడంకోసం రాముడు ఆయన మెడలో తమలపాకులమాలను వేసినట్టు పురాణాలు చెప్తున్నాయి. ఆ తమలపాకులమాల మెడలో పడగానే అప్పటివరకూ హనుమంతుడు పడిన శ్రమనంతా మరచి సంతోషంతో పొంగిపోయాడు. అందుకే తమలపాకులతో పూజచేస్తే కోరుకున్న వరాలను హనుమంతుడు ప్రసాదిస్తాడు.

ఒకసారి సీతమ్మతల్లి అందించే తమలపాకుల చిలుకల్ని సేవిస్తున్న శ్రీరామునివద్దకు వచ్చిన ఆంజనేయుడు శ్రీరాముణ్ణి "స్వామీ ఏమిటది? మీ నోరు అంత ఎర్రగా ఎందుకయ్యింది?"



అని అడిగాడు. అప్పుడు రాముడు 'తమలపాకులు తింటే నోరు ఎర్రగా అవుతుంది. అంతేకాదు ఆరోగ్యానికి చాలా మంచిది అని చెప్పాడు. అదివిన్న ఆంజనేయుడు వెంటనే అక్కడినుండి వెళ్లిపోయి కొంతసేపటికి ఒళ్లంతా తమలపాకులను కట్టుకొని గంతులు వేసుకుంటూ ఆనందంగా వచ్చాడు.

అంజనేయస్వామిని తమలపాకులతో పూజించటంవల్ల కలిగే ప్రయోజనాలు: రోగాలతో ఇబ్బందులు పడేవారికి త్వరగా గుణం కనిపిస్తుంది. మంత్రసంబంధమైన పీడలు తొలగిపోతాయి. సంసారంలో సుఖం లభిస్తుంది. తమలపాకులు, పండ్లు దక్షిణ సమేతంగా దానంచేస్తే వ్యాపారం వృద్ధిలోకి వస్తుంది. సంఘంలో గౌరవం లభిస్తుంది. శనీశ్వరుని అనుగ్రహం కలుగుతుంది. సుందరకాండ పారాయణంచేసి స్వామికి తమలపాకులహారాన్ని వేస్తే అన్నికార్యాల్లో విజయం సిద్ధిస్తుంది. హనుమాన్‌చాలీసా చదివి స్వామిని ప్రార్థించి తమలపాకులహారాన్ని వేస్తే పర మాత్ముని అనుగ్రహం కలుగుతుంది. వాద ప్రతివాదాల్లో జయం మనదే అవుతుంది. గంగాదేవి సంతృప్తిపడుతుంది. తమల పాకును భక్తులకు ప్రసాదంగా ఇచ్చేదాన్నే పర్ణప్రసాదమంటారు. ఈ పర్ణప్రసాదం స్వీకరించినవారిపై స్వామి అనుగ్రహం తప్పక ప్రసరిస్తుంది. తమలపాకు ఆంజనేయునికి సమర్పించి అటు ఆరోగ్యసంపదను, పరలోకసంపదను సంపాదించుకుందాం. వాయుసుతుని అనుగ్రహానికి పాత్రులమవుదాం.



108 దివ్యదేశాలు

# తిరుక్కుడందై

## (కుంభకోణం)

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్

శ్లో॥ శ్రీహేమంబుజినీ తటీ తు నగరే శ్రీకుంభఘోణాభిదే
ప్రాప్తః కోమల వల్లికాఖ్య మహిషీం శ్రీవైదికాగారగః।
హేమాఖ్యాన మునీక్షితో విజయతే శ్రీశార్ఙ్గపాణి ప్రభుః
ప్రాగాస్యో భుజగేంద్ర భోగశయనోऽ తృప్తామృతాఖ్యాయుతః॥

తమిళనాడులోని 'కుంభకోణ'మే 'తిరుక్కుడందై' అనే దివ్యదేశం. ఈ దివ్యదేశం అనేక దేవాలయాలసముదాయంగా భాసిల్లుతోంది. ఈ క్షేత్రానికే 'భాస్కరక్షేత్రం' అని పేరు. శైవ వైష్ణవదేవాలయాలతో ఈ క్షేత్రం విరాజిల్లుతోంది. శ్రీరంగంవలె కావేరి మరియు కొల్లడం నదులతో మూడుఎకరాల విస్తీర్ణంతో, మూడుప్రాకారాలతో మరియు నూటయాభైఅడుగుల ఉన్నతస్థితి గోపురంతో ఉన్నటువంటి, అద్భుతమైనటువంటి ప్రకృతి శోభతో వెలసిల్లియున్నది ఈ దివ్యదేశం.

ఈ దివ్యదేశంలో వేంచేసి ఉన్నటువంటి మూలవర్లు 'ఆరావముదాళ్వాన్'. ఉత్సవమూర్తి 'సారంగపాణి'. అమ్మవారు 'కోమలవల్లి'. భక్తులు ఈ దేవాలయాన్ని సారంగపాణి దేవాలయంగా చెప్తుంటారు. ఉత్సవమూర్తి సారంగపాణి ఒక ధనుస్సును చేత పట్టుకొని అందరికీ దర్శనభాగ్యాన్ని కలిగిస్తున్నాడు. శ్రీరంగంలాగానే ఈ స్థలంలో మూలమూర్తి ఆదిశేషుని మీద పవళించి అందరినీ అనుగ్రహిస్తున్నాడు. కానీ స్వామివారి యొక్క ఆ తిరుముఖమండలం కాస్త పైకి తొంగిచూసినట్టు కనిపిస్తుంది. అంటే తిరుమళిశైఅళ్వార్‌వారిని అనుగ్రహించినట్టు ఉత్థానశాయిగా స్వామి వేంచేసి ఉంటాడు.

గర్భగృహంలో ఒకేరాతితో, అలాగే రథబంధంతో ఏనుగులు, గుర్రాలు ఇవి లాక్కుని పోయేటట్టు అత్యద్భుతమైనటువంటి కళాశోభతో ఈ దేవాలయం విలసిల్లి ఉంటుంది. రెండు వాకిళ్ళతో అంటే దక్షిణాయనవాశలని, ఉత్తరాయనవాశలని రెండుద్వారాలు ఉంటాయి. దక్షిణాయణంలో దక్షిణంవైపు ఉన్నటువంటి ద్వారంద్వారా భగవంతుని సేవించుకోవాలి. ఉత్తరాయణంలో ఉత్తరద్వారంద్వారా భగవంతుని సేవించుకోవాలి. రథబంధం అనే ఒక ప్రక్రియతో తిరుమంగైఆళ్వార్ వారు ఒక ప్రబంధాన్ని సమర్పించారు.

స్థలపురాణంప్రకారం బ్రహ్మ సృష్టిచేసేసందర్భంలో దానికి తగినటువంటి సామగ్రిని మరియు అమృతాన్ని ఒక కుండలో పెట్టగా, మహాప్రళయప్రవాహంలో ఆ కుండ అలాగే కొట్టుకుపోయినట్టు, ఆ కుండ శివుడు వేసినటువంటి బాణాలతో పగిలిపోయినట్టూ, అందులో ఉన్నటువంటి అమృతం ఈ దివ్య దేశానికి కొట్టుకు వచ్చిందని, ఆ కుండయొక్క ముఖభాగం పగిలిపోయిందనీ, కావున దానికి 'కుడమూక్కు' అని పేరు పెట్టారు. కాలక్రమంలో 'కుంభకోణం' అని ఈ క్షేత్రానికి పేరు కూడా వచ్చిందని పురాణగాథ.

రెండవచరిత్ర– ఒక సమయంలో మహర్షులు పలువురు లోకక్షేమార్థం 12సంవత్సరాలపాటు ఒకయాగాన్ని అనుష్ఠించారు. యాగహవిస్సును ఎవరికి సమర్పించాలి? అని మహర్షులకి ఒక సందేహం. అప్పుడు భృగుమహర్షి నేను దీనిని నిశ్చయిస్తాను అని చెప్పి, క్రమంగా బ్రహ్మలోకానికి వెళ్ళాడు, భంగపడ్డాడు. కైలాసానికి వెళ్ళాడు, అక్కడకూడా భంగపడ్డాడు. అలాగే శ్రీవైకుంఠానికి వెళ్ళాడు. అక్కడి సన్నివేశాన్నిచూచి, కోపంతో స్వామివారియొక్క వక్షఃస్థలంపై తనకాలితో తన్నగా, అంతటినీకూడా అమ్మవారు చూస్తూ, తనకు ఇష్టమైనటువంటి వక్షఃస్థలంపైన తన్నినటువంటి ఆ మహర్షిని నారాయణుడు అలా ప్రాధేయపడడం అవమానంగా భావించి, వైకుంఠంనుండి బయలుదేరి ఈ క్షేత్రానికి వచ్చిందట. వచ్చిన వెంటనే ఇక్కడ ఒక బంగారు 'పొత్తామరై' అనే పుష్కరిణిలో ఒక చిన్నబిడ్డలాగా అవతరించి ఇక్కడ తపస్సుచేస్తూ ఉండిందట. తటాకంలోని ఈ బిడ్డను చూచి




హేమమహర్షి తన ఇంటికి తీసుకువెళ్లి పెంచి, కోమలవల్లి అని పేరుపెట్టి, ఆ అమ్మాయికి వివాహవయస్సులో వైదికంగా శయన భంగిమలో ఉన్నటువంటి ఆరావముదస్వామితో వివాహం చేయించారు. ఇది ఒక స్థలపురాణం.

ఈ స్వామికి ఆళ్వాన్ అనే పేరు రావడానికి కారణం ఏమిటి అంటే తొమ్మిదవశతాబ్దంలో శ్రీమన్నాథమునులవారు దివ్యదేశయాత్ర చేస్తూ ఈ దివ్యదేశానికి వచ్చారు. ఇక్కడ ఉన్నటువంటి ఈ స్వామిని దర్శించుకుంటూ ఉండగా, ఆ సమయంలో శ్రీవైష్ణవులు ఒక పాశురాన్ని అనుసంధానం చేస్తున్నారు. ఇలా వెయ్యిపాశురాలతో కూడి ఉన్నటువంటిది అని చెప్పగా, మిగిలిన పాశురాలు ఎక్కడ ఉన్నాయి? అని నాథమునులవారు అడగ్గా, అప్పుడు మాకు ఈ విషయంగురించి తెలియదు అని అక్కడ ఉన్నవారు చెప్పగా, నాథమునులవారి కలలో స్వామివారు కనిపించి, ఆళ్వార్ తిరునగరికి వెళ్ళమని చెప్పగా, నాథమునులవారు అక్కడనుండి బయలుదేరి నమ్మాళ్వార్ల శిష్యుడైనటువంటి మధురకవిఆళ్వార్లయొక్క 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' ప్రబంధాన్ని 12వేలసార్లు జపంచేసి యోగదశలో నమ్మాళ్వార్లయొక్క అనుగ్రహాన్ని పొంది, 4000పాశురాలను రాగ తాళబద్ధంచేసి ఈ లోకానికి అనుగ్రహించారు నాథమునులవారు. దీనికి అంతటికీ కారణం ఈ ఆరావముదస్వామి. అందువల్ల వీరికి 'ఆరావముదాళ్వాన్' అని పేరు వచ్చింది.

భక్తపరాధీనుడు ఈ సారంగపాణి. ఈ స్వామికి పరమ భక్తుడిగా లక్ష్మీనారాయణ అని ఒకతను ఉండేవాడు. అతడు అద్భుతమైనటువంటి రాజగోపురాన్ని కట్టించాడు తనయొక్క సంపాదనతోనే. వివాహం చేసుకోకుండా ఈ స్వామికే అంకితమై 150అడుగుల గంభీరమైన రాజగోపురాన్ని కట్టించాడు. ఇతడు కాలాంతరంలో పరమపదించాడు. కానీ అంతిమ కైంకర్యాన్ని చేయడానికి ఆ సమయంలో ఎవరూ రాలేదు. అప్పుడు ఆరావముదస్వామి అర్చకుని ఆదేశించి, తనచేతిలో దర్భను పెట్టుకుని, ప్రాచీనావీతిగా యజ్ఞోపవీతాన్ని ధరించి, తన భక్తుడికి అంతిమసంస్కారాన్ని చేశాడని, మరుసటిరోజు అందరూ స్వామిని వెళ్లిచూడగా, వారిచేతిలో దర్భపవిత్రమున్నది. ఒక తడిబట్టతో స్వామి ఉన్నాడు. యజ్ఞోపవీతం మారి ఉన్నది. ఇదంతా చూసిన వెంటనే సాక్షాత్తు భగవంతుడే స్వయమేవ కారయతి అని చెప్పినరీతిగా, ఆ భక్తుణ్ణి కరుణించాడు అని ఈనాటికికూడా తమిళనెల ఐప్పసి అమావాస్యనాడు (దీపావళి నాడు) శ్రాద్ధాన్ని భగవంతుడు చేయిస్తున్నాడు అనే ఐతిహ్యాన్ని కొనసాగిస్తున్నారు. ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలి? భగవంతుడు భక్తపరాధీనుడు కదా!

భగవంతుడు అపర్యాప్త అమృతుడు సారంగపాణి. ఆరావముదన్ అని పేరు. అమ్మవారు కోమలవల్లి. తీర్థం హేమ పుష్కరిణి. కావేరి కొల్లిడంల మధ్యస్థలం. భాస్కరక్షేత్రం. విమానం వైదికవిమానం. పాంచరాత్రాగమం.

**శ్రీభూత మహాదాఖ్యాన భక్తిసార శఠారిభిః।**
**విష్ణుచిత్త కలిఘ్నాఖ్యాం గోదాస్తుతి పరిష్కృతః॥**



పూదత్తాళ్వార్, పేయాళ్వార్, తిరుమళిశైఆళ్వార్, నమ్మాళ్వార్, పెరియాళ్వార్, ఆండాళ్ మరియు తిరుమంగైయాళ్వార్లు ఈ స్వామిని మంగళాశాసనం చేసి ఉన్నారు. ఇటువంటి కోమలవల్లి నాయికాసమేతుడైన ఆరావముదస్వామిని ఎవరైతే దర్శించుకుంటారో వారికి సకల విద్యలు ప్రాప్తించి, సకలవిధమైనటువంటి శ్రేయస్సులు కలిగి ఇహపరలోకంలో సౌఖ్యంగా ఉండగలరు.

## చెన్నైలో 17-03-2023న జరిగిన తి.తి.దే. వారి
# శ్రీపద్మావతిదేవి ఆలయ మహాకుంభాభిషేక
## కార్యక్రమ దృశ్యాలు.

అందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు
శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, ఇతర అధికారులు,
ప్రముఖులు మరియు భక్తులు





















## తిరుపతి
## శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

2023 మే 26 నుండి జూన్ 03 వరకు

**26-05-2023 శుక్రవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం.

**27-05-2023 శనివారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం.

**28-05-2023 ఆదివారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**29-05-2023 సోమవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం.

**30-05-2023 మంగళవారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం.

**31-05-2023 బుధవారం**
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం.

**01-06-2023 గురువారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం.

**02-06-2023 శుక్రవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం.

**03-06-2023 శనివారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం.



## నాగులాపురం
## శ్రీ వేదవల్లీ సమేత శ్రీ వేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం

2023 మే 4 నుండి 12 వరకు

**04-05-2023 గురువారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం.

**05-05-2023 శుక్రవారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం.

**06-05-2023 శనివారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**07-05-2023 ఆదివారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం.

**08-05-2023 సోమవారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం.

**09-05-2023 మంగళవారం**
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం.

**10-05-2023 బుధవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం.

**11-05-2023 గురువారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం.

**12-05-2023 శుక్రవారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం.



## కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం

**2023 మే 13 నుండి 21 వరకు**

**13-05-2023 శనివారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం.

**14-05-2023 ఆదివారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం.

**15-05-2023 సోమవారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**16-05-2023 మంగళవారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం.

**17-05-2023 బుధవారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం.

**18-05-2023 గురువారం**
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం.

**19-05-2023 శుక్రవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం.

**20-05-2023 శనివారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం.

**21-05-2023 ఆదివారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం.




## హృషీకేశ్, నారాయణవనం, అప్పలాయిగుంట శ్రీ స్వామి వార్ల బ్రహ్మోత్సవం

**2023 మే 31 నుండి జూన్ 08 వరకు**

**31-05-2023 బుధవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం.

**01-06-2023 గురువారం**
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం.

**02-06-2023 శుక్రవారం**
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం.

**03-06-2023 శనివారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం.

**04-06-2023 ఆదివారం**
పగలు: పల్లకీలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం.

**05-06-2023 సోమవారం**
పగలు: హనుమద్వాహనం
రాత్రి: గజవాహనం.

**06-06-2023 మంగళవారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం.

**07-06-2023 బుధవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం.

**08-06-2023 గురువారం**
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం.




తిరుమల శ్రీవారికి 03-03-2023 నుండి 07-03-2023 వరకు జరిగిన తెప్పోత్సవ కార్యక్రమ దృశ్యాలు.
అందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.




తిరుమల రంగనాయకమండపంలో శ్రీసీతారామలక్ష్మణసమేత హనుమంతులవారికి 30-03-2023న వైభవంగా జరిగిన స్నపన తిరుమంజనం కార్యక్రమం. అందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు.



తిరుపతి వేదవిశ్వవిద్యాలయంలో 31-03-2023న జరిగిన శ్రీసుదర్శన హోమ కార్యక్రమం. అందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు



తిరుమల శ్రీవారి దర్శనార్థం 04-03-2023న విచ్చేసిన విశాఖ శారదపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రసరస్వతిస్వామి, ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్రస్వామివార్లకు స్వాగతం పలికిన తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.




తిరుపతి, మహతి కళామందిరంనందు తి.తి.దే.వారి ఆధ్వర్యంలో 08-03-2023న జరిగిన మహిళాదినోత్సవ కార్యక్రమ దృశ్యాలు.
అందులో పాల్గొన్న తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీమతి సదా భార్గవి, ఐ.ఏ.ఎస్.,
శ్రీ శక్తిపీఠం పీఠాధీశ్వరి శ్రీమాతా రమ్యానందభారతిస్వామిని మరియు ఇతర ప్రముఖులు.

గృహలక్ష్మి

# కదళి


- శ్రీమతి వావిలాల నాగవల్లి,
93912 97650


**బంగారువర్ణంతో మెరిసిపోతూ**
**మధురాతి మధురమైన రుచితో**
**కాలంతో నిమిత్తం లేకుండా ఎల్లవేళలా**
**భగవంతుని సన్నిధిని నిలుచు కదళీ**

భగవంతుడికి పెట్టే నైవేద్యాలలో కదళీఫలం అగ్రస్థానం వహిస్తుంది. దీనికి రంభాఫలం, చక్కెరకేళి, అమృతపాళి, అరటిపండు అని పలురకాల పేర్లున్నాయి. కదళీవృక్షజననంలో ఒక ప్రత్యేకత ఉంది.

"కదళి" అంటే సామాన్యమయింది కాదు. ఆమె దుర్వాసమహర్షి భార్య. దుర్వాసమహర్షి దంపతులిద్దరు ఒక పర్ణశాలలో నివసిస్తున్నారు. ఆయనకు కోపం చాలా ఎక్కువ. ఆయన కోపాన్ని తెలిసిన కదళి భర్త కోపానికి గురికాకుండా ఉండటానికి నిరంతరం ఎంతో జాగ్రత్తగా ప్రవర్తించేది.



అలసిపోయి ఉన్న దుర్వాసుడు ఒకనాడు సంధ్యా సమయంలో పడుకుని అలాగే గాఢనిద్రలోకి జారుకున్నాడు. సాయంసంధ్యావందనవిధులు చేయవలసిన సమయమయింది. కానీ ఆయన లేవలేదు. అపుడు కదళి ఆయనను లేపడం భార్యగా తన కర్తవ్యం. ఆ తరువాత ఆయన కోపఫలితాన్ని అనుభవించవలసిందే అనుకుంటూ ఆదమరచి నిద్రిస్తున్న దుర్వాసుణ్ణి తట్టి లేపింది.

దుర్వాసుడపుడు తనకు నిద్రాభంగం కలిగించినందుకు పట్టలేని ఆగ్రహంతో కళ్ళుతెరచి భార్యను చూశాడు. ఆయన కన్నులనుండి వెలువడ్డ కోపాగ్నిజ్వాలలకు కదళి భస్మీభూత మయింది. కానీ విచక్షణనుకోల్పోయిన తాను కోపాన్ని ప్రద ర్శించినందువల్ల జరిగిన అనర్థానికి దుర్వాసుడెంతగానో పశ్చాత్తప్తుడయ్యాడు. బాధపడ్డాడు. జరగాల్సిన అనర్థం జరిగి పోయింది కనుక, చేసేదేంలేక మౌనంగా ఉండిపోయాడు.

కొంతకాలం తర్వాత దుర్వాసుని మామగారు కుమార్తెను చూడాలని ఆశ్రమానికి వచ్చాడు. ఆయన కుమార్తె గురించి విని తనను శపిస్తాడేమోననే భయం ఉన్నా, జరిగిన విషయం చెప్పాడు. మామగారిని క్షమాపణ కోరుతూ తన తపోశక్తి చేత ఆ భస్మంలోనుంచి ఒక చెట్టును సృష్టించాడు. అదే కదళీ వృక్షం. మామగారివంక చూసి ఇదిగోండి మీ కుమార్తె "కదళీ". ఆమె ఈ రూపంలో ఇక భూమిమీద కలకాలం

ఉంటుంది. అంతేకాక ఆమె అందరికీ ఇష్టురాలై, ఈ కదళీ వృక్షంనుండి వచ్చే కదళీఫలంరూపంలో భగవంతునికి చేసే వ్రతాలు, నోములు, అన్ని శుభకార్యాల్లో ప్రముఖస్థానంలో ఉండే గౌరవాన్ని పొందుతుందని వరమిచ్చాడు.

అందుకే మనం ఆలయాల్లో చేసుకునే వ్రతాలు, పూజల్లో అరటిపండును తొక్కతీసి దేవునిముందుంచి "కదళీ ఫలం సమర్పయామి" అని నివేదన చేస్తాం. కాలాలతో సంబంధం లేకుండా అన్ని కాలాల్లోనూ భగవంతుడికి సమర్పించే "కదళీఫలం విశిష్టత" ఇది.

అంతేగాక ఆంజనేయునికి కదళీఫలాలలతో అర్చనచేస్తే అనంతఫలాలనందిస్తాడని పరాశరసంహితలో చెప్పబడింది.

**కదళీవనమధ్యస్థం**
**పూజయే ద్యః కపీశ్వరం ।**
**తస్య పుణ్యఫలం ప్రోక్తం**
**గుణితం కోటి సంఖ్యయా ॥**

హనుమత్పూజ అరటితోటలో చేస్తే అది కోటిరెట్ల ఫలితాన్నిస్తుంది. అరటితోటలో హనుమంతుని ప్రతిష్ఠించి, అరటి పూలతోను, అరటిఅత్తములతోను, అరటిపండ్లతోను అష్టోత్తర సహస్రనామపూజలు చేయటం, అరటిపండు నివేదన చేయటం స్వామికి అత్యంత ప్రీతిపాత్రం.

కదళీవనంలో హనుమత్పూజ, మంత్రారాధనం, హనుమాన్ హృదయం, హనుమత్కవచం, మంత్రం జపించటం మొదలైనవి చేస్తే విశేషఫలాలనిస్తాయి. సర్వకార్యసిద్ధి కలుగుతుంది.

**ఆవర్తయన్ త్రివారంతు**
**కదళీవన మధ్యగః ।**
**అన్యత్ర శతసాహస్ర**
**కోట్యా వృత్తి ఫలం లభేత్ ॥**

అరటితోటలమధ్య ముమ్మారు మంత్రం జపిస్తే ఇతరచోట్ల జపించినదానికంటె వందలకోట్లసార్లు జపించిన ఫలితాన్నిస్తుంది. ఏ చెట్టయినా మనం తిన్న తరువాత మిగిలిన గింజలతో విత్తనాలు నాటితే మొక్కలవుతాయి. కానీ కదళీ ఫలానికి గింజలుండవు. ఆ చెట్టుప్రక్కన వచ్చే పిలకలే మళ్ళీ మొక్కలుగా ఎదుగుతాయి. ఎంగిలి అంటని పవిత్రమైన వృక్షం కదళి. అందుకే భగవత్సేవలో ప్రథమస్థానం ఆక్రమించింది.

అందుకే హనుమద్భక్తులు అరటితోటను పెంచుకుని మధ్యభాగంలో హనుమంతునికి పీఠమేర్పరచి కదళీఅర్చనలు చేస్తారు. అలా చేసినవారి కోరికలు శీఘ్రమే సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.

అంతేగాక ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లాలో పెదకళ్ళేపల్లి అని ఒక ఊరు ఉంది. పూర్వం దానిని కదళీపురం అని పిలిచేవారు. దుర్గానాగేశ్వరస్వామి ఇక్కడ కొలువై ఉంటాడు. శాపగ్రస్తులైన ఎనిమిదిమంది సర్పరాజులు శాపవిముక్తిని పొందటానికి ఒక వేదికను నిర్మించి, దానికి నాలుగువైపులా కదళీవృక్షాలను ఉంచి నడుమ ఈశ్వరుని ప్రతిష్ఠించి పూజలు చేశారని ప్రతీతి. వారి భక్తికి మెచ్చి ప్రసన్నుడైన ఈశ్వరుడు కదళీవృక్షాలమధ్యన నన్ను నిలిపి పూజించారు కనుక ఇక్కడ కదళీపురమనే ఒక పుణ్యక్షేత్రం వెలుస్తుంది అని వారికి వరమిచ్చాడు. ఆ **"కదళీపురమే"** కాలక్రమాన **"పెదకళ్ళేపల్లి"** అని ప్రసిద్ధిపొందింది. **"ఈశ్వరుని అంశయే హనుమంతుడు".** అందుకే ఆయనకు కదళీవనమన్నా, కదళీపుష్పాలన్నా, కదళీ ఫలాలన్నా అత్యంత ప్రీతిపాత్రం. అరటిపండు అనేక పోషక విలువలు కలిగిన ఆరోగ్యప్రదాత. ఆబాలవృద్ధాదిగా ఆ మధుర ఫలమాధుర్యాన్ని ఆస్వాదించి ఆనందాన్ని పొందుతారు.

**"లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు"**

## వైకుంఠపాళి
## :: 88 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 క | ర | 2 ట | క | 3 ద | మ | 4 న | కు | లు |
| న | | క్కు | | రి | | ది | | |
| 5 కం | చె | | 6 క | ద్రు | వ | | 7 భం | 8 జ |
| | | 9 కై | | డు | | 10 ప్రా | | య |
| 11 పి | నా | క | ము | | 12 చి | రం | జీ | వి |
| క | | సి | | 13 అ | | భం | | జ |
| 14 ము | ద్ద | | 15 సు | మా | లి | | 16 కా | యు |
| | | 17 తా | | స | | 18 అ | | లు |
| | 19 భా | ర | తం | | 20 అ | మ్మ | మ్మ | |

# జాబాలితీర్థం హనుమంతుడు

- డా॥ఎస్. పద్మావతి, 96762 69300

**మే 14న హనుమజ్జయంతి సందర్భంగా...**

తిరుమలక్షేత్రంలో చూడవలసిన ముఖ్యమైన ప్రదేశాల్లో జాబాలితీర్థం ఒకటి. ఇక్కడ హనుమంతుడు స్వయంభువుగా వెలసిన ఆలయం ఉంది. ఈ ప్రాంతంలో ఎందరో మహాత్ములు, సాధువులు, యోగులు తపస్సులు చేసి సిద్ధి పొంది తరించారు. దేవతలు నడయాడిన దివ్యధామం జాబాలిక్షేత్రం.

**ఆవిర్భావం-**త్రేతాయుగంలో జాబాలి అనే మహర్షి ఉండేవాడు. అతడు తిరుమలగిరుల్లో నివసిస్తూ తిరుమలకొండల్లోని ఆకాశ గంగాతీర్థంసమీపంలో తపస్సు చేశాడు.

దేవతలందరి ప్రార్థనపై శ్రీమహావిష్ణువు తాను రాముడుగా భువియందవతరించ సంకల్పించి దేవతలందరినీ వారి వారి అంశలతో వానరులుగా భువిపైన అవతరించండని ఆదేశించాడు. అప్పుడు హరుడు శ్రీరామబంటుగా అన్నిశక్తులతో ఒక కపివరునిగా(హనుమంతునిగా) అవతరించటానికి నిశ్చయించుకున్నాడు. అప్పుడు జాబాలిమహర్షి హనుమంతుని



అవతరణకు ముందే ఆ రూపాన్ని చూడాలని, ఆ స్వామిని ప్రసన్నం చేసుకోవాలని ఎన్నో ప్రదేశాల్లో తపస్సు చేస్తూ చివరకు తిరుమలకు చేరి ఆకాశగంగాతీర్థంసమీపంలో హరుని ధ్యానిస్తూ జపహోమాలు చేశాడు.

అతనిభక్తికి మెచ్చి హరుడు తాను తదుపరి ధరించబోయే హనుమద్రూపంతో మహర్షిముందు సాక్షాత్కరించాడు. అప్పుడా మహర్షి స్వామికి ప్రణమిల్లి "స్వామి! నీవు ఈ రూపంతో ఇక్కడ వెలిస్తే నేను నిత్యం నిన్ను సేవించుకుంటాను" అంటూ తన కోరికను వ్యక్తం చేశాడు. ఆ మహర్షి కోరికమేరకు స్వామి హనుమంతునిగా అక్కడ స్వయంగా వెలశాడు. అలా జాబాలిమహర్షి జపం చేయగా స్వామి స్వయంగా వెలసిన క్షేత్రం కాబట్టి ఈ క్షేత్రానికి జాబాలిక్షేత్రమనీ, ఇక్కడ వెలసిన హనుమంతునికి జాబాలి హనుమంతుడనీ కీర్తి కలిగింది. జాబాలిమహర్షి జపం చేయడంవల్ల ఆవిర్భవించినందున జపాలీ హనుమంతుడు అనికూడా అంటారు.

## జాబాలీతీర్థమాహాత్మ్యం

జాబాలిలో ఆంజనేయుడు స్వయంగా వెలసినప్పుడు తీర్థరాజములన్నీ అక్కడకు వచ్చి స్వామి పాదాలు కడిగి సేవించాయి. అలా అక్కడ తీర్థం ఏర్పడింది. అదే జాబాలితీర్థం.

రాముడు వనవాసం చేస్తున్నప్పుడు భరతుడు రాముని వద్దకు వచ్చి రాముణ్ణి అయోధ్యకు వచ్చి రాజ్యమేలుమన్నాడు. అందుకు రాముడు తాను తన తండ్రిమాట నిలపటానికి అడవికి వచ్చాననీ, ఇప్పుడు మాట తప్పి అయోధ్యకు రాలేననీ చెప్పాడు. అప్పుడక్కడ ఉండి ఇదంతా విన్న జాబాలిమహర్షి రాముని మనస్సును పరీక్షించదలచాడు. రామునితో "రామా! వెర్రివానివై రాజ్యమేల వద్దంటున్నావు? ఎక్కడి తండ్రిమాట? ఇప్పుడు మీ తండ్రే లేడు. ఇంక అతనిమాటతో పనేంటి? వానిమాట (తండ్రిమాట) నిలుపుటవల్ల నీకు ప్రయోజనమేమిటీ? భరతుడు చెప్పినట్లుగా అయోధ్యకు వెళ్ళి రాజ్యమేలుకోవచ్చు కదా" అని అన్నాడు. ఆ విధంగా నాస్తికవాక్యాలు విన్న రాముడతనితో కొంత వాదించి ఆతణ్ణి మెప్పించాడు. తర్వాత జాబాలి తన



అసలు అభిమతాన్ని చెప్పి రాముణ్ణి క్షమా పణ వేడుకున్నాడు. అలా పరీక్షించటం కోసమే అయినా జాబాలి రామునితో ధర్మ విరుద్ధవాక్కులు పలకడంవల్ల వాగ్దోష పాపాన్ని మూటగట్టుకున్నాడు. ఆ వాగ్దోష పాపాన్ని తొలగించుకోవడంకోసం మహర్షి జాబాలితీర్థంలో స్నానమాచరించి తన వాగ్దోషాన్ని పోగొట్టుకున్నాడు.

పూర్వం కావేరితీరంలో దురాచా రుడు అనే బ్రాహ్మణుడు క్రూరాత్ముడై దుర్జనసాంగత్యంవల్ల చేయరాని అపచారా లన్నీ చేశాడు. దాంతో అతని బ్రాహ్మణత్వ మంతా నశించింది.

అలా తిరుగుతూ తిరుగుతూ తనకు తెలీకుండానే జాబాలితీర్థంచెంతకు చేరి అప్రయత్నంగానే ఆ తీర్థంలో మునిగాడు. మహామహిమాన్వితమైన ఆ తీర్థజలాలు తగలగానే అతనిని పట్టి ఉన్న బేతాళుడు అతణ్ణి వదిలేశాడు. బేతాళుడు వది లేయగా అతడు నీటినుండి బయటకొచ్చి తనను తాను తెలుసుకున్నాడు. అయితే ఎక్కడో కావేరితీరంలో ఉండిన తాను సువర్ణముఖీతీరమందున్న ఈ వేంకటాద్రికి ఎలా వచ్చానా? ఎందుకు వచ్చానా? అన్నది అతనికి అర్థం కాలేదు. అప్పుడు ఆ జాపాలితీర్థమందు ఉన్న జాబాలి మహర్షిని అడిగాడు. అందుకు ఆ ముని తన తపశ్శక్తితో ఒక్క క్షణమాలోచించి ఇలా చెప్పాడు.

“దురాచారా! నువ్వు బ్రాహ్మణుడవై ఉండికూడా అనాచారివై దుర్జన సాంగత్యంతో దుష్కర్మలు చేయడంవల్ల నీ బ్రాహ్మణత్వం నశించింది. నీకు మహా పాతకాలు చుట్టుకున్నాయి. నిన్ను బేతా ళుడు పట్టుకున్నాడు. ఏదో పూర్వపుణ్య భాగ్యంవల్ల నీకు తెలీకుండానే నువ్వు ఈ వేంకటాద్రికి వచ్చావు. అప్రయత్నంగానే ఈ జాబాలితీర్థంలో మునిగావు. పరమ పావనమైన ఈ తీర్థంలో బేతాళునితో సహా మునగడంతో ఈ తీర్థజలాలు తగలగానే ఆ బేతాళుడు నిన్ను వదిలేశాడు. నీ పాపా లన్నీ తొలగిపోయి నీవు పునీతుడివయ్యావు.

నిన్ను పట్టుకొన్న బేతాళుడు కూడా ఒక బ్రాహ్మణుడే. అతడు పితృకార్యాలు చేయనందువల్ల, పితృదేవతలశాపంవల్ల ఇలా బేతాళుడయ్యాడు. ఆ బేతాళుడు నిన్ను పట్టుకొని ఉండగా అతనితో సహా నీవు ఈ పుణ్యతీర్థంలో మునిగావు. ఈ పవిత్రజలాలు తగలడంతో అతనికి బేతా ళత్వంపోయింది. అతని పాపాలు తొలగి పోయి విష్ణులోకానికి చేరాడు. ఈతీర్థంలో మునగడంవల్ల నీ పాపాలూ తొలగి పోయాయి. నీవు తిరిగి బ్రాహ్మణత్వాన్ని పొందావు. నీకు విష్ణుసాన్నిధ్యం లభి స్తుంది” అని చెప్పాడు.

ఆవిధంగా దురాచారుడు మహా పాపాలు చేసినప్పటికీ అప్రయత్నంగా జాబాలితీర్థంలో స్నానమాచరించడంవల్ల మహాపాపాలనుంచి, బేతాళునినుంచి విముక్తుడయ్యాడు. నశించిన బ్రాహ్మణ త్వాన్ని తిరిగి పొందాడు. విష్ణుసాన్నిధ్యాన్ని కూడా పొందాడు.

మహాపాతకాలను పోగొట్టి, భూత, ప్రేత, పిశాచ, బ్రహ్మ-రాక్షసాది దుశ్శక్తు లను వైదొలిగించే అద్భుతశక్తిగల పరమ పావనపుణ్యతీర్థరాజం జాబాలితీర్థం. (స్కాందపురాణం- వైష్ణవఖండం- వేంకటా చలమాహాత్మ్యం).

బాలభక్తుడు ధ్రువుడుకూడా మొట్ట మొదటగా తపస్సు చేసి విష్ణుభగవానుని సాక్షాత్కారాన్ని, భగవదనుగ్రహాన్ని, ధ్రువ పట్టమును పొందింది కూడా ఇక్కడేనని ప్రశస్తి. ఇందుకు ప్రతీకగా అనేక ఓషధి గుణాలతో ధ్రువతీర్థమనేపేరుతో తీర్థం నిరంతరాయంగా ప్రవహిస్తూ శోభిస్తోంది.

తిరుమలకొండపైన శ్రీవేంకటేశ్వర స్వామిసన్నిధికి ఐదు కిలోమీటర్లదూరంలో పాపవినాశతీర్థానికి వెళ్లేమార్గంలో వెలసి భాసిల్లుతూ ఉంది ఈ జాబాలితీర్థం.

## ఆలయ విశేషాలు

జాబాలితీర్థంలో వెలసిన ఆంజనే యుడు గర్భాలయంలో సింధూరఅలం కరణతో ఒకచేత్తో గదను ధరించి రజత కవచ అలంకృతుడై భక్తులకు అభయ హస్తంతో దర్శనమిస్తూంటాడు. స్వామివారి శిరస్సుపైభాగాన శ్రీసీతారామచంద్ర స్వామివారి ఉత్సవమూర్తులు కొలువై ఉండడం చూడవచ్చు.

*జాబాలి ఆంజనేయుణ్ణి దర్శిద్దాం.*
*ఆంజనేయుని అనుగ్రహం పొందుదాం.*

మన మహర్షులు

# బ్రహ్మమానసపుత్రుడు భృగుమహర్షి

- డా॥ పి.వి. ఉమాశశి,
94407 35155.

బ్రహ్మదేవుని మానసపుత్రుడు భృగుమహర్షి. అందుకే భృగువు నవబ్రహ్మలలో ఒకడు. అంటే సృష్టికర్త. సప్తఋషులలో ఎన్నదగినవాడు.

ఒకానొకప్పుడు "త్రిమూర్తులలో ఎవరు ఉత్తముడు" అన్న సందేహంతో ఋషులంతా తర్జన భర్జనలు పడ్డారు. ఆ సందర్భంలో త్రిమూర్తులను పరీక్షించగలిగే శక్తి యుక్తిసంపన్నుడు భృగువు ఒక్కడే అని తీర్మానించారు. దాంతో భృగుమహర్షి సత్యలోకంలో నిర్లక్ష్యం చేసిన బ్రహ్మదేవుని, కైలాసంలో అలక్ష్యం పెట్టిన పరమశివుని శపించాడు. అంతటి తపశ్శక్తిశాలి భృగువు. ఉపేక్ష చూపిన ఉపేంద్రుని (విష్ణువును) తన కాలు ఎత్తి మరీ శ్రీమహా లక్ష్మీదేవికి నివాసమైన వాసుదేవుని వక్షఃస్థలాన్ని ఒక్క తన్ను తన్నాడు. అందుకు కారణం అతని పాదం అడుగున అహంకార నేత్రముంది. శ్రీమహావిష్ణువే ఆతనికి నమస్కరించి, ఉచితాసన మిచ్చి, మెల్లగా పాదాలు నొక్కుతూ ఆ నేత్రాన్ని చిదిమేశాడు.



అంతే. ఒక్కసారిగా తానెవరో తెలిసి వచ్చిందా మునికి. పరమాత్ముని కాళ్ళపై పడి క్షమను పొందాడు. శ్రీలక్ష్మీదేవి ఆ మునిని క్షమించి ఆతని పుత్రికగా మసలి- భార్గవిగా లోకప్రఖ్యాతినందింది. జగన్మాత మహాలక్ష్మికే తండ్రి కాగలిగిన మహోన్నతుడు భృగువు.

రాక్షసజాతికే గురువు అయిన శుక్రుడుకూడా భృగు పుత్రుడే. అందుకే సోదరుని దినమైన శుక్రవారమంటే లక్ష్మీదేవికి అంత ప్రీతి.

ఒకసారి క్రూరమైన రాక్షసులకు ఆశ్రయమిచ్చిందని భృగుపత్నిని తన చక్రంతో సంహరించాడు నారాయణుడు. ఆగ్రహించిన భృగువు విష్ణువును శపించి వెంటనే తన పత్నిని బతికించుకున్నాడు. ఆగ్రహానుగ్రహసంపన్నుడు, మరణించిన భార్యను తిరిగి బ్రతికించుకోగలిగిన అప్రమేయశక్తిసంపన్నుడు భృగుమహర్షి.

మన మహర్షులందరూ ఒక్కొక్కరు ఒక్కొక్కశాస్త్రాన్ని, వైదికసిద్ధాంతాలను రచించి, మనకందించారు. నేడు మనం చెప్పుకుంటున్న భౌతిక, రసాయనిక, గణిత, వృక్ష, వైమానిక, భూగర్భ, వ్యావసాయిక, జన్య, వైద్యాది సకలశాస్త్రాలు అన్నిటినీ కృతయుగంలోనే సంస్కృతంలో మన ఋషులు గ్రంథస్థం చేసి పెట్టారు. ఇప్పుడేదో పరదేశీయులు వచ్చి, ఆ శాస్త్రాలను వారి భాషల్లో మనకు చెప్తున్నారు. మనంకూడా గొప్పగా భావించి కొత్తగా తెలుసుకుంటున్నాం. ఒక్కసారి మన ప్రాచీన గ్రంథ సంపదను తిరగేస్తే- వేదసూత్రాలు, వేదంలోనే చెప్పబడిన సమస్తశాస్త్రాలు, శాస్త్రసిద్ధాంతాలు అన్నిటికీ కర్తలు మన భరద్వాజ, గౌతమ, కశ్యప, విశ్వామిత్రాదిఋషులే అని స్పష్టంగా మనకే అవగతమవుతుంది.

భృగువు జ్యోతిశ్శాస్త్రాన్ని సవిస్తరంగా నిర్మించాడు. భృగుసూత్రాలు, భృగుసంహిత, భృగువల్లి, భృగుస్మృతి- అని ఆ గ్రంథానికి పేర్లు. ఈ గ్రంథంలో భూత వర్తమాన భవిష్యత్తు లను తెలిపే బ్రహ్మసూత్రాలున్నాయి. వేదసూత్రాలున్నాయి. గ్రహసంచారంగురించి కూలంకషంగా చెప్తోందీ శాస్త్రం. ఏ గ్రహం ఏ రాశిని ఏ కోణంలో చూస్తోంది, ఏయేగ్రహాలు ఏయే రాశులకు అధిపతులు, వారి వారి స్థానాలేమిటి, ఏయేగ్రహాలు మిత్రగ్రహాలు, ఏయే శత్రుగ్రహాలు, వాటి వాటి ప్రయోజనాలు,

ఫలితాలు– ఇలా సమస్తశాస్త్రాన్ని సమగ్రంగా సమకూర్చి పెట్టాడు భృగువు. భృగుమహర్షి– శ్రీ గణేశుని ప్రార్థించి, ఆ దేవదేవుని సహకారంతో ఈ శాస్త్రాన్ని రూపొందించాడు. ఈ శాస్త్రసూత్రాలతో 45 మిలియన్ల జాతకపటాలను గీయవచ్చు. ఇది జ్యోతిశ్శాస్త్రమైనా ఆధ్యాత్మికతకు దారి చూపుతోంది. అంతేనా! రోగాలను, రోగనివారణలను ప్రస్ఫుటంగా వివరిస్తోంది. యోగశాస్త్రం, యోగశక్తి, యోగాసనాలు, వాటి ఫలితాలు అన్నీ ఈ గ్రంథంలో ఇమిడిఉన్నాయి.

భృగుమహర్షి గణిత, గణాంకశాస్త్రాలను కూడా వైదిక శాస్త్రపరంగా రచించి, నిక్షిప్తపరిచాడు. ఇలా అనేకానేక మహత్తర విశేషాలను నింపుకున్న భృగుసంహిత ఇప్పుడు పూర్తిగా లభించడంలేదు. కొంతభాగం వారణాసిలో దొరుకుతోంది.

స్కాందపురాణం– "ధర్మాన్ని భూమిపై నిలిపినవాడు భృగువు" అని చెప్తోంది. తైత్తిరీయోపనిషత్తు– భృగువల్లిని వివరిస్తోంది.

నిత్యసత్యవాక్కువలన శారీరిక మానసికరోగాలుండవన్నది భృగువాక్కు. సాక్షాత్తు పరమాత్ముడైన శ్రీకృష్ణభగవానుడే "ఋషులందరిలోకీ భృగువు దైవసముడు" అని భగవద్గీతలో అన్నాడు. శ్రీకృష్ణుడు భృగువును "ధర్మపిత, శుభదాత, అదృష్ట ప్రదాత" అని ప్రశంసించాడు.

అంతటి భృగువు మన మహర్షి కావడం భారతజాతి సుకృతం. ఆ మహర్షి అందించిన అనన్య అద్భుతశాస్త్ర అంశాలను అందుకుని ఆచరించడం మన కర్తవ్యం.

"బ్రహ్మపుత్ర భృగుదేవాయ నమః"

# నారాపురవాసుని నవ్యమందారాలు

శా. నారాపుర వేంకటేశ మముగాచే దేవరా కావుమా
దీనానాథ! దయామయా! కరుణతో దీనుండ రక్షింపుమా
నానాతీర నివాసిగా జనులకై నాస్వామి దీవించుమా
నానాబాధల దీర్పు వేంకటపతీ! నాపాలి గోవిందుడా

కందం. జమ్మలమడకపురమ్మున
జమ్ములలో దాగియున్న జలవాసునికిన్
ఇమ్మహి వెలికిందీసెబొ
కమ్మని నారయపురమున కైంకర్యముకై

సీసం. మాట తప్పనివారు మడమ తిప్పనివారు
రాయలసీమన్న రాజసంబు
పౌరుషాన పదము పాషాణప్రాయంబు
వెన్నవంటి మనసు వీడరెపుడు
కవులకు కాణాచి గాయకనిలయంబు
హరిహరధామమంటు అమలతలము
రతనాలసీమయై రాణువొందినచోటు
తిరుమలవాసుని దొల్లిగడప!

ఆ.వె. అట్టి జమ్మలమడుగందుండి మాస్వామి
దీనబాధ దీర్చు దిట్టవౌట
వేడుచుంటి మిచట వేంకటాచలపతీ!
కరోనబారినుండి కావుమయ్య!

సీసం. వైశాఖపు బహుళద్వాదశితరువాత
తిరునాళ్ళసందడి తిరుమలవలె
భక్తికైంకర్యాది బ్రహ్మోత్సవాదులు
సంగీతసాహిత్యసౌరభాలు
స్త్రీలకాభరణాలు తియ్యనివిందులు
రంగులరాట్నాలు రమ్యముగను
ఆడుబిడ్డలతోడ అక్కచెల్లెండ్రతో
అందమౌ లోగిలి అన్నిదెసల!

04-05-2023నుండి
12-05-2023వరకు
జమ్మలమడుగు, శ్రీభూసమేత
శ్రీనారాపురవేంకటేశ్వరస్వామివారి
బ్రహ్మోత్సవం
సందర్భంగా...



ఆ.వె. చిత్ర పెన్ననదులు చెలియలికట్టలై
మైలవరము, గండి మధురజలము
కన్యతీర్థమిచట కాపాడు జనులను
వేంకటేశ మమ్ము వేగ బ్రోచు

సీసం. శక్తిహీనులకును ఛాత్రమై భాసిల్ల
పెక్కుక్షేత్రములందు వెలసినావె
భక్తిముక్తి ఎపుడు పంకజాక్షుని కళ్ళు
జ్ఞాన విద్యారక్ష జ్ఞానవేద్య
నిక్కము సేయంగ నీవిట నుంటివా
మంగపతీ! నీకు మంగళంబు
సుప్రభాతము భక్తసులభసుందర నీకు
మధుసూదనా నిప్డు మమ్ము గావ

తే.గీ. ఈతిబాధల దీర్చుచు నతిరయమున
కలియుగంబును గావుమో కల్కిరూప
శ్రీనివాస! మాపాలిటి చిద్విలాస
వినుతి సేయగ నున్నాము విన్నపాలు!!

– శ్రీ కె.హరి మధుసూదనరావు,
94405 21458

# విష్ణ్వర్చనలో.. సుందరనామం

# హృషీకేశుడు!

– డా॥ఎన్. సి. హెచ్.సుధా మైథిలి, 82475 78748

శ్రీమహావిష్ణువుకు అర్చన చేసే సందర్భంలో స్వామికి సంబంధించిన కొన్ని నామాలు (పేర్లు) వినిపిస్తుంటాయి. ఒక్కొక్క నామంలో ఎంతో అంతరార్థం దాగిఉంది. ఆ నామములు అన్నీ కూడా ఆ స్వామి విశేషాలను ప్రకటిస్తుంటాయి. సాక్షాత్తు శ్రీమహావిష్ణువు కథనంప్రకారం.. విష్ణ్వర్చనలో వినిపించే ఓ సుందరనామం హృషీకేశుడు. అనగా జగత్తుకంతటికీ హర్షాన్ని ప్రసాదించేవారయిన అగ్ని సోములుగా పిలువులందుకుంటున్న సూర్యచంద్రులు. వీరినే హృషీ అనికూడా అంటారు. సూర్య చంద్రులకిరణాలను హృషీకేశాలు అని అనడంకూడా లోక వ్యవహారంలో గమనించవచ్చు. ఈ మొత్తం అర్థాన్ని కలిపి చూస్తే సూర్యచంద్రులకిరణాలను కేశాలుగా కలవాడు అనే అర్థం వస్తుంది. అలా ఉన్నవాడే శ్రీమన్నారాయణుడు.

ఇంద్రియనియామకుడూ.., రమా, బ్రహ్మ, రుద్రాదులకు మోదాన్ని కలిగించేవాడు అయినందువల్ల శ్రీహరి హృషీకేశుడు అని పిలవబడుతున్నాడు.

**మే 31నుండి జూన్ 08వరకు హృషీకేశ్, శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం సందర్భంగా...**



ఈ హృషీకేశుడు వాసుదేవమహామంత్రంలోని "దే" అనే అక్షరానికి, గాయత్రీమంత్రంలోని "ర్గో" అన్న అక్షరానికి, వాక్ తత్త్వానికి, భాద్రపదమాసానికి, శుక్లపక్షంలో ఎడమభుజం మీద ధరించే నామానికీ, మకరరాశికీ, ఆకుకూరలతో తయారు చేసిన పదార్థాలకు నియామకుడు.

ఇంద్రియాలకు ఈశుడు లేదా ఎవని ఇంద్రియాలు అందరి జీవులకువలె తమ తమ విషయాలందు ప్రవర్తిల్లక తన వశమునందుంటాయో అట్టి పరమాత్ముడు హృషీకేశుడు అని శ్రీమహావిష్ణువుకి ఆ నామముంది. విష్ణుసహస్రనామంలో..

అప్రమేయో "హృషీకేశః" పద్మనాభో౽మరప్రభుః।
విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠ స్స్థవిరో ధ్రువః॥

"హృషీకాణాం ఈశః" ఇంద్రియాలకు ఈశుడు. శరీరములందు క్షేత్రజ్ఞ (జీవ) రూపమున ఉండి ఇంద్రియాలను తమ తమ విషయాలయందు ప్రవర్తిల్లజేయువాడు. (లేదా) ఎవని ఇంద్రియాలు అందరి జీవులకువలె తమ తమ విషయాలందు ప్రవర్తిల్లక తన వశమునందుంటాయో అట్టి పరమాత్ముడు హృషీకేశుడు. (లేదా) సూర్యచంద్రులను కేశములుగా (కిరణములు) గల విష్ణువు హృషీకేశుడని చెప్పబడుతున్నాడు.

'సూర్యరశ్మిర్హరికేశః పురస్తాత్' సూర్యునికిరణం హరికి సంబంధించు కేశమే అను శ్రుతివచనం ఇందులకు ప్రమాణం.

శ్రీమద్భాగవతం 4వ స్కంధం, 24వ అధ్యాయంలో..

నమో నమో౽నిరుద్ధాయ హృషీకేశేన్ద్రియాత్మనే।
నమః పరమహంసాయ పూర్ణాయ నిభృతాత్మనే ॥

అనిరుద్ధుడూ, ఇంద్రియాలు వశమునందున్నట్టి హృషీకేశునకు పరిపరివిధముల వందనములు. స్థిరాత్ముడవూ, పరమహంసవూ, పూర్ణుడవూ ఐన నీకు నమస్కారము.. అని హృషీకేశశబ్దాన్ని ప్రస్తావించడం జరిగింది.

**బోధనాత్తాపనాచ్చైవ జగతో హర్షణం భవేత్।**
**అగ్నీషోమకృతైరేభిః కర్మభిః పాణ్డునందన ।**
**హృషీకేశో౽హమీషానో వరదో లోకభావనః॥**

పరమాత్ముడు కేశములను సంజ్ఞకలవియు తనకు సహజములూ, నేత్రములూ ఐన కిరణాలతో లోకాన్ని మేలు కొలుపుతూ, నిదురింపజేస్తూ తన వేరు వేరురూపాలతో లోకాన్ని తన స్థితియందు నిలుపుతుంటాడు. ఇలా ఆతడుచేసే బోధన స్వాపనములతో (మేలుకొలుపుట, నిదురింపజేయుటతో) లోకానికి హర్షం కలుగుతుంది. అదియే భగవదంశములైన అగ్నీషోములు జరిపే కార్యాలు. వీనిచేతనే మహేశానుడును (సృష్టిస్థితిలయాది సర్వకార్యకరణ సమర్థుడును) పై వ్యాపరము లచే హృషీకేషనామము కలవాడును ఐన విష్ణుడు వరదుడుగాను, లోకభావనుడుగాను ఉన్నాడు అని మహాభారతంలో వేదవ్యాసుడు స్తుతించాడు.

ఇటువంటి మహనీయమైన హృషీకేశుడు భూలోక వైకుంఠంగా కొనియాడబడుతూ.. తనను ఆశ్రయించిన భక్తులకు మోక్షమునొసగే తిరుమల వేంకటేశునిసన్నిధికి వెళ్ళడానికి, అత్యంత ప్రధానద్వారమయిన బంగారువాకిలిపై కొలువై భక్త జనులను అనుగ్రహిస్తున్నాడు. సాక్షాత్తు శ్రీమహావైకుంఠంలో జయవిజయులు కాపలాకాస్తున్న బంగారువాకిళ్లే భూలోక వైకుంఠంగా ప్రశస్తిగాంచిన వెంకటాచలమునందలి ఈ బంగారు వాకిళ్ళుగా చెప్పబడుతున్నాయి..అటువంటి ఈ రెండు బంగారు వాకిళ్లమీద వెరసి 32గళ్ళు ఉన్నాయన్నమాట. పైనుండి మొదటివరుసలో ఉన్న నాలుగుగళ్ళలో, మొదటిగడిలో చక్రం, రెండవదానిలో కలియుగవైకుంఠవాసుడైన శ్రీవేంకటేశ్వరుడు, ఇక మూడోగడిలో వైకుంఠవాసుడైన మహావిష్ణువు కూర్చొన్న భంగిమలోను, నాల్గవగడిలో శంఖం చెక్కబడి ఉన్నాయి. రెండవవరుసలో ఉన్న నాలుగుగళ్ళలో వరుసగా వాసుదేవ, సంరక్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధరూపాలు మలచబడ్డాయి. ఆగమశాస్త్రానుసారంగా వీటిని పరంధాముడైన శ్రీమహావిష్ణువు యొక్క వ్యూహరూపాలుగా పేర్కొంటారు. 3, 4, 5వవరుసల్లో గల 12గళ్ళల్లో కేశవుడు మొదలుగా దామోదరుడువరకు ఉన్న మూర్తులను ఈ క్రిందిక్రమంలో నెలకొల్పారు. 3వవరుస 1)కేశవుడు 2)నారాయణుడు 3)మాధవుడు 4)గోవిందుడు. 4వ వరుస 1)విష్ణువు 2)మధుసూదనుడు 3)త్రివిక్రముడు 4)వామనుడు. 5వ వరుస 1)శ్రీధరుడు 2)హృషీకేశుడు 3)పద్మ నాభుడు 4)దామోదరుడు.

విష్ణువుయొక్క ఈ ద్వాదశరూపాలు నిలిచి ఉన్న భంగిమలో ఉన్నాయి. ఈ విధంగా హృషీకేశుడు ఆశ్రయించిన వారికి కొంగుబంగారమై., ఇంద్రియాలను వశంలో ఉంచుకున్న పరమభక్తులకు మోక్షదాయకుడై, సర్వదా అనుగ్రహాన్ని ప్రస రింపచేస్తున్నాడు.



## శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామివారి వార్షికబ్రహ్మోత్సవాలు, జమ్మలమడుగు

**2023, మే 03 నుండి మే 13 వరకు**

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 03-05-23 | బుధ | ---- | అంకురార్పణం |
| 04-05-23 | గురు | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 05-05-23 | శుక్ర | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 06-05-23 | శని | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 07-05-23 | ఆది | కల్పవృక్షవాహనం | హనుమవాహనం |
| 08-05-23 | సోమ | మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 09-05-23 | మంగళ | సర్వభూపాలవాహనం | కల్యాణం, గజవాహనం |
| 10-05-23 | బుధ | రథోత్సవం | అశ్వవాహనం |
| 11-05-23 | గురు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 12-05-23 | శుక్ర | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 13-05-23 | శని | ---- | శ్రీ పుష్పయాగమహోత్సవం |



ఇతరుల మనసుల్ని విషపూరితం చేయడంలాంటివి వినాశనానికే దారితీస్తాయి




# శంఖచక్రనామ గోవిందా!

- శ్రీ యం.వి.యస్.రామశేషు, 99089 92602

మా కుటుంబానికి శ్రీవేంకటేశ్వరుడు ఇలువేలుపు. దాదాపు నా చిన్నప్పటినుంచి ప్రతి సంవత్సరం తిరుపతి వెళ్ళి స్వామి దర్శనం చేసుకునేవాళ్ళం. మా వివాహమయిన తరువాత మధు పర్కాలతో స్వామివద్దకు వెళ్ళి దర్శనం చేసుకున్నాం. అలానే ఈ మధ్య మేము దక్షిణాదియాత్రలకు వెళ్ళాం. గుంటూరులో బయలుదేరిన మేము ముందుగా శ్రీరంగం వెళ్ళాం. అక్కడ ఒక మూడురోజులుండి స్వామి దర్శనం చేసుకున్నాం. తరువాత అక్కడనుండి మధురై, కుర్తాళం, శ్రీవిల్లిపుత్తూరు, తిరుక్కడయూర్, అరుణాచలం చూసుకున్నాం. ఆ తరువాత అక్కడనుండి గుంటూరు వద్దామనుకున్నాం. కాని అక్కడినుండి సరాసరి రావటానికి టిక్కెట్ దొరకలేదు. అప్పుడు మా అల్లుడుగారు తిరుపతివచ్చి నారాయణాద్రికి రావచ్చని టిక్కెట్ బుక్ చేశారు. అప్పటికప్పుడు రైలుటిక్కెట్టంటే అలానే దొరికింది. దాంతో మేము ఉదయం 9.00గం॥లకు అరుణాచలంలో బయలుదేరి రాయవెల్లూరు మీదుగా మధ్యాహ్నం 2.00 గం॥లకు తిరుపతి చేరుకున్నాం.

తిరుమలస్వామి దర్శనానికి వెళదామంటే టిక్కెట్‌కాని, టోకెన్‌గాని లేవు. అప్పటికప్పుడు దర్శనం దొరకటం అంటే కష్టం కదా! అందులో అక్కడ అప్పుడు భారీవర్షంగా కూడా ఉంది. పోనీ తిరుచానూరు వెళ్ళి అమ్మవారిదర్శనమైనా చేసుకొందాం అంటే రైలుకు ఇంకా మూడుగంటలసమయం ఉంది అని అనుకున్నాం. కాని అప్పుడు కార్తికబ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. అమ్మవారిదర్శనానికి చాలాకష్టంగా ఉంది. చాలాసమయం పడుతుంది అని అన్నారు.

ఇక మేము చేసేది లేక స్టేషన్‌లోనే కూర్చొని 6.00 గం॥లకు నారాయణాద్రి ఎక్కాం. ఆ రాత్రి 1.00 గం॥లకు గుంటూరులో దిగాం. ఆ రోజు అలసట తీర్చుకున్నాం. మరు నాడు తిరుపతిలో మూడుగంటలు కూర్చున్నాం గాని స్వామి దర్శనం చేసుకోలేకపోయాము కదా అని గుంటూరు తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన బృందావన్ గార్డెన్స్‌లోగల గోదా పద్మావతీసమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళి స్వామిదర్శనం చేసుకుందా మనుకున్నాం.

25వ తేది సాయంత్రం ఆలయానికి స్కూటర్‌మీద వెళ్ళి, బండి పార్క్‌చేసి లోపలికి వెళ్ళాం. ఒక పదినిముషాల్లో స్వామిని చూసి బయటకి వచ్చి ఇంటికి వెళదామని బండి దగ్గరకి వచ్చాం. చూసేసరికి అత్యాశ్చర్యం కలిగింది. మా బండి హెడ్‌లైట్‌డోమ్‌పైన స్వామి శంఖం నామం చక్రం వేయబడి ఉన్నాయి. మేము గుడికి వచ్చేటప్పటికి ఒక నాలుగయిదు బళ్ళున్నాయి. ఇప్పుడు ఏవీ లేవు. మేము లోపలికి వెళుతుంటే పచ్చనిబట్టలు కట్టుకున్న ఒకవ్యక్తి కనిపించాడు. ఆయన ఎవరో తెలియదు. కానీ ఈ శంఖుచక్రాలు ఎవరు వేశారో మాకు తెలియలేదు. ఆయన అక్కడ మళ్ళీ కనబడలేదు.


తిరుపతిలో స్వామిని దర్శించుకోలేకపోయామనే ఒక శంక మనస్సును బాధపెడుతోంది. ఇవి చూసిన తరువాత నిదర్శనంగా స్వామే వచ్చాడా అన్నట్లుగా అనిపించింది. అప్పుడు వెంటనే మేము స్వామీ త్వరలో నీ దగ్గరకు వచ్చి నీ దర్శనం చేసుకుంటామని నమస్కరించుకొన్నాం. ఇదీ నమ్మిన భక్తులకు స్వామి చూపించే నిదర్శనం.

"లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు"

## భర్తృహరిసుభాషితం

అడవిలోగానీ, యుద్ధంలోగానీ, శత్రువులమధ్యగానీ,
నీళ్ళలోగానీ, నిప్పులోగానీ, మహాసముద్రంలోగానీ,
పర్వతశిఖరంపైగానీ, మనుష్యుడు నిద్రిస్తున్నా,
మత్తులోఉన్నా, అపాయంలో ఉన్నాసరే
పురాకృతసుకృతాలు అతణ్ణి తప్పక రక్షిస్తాయి.

యువత



# ధర్మసూక్ష్మం

- శ్రీ బలిజేపల్లి సుబ్బారావు,
98667 83954

మంచిపనులు ఎన్ని చేసినా, పుణ్యకార్యాలు ఎన్ని చేసినా, పుణ్యక్షేత్రాలు ఎన్ని తిరిగినా నాకే ఇన్ని కష్టాలు ఎందుకు వస్తున్నాయి? ఇతరులు తాను చేసేవి ఏమి చేయక పోయినా హాయిగా తనకంటే సుఖంగా ఎలా ఉంటున్నారు? నిజంగా దేవుడు ఉన్నాడా? లేడా? ఈ సందేహం చాలా మందిలో ఉంటుంది.

మనం గతజన్మలలో చేసిన కర్మలఫలితాలే ఈ పరిణామాలకు కారణం అని తెలుసుకోవడం అవసరం. మనం చేసిన కర్మలు మూడుదశల్లో ఉంటాయి.

**1)** ఆగామికర్మలు (ఈ జన్మలో చేసిన పాప లేదా పుణ్యకర్మలు)
**2)** సంచితకర్మలు (ముందుజన్మలో చేసిన పాప, పుణ్యకర్మలు)
**3)** ప్రారబ్ధకర్మలు (ఈ జన్మలో అనుభవించేవి)

ఆగామికర్మలు మరల రెండురకాలుగా ఉంటాయి. అవి 1)అప్పటికప్పుడు ఫలితాన్ని ఇచ్చేవి. 2)తర్వాత జన్మకు దాచ బడినవి.

ఉదాహరణకు నేను ఎవరినైనా నిందించినా లేదా దండించినా తిరిగి వారు నన్ను అదే స్థాయిలో నిందించినా లేదా దండించినా ఫలితాన్ని వెంటనే పొందుతాను. ఇది అప్పటి కప్పుడే ఫలితాన్ని కలుగచేస్తుంది. కాని, నేను ఎవరినైనా వారి పరోక్షంలో పైవిధంగా చేసినపుడు అది వెంటనే ఫలితాన్ని కలుగచేయదు. అప్పుడు ఆ కర్మ సంచితకర్మగా దాచబడుతుంది. ఈవిధానం పుణ్యకర్మలకుకూడా వర్తిస్తుంది.

సంచితకర్మలు అనగా గతజన్మలో చేసిన ఆగామి కర్మలు (పాప, పుణ్యకర్మలు) మిశ్రమం సంచితకర్మగా మరణానంతరం జీవునితోపాటు ఉంటుంది. అందుచే "చేసిన కర్మము చెడని పదార్థము చేరును నీ వెంటే" అన్నారు పెద్దలు.

ఇక, ప్రాపబ్ధకర్మలు అనగా ఈ జన్మలో అనుభవంలోకి వచ్చేవి. గతజన్మలో చేసిన పాప, పుణ్యకర్మలు ఒకదానితో ఒకటి కలిసి పోయి సంచితకర్మగా మారి నీవు అనుభవించ డానికి వీలుగా మార్పు చెంది ఈ జన్మలో కష్టసుఖాలుగా పంచబడుతుంది. అంతేకాని ఈ పుణ్యానికి ఈ సుఖం, ఈ పాపానికి ఈ దుఃఖం అని విడివిడిగా అనుభవించడం సాధ్యం కాదు. సుఖదుఃఖాల కలయికతోనే జీవితం సాగుతూం టుంది. కర్మలు ఉన్నంతకాలం జన్మలు ఉంటూనే ఉంటాయి. జన్మలు ఉన్నంతకాలం కర్మలు చేస్తూనే ఉండాలి. కర్మలు చేయ కుండా ఏ జీవి ఉండడం సాధ్యం కాదు. మరి ఈ జన్మ, కర్మ చక్రంనుండి బయటపడాలంటే ఏం చేయాలి? అనేదే ప్రశ్న.

పుణ్యకర్మలు లేదా పాపకర్మలు ఈ రెండూ జన్మను పొందడానికి కారణభూతులవుతున్నాయి. జన్మను పొందకుండా ఉండాలంటే కర్మలు లేకుండా పోవాలి.

దీనికి ఒకే ఒకమార్గం మన పాప, పుణ్యకర్మలను జ్ఞానాగ్నిలో దహనం చేయడమే. మరి ఈ జ్ఞానాన్ని ఎలా పొందాలి? అనేది మరో ముఖ్యమైన ప్రశ్న.

**1)** పరమాత్మునిగురించిన జ్ఞానంవల్ల మన దేహంలోని మిథ్యా హంకారం నశిస్తే మనస్సు సమాధిస్థితిని సులభంగా చేరుకొంటుంది.

**2)** మనసును వశపరచుకుని స్థిరచిత్తులుగా ఉండి ఇంద్రియ నిగ్రహం కలిగి చిత్తశుద్ధితో భగవంతుని సేవించడమే జ్ఞానానికి మార్గం.

**3)** పరమాత్మునిగురించిన ఆలోచనలే పరంజ్యోతిగా జ్ఞానమార్గా నికి దారిచూపుతుంది.




# 'చిటిక' సేవలో.. ఆంజనేయుడు

- డా॥ ఎ.బి.సాయిప్రసాద్,
99805 67541

ఆంజనేయుడు తాను అనుకున్నదాన్ని తాను అనుకున్నట్టు సాధించడంలో అందెవేసిన చెయ్యి. రాముడి పట్టాభిషేకం తరువాత రాముడికి ఎవరెవరు ఏ పరిచర్య చేయాలన్న ఒక పట్టికను అందరు కలసి తయారుచేశారు. సీతమ్మతో సహా అందరికీ ఎవరికి వారు చేయాల్సినపనిని నిర్ణయించి వారు ఆ పనులను మాత్రమే చేయాలన్న ఒప్పందానికి వచ్చారు.

మరి తెలిసోతెలియకో లేదా కావాలనే కావొచ్చు. సీతారాములను తన గుండెల్లో దాచుకున్న ఆంజనేయుడికి మాత్రం ఏ ఒక్క పరిచర్య ఇవ్వబడలేదు. నాకు ఏ సేవాభాగ్యం లేదా అని అందర్నీ పేరు పేరునా అడిగాడు. అందరూ, ఆంజనేయా! అన్నిపనులకు అందరు నిర్ణయించబడ్డారు. నీకని ఏ సేవాకార్యక్రమం ఇవ్వబడలేదు అని చెప్పారు. తనను రాముడినుండి దూరంచేయడానికి ఇది ఎవరో వేసిన ఎత్తు అని ఆంజనేయుడికి అర్థమైంది.

ఐనా కానీ తాను ఏమీ నిరాశపడకుండా ఎవరెవరు ఏఏ సేవలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నాడు. వారు చెప్పినట్టు అన్ని సేవలకు అందరూ ఉన్నారన్నసంగతి ఆంజనేయుడికి అర్థమైంది. ఆలోచించగా ఒకానొకసేవకు ఎవరూ లేరన్న సంగతి ఆంజనేయుడు తెలుసుకున్నాడు. అందర్నీ సమావేశపరచి అన్ని సేవలకు అందరూ ఉన్నారు. కాని **'చిటికసేవ'**కు ఎవ్వరూ లేరు. అది నాకిప్పించండి అని వేడుకున్నాడు. **'చిటిక'** సేవా! అది ఎలాంటి సేవ! ఇలాంటిసేవ ఒకటుంటుందని కూడా మాకు తెలియదు. ఆ సేవ గురించి సెలవిమ్మని అందరు ఏకకంఠంతో ఆంజనేయుణ్ణి అడిగారు.




ఇది చాలా సరళమైన సేవ. రాముడికి ఆవులింత వచ్చినప్పుడు దగ్గరుండి చిటిక వేయాలి అంతే అన్నాడు. ఆ సేవలోని గూడార్థం తెలియని సీత, లక్ష్మణ, భరత, శత్రుఘ్నాదులు వెంటనే ఒప్పేసుకున్నారు. తాను విసిరిన వలలో అందరు చిక్కుకున్నారని తెలుసుకొని ఆంజనేయుడు తనలో తానే నవ్వుకున్నాడు. వెంటనే రాముడిపాదాలవద్ద తిష్ఠ వేశాడు. పగలనక, రాత్రనక, అన్నివేళల్లో రాముడిదగ్గరే గడప సాగాడు. అందరికి తమ తమ సేవలు తాము చేయలేకపోతున్నామనే బాధ కలిగింది. ఇది పగటివేళ కదా! హనుమా! ఎందుకు రాములవారిదగ్గరే ఉంటున్నావు అని సీతమ్మ అడిగింది.


అందుకు వెంటనే చూడమ్మా! రాములవారు ఎప్పుడు ఆవులిస్తారో మీకు తెలుసా? ఆయన ఆవులించినప్పుడు నేను దగ్గరుండి **'చిటిక'** వేయాలి. ఈ సేవ మీరందరూ కలసి నాకప్పగించారు. ఇచ్చినమాటను వాపసు తీసుకోవడం అన్నది మా ఇంటావంటా లేదు అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు ఆంజనేయుడి హృదయం ఎంత గొప్పదో అందరికి తెలిసింది.

# శ్రీవేంకటేశ్వరస్వామి సేవలో..
# మహిళా భక్త శిరోమణులు

- డా॥ నాగోలు కృష్ణారెడ్డి, 94411 12636

ప్రాచీనకాలంనుండి దేవాలయాలు మానవమతలౌకిక జీవనంలో ప్రధానపాత్ర పోషించాయి. సమాజానికి, దేవాలయానికి విడదీయరాని సంబంధం ఉంది. దేవాలయాలను నిర్మించడం, వాటి నిర్వహణకోసం దానాలు చేయడం ఒక పవిత్ర కార్యంగా భావించి, పాలకులతోపాటు అన్నివర్గాల ప్రజలు, స్త్రీలు ఈ కార్యంలో భాగం పంచుకున్నారు. ప్రాచీనకాలంనుండి హిందూసంస్కృతి మతవిషయాల్లో స్త్రీలు ప్రధానపాత్ర పోషించినట్లు శాసనాలు, సాహిత్యం పేర్కొంటున్నాయి.

తిరుమలక్షేత్రం కలియుగవైకుంఠంగా ప్రసిద్ధికెక్కింది. వేలసంవత్సరాలనుండి ఈ క్షేత్రమహిమ అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంది. ప్రాచీనసాహిత్యంలో, శాసనాల్లో తిరుమల క్షేత్రానికి సంబంధించి అనేకవిశేషాలున్నాయి. తి.తి.దే. దేవాలయాల్లో మొత్తం 1252శాసనాలు లభించాయి. ఈ శాసనాలను అధ్యయనం చేస్తే, శ్రీవేంకటేశ్వరస్వామిపై స్త్రీలకు గల భక్తిప్రపత్తులు, వారు స్వామికి చేసిన కైంకర్యాలు, సేవలు తెలుసుకోవచ్చు. వారు అనేకదానాలు చేసి దేవాలయ ఆర్థికపరిపుష్టికి దోహదం చేసి ఆదర్శంగా నిలిచారు. అలాంటి కొందరు భక్తశిరోమణులగురించి తెలుసుకుందాం.



**పల్లవరాణి సామవై-** శాసనాలకు సంబంధించి మొదట వేంకటేశ్వరస్వామిని సేవించిన స్త్రీమూర్తి సామవై. ఆమెనే కాడవాన్ పేరుందేవి అంటారు. ఆమె కాడవరాజ సట్టి విటంకన్ భార్య. ఆమె శా.శ.965లో తిరుమలలో ఒక శాసనాన్ని వేయించింది. తిరుమలలో లభిస్తున్న ప్రాచీనశాసనం ఇదే. బ్రహ్మోత్సవాలసమయంలో ఆమె వేంకటేశ్వరస్వామి దేవాలయానికి ఒక మణవాళపెరుమాళ్ (వెండి) విగ్రహాన్ని, రత్నఖచితమైన బంగారుఆభరణాలను దానంగా ఇచ్చి, ఉత్సవమూర్తిని ఊరేగించే ఏర్పాటు చేసింది. బ్రహ్మోత్సవాల నిర్వహణకు కొంతభూమినికూడా దానంగా ఇచ్చింది. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన మొదటిశాసనంకూడా ఇదే. అప్పుడు ఈ బ్రహ్మోత్సవాలు పదిరోజులపాటు జరిగేవి. అప్పటినుంచి చాలామంది మహిళామణులు స్వామిని సేవించినట్లు అనేక శాసనాలు పేర్కొంటున్నాయి.

**పరాంతకదేవి అమ్మ-** ఈమె రెండోచోళపరాంతకుని పట్టపురాణి. ఈమె స్వామికి ఆరుకెంపులు, నాలుగు వజ్రాలు, 28ముత్యాలు పొదిగిన ఒక పట్టాన్ని (హారాన్ని) దానంగా సమర్పించింది.

**పెరియకొమ్మమ్మ-** ఈమె సలకరాజ పెరియతిరుమలయ్యదేవ్ మహారాజురాణి. ఈమె శా.శ.1534లో తిరుమల బ్రహ్మోత్సవాలలో ఏడవరోజు జరిగే గరుడసేవకుగాను 1300 పణాల ధనాన్ని, ఒక అతిరసప్పడిని స్వామికి సమర్పించింది. తిరుమలలో ఒక మండపాన్ని, ఉద్యానవనాన్ని నిర్మించింది. రెండుసంవత్సరాల తరువాత శా.శ.1536లో స్వామి తిరుప్పోణకంకోసం 150 వరహాలను దానంగా సమర్పించింది.

**లక్ష్మిఅమ్మగారు-** ఈమె సాళువ తిమ్మరుసుభార్య. శా.శ.1511లో ఈమె శ్రీవేంకటేశ్వరస్వామికి 1200పణాలు దానంగా సమర్పించినట్లు ఒక శాసనం పేర్కొంటున్నది.

**వెంకటవల్లి-** ఈమె శా.శ.1457లో స్వామి ఆహారనైవేద్యాల కోసం 1000 నర్పణాలు శ్రీభండారానికి సమర్పించింది.

**వాలండి-** ఈమె బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు స్వామికి 30 రకాల ప్రత్యేక నైవేద్యాలకోసం 300 నర్పణాలను దానంగా ఇచ్చింది.

**కుప్పయాని-**ఈ రంజకం శ్రీరంగరాజకూతురు. ఈమె శా.శ.1512లో కృష్ణదేవరాయలకాలంలో తిరుమలలో సంధి నిర్వహణకోసం 1000 పణాలను, శా.శ.1517లో దోసెపడి కోసం 3000 పణాలను దానంగా ఇచ్చింది.

**గోవిందస్వామి-** ఈమె తిరుపతికి చెందిన సజ్జరౌతు పొల్ల య్యన్ కూతురు. ప్రతి సంవత్సరం తిరుపతిలోని శ్రీగోవిందరాజ స్వామి అతిరసప్పడికోసం 300 నర్పణాలను సమర్పించింది. శా.శ.1530లో తిరుపతిలో గోవిందపుష్కరిణి నిర్మించింది. గోవిందరాజస్వామి ఆ మండపంలో ఆసీనులైనప్పుడు అతిరస ప్పడి సమర్పించే ఏర్పాటు చేసింది.

తిరిగి శా.శ.1534లో ధనుర్మాసపూజకోసం, రోజుకొక తిరుప్పోణకంకోసం 30 తిరుప్పోణకాలకు 30 నర్పణాలను సమర్పించింది. తనఅక్క చికసవాయితో కలిసి వివిధసేవల నిమిత్తం మళ్లీ 1750 నర్పణాలను దానంగా సమర్పించింది.

**ముద్దుకుప్పాయి -** ఈమె విద్వత్ సభారాయ రంజకం కుప్పసాని కూతురు. శా.శ.1531లో అచ్యుతదేవరాయలు గోవిందరాజస్వామి దేవాలయంనుండి ఒక తళిగప్రసాదం ఈమె ఇంటికి పంపే ఏర్పాటు చేశాడు. ఈమె తిరుపతిలో నివసిస్తూ కొన్ని ప్రత్యేక ఉత్సవసమయాల్లో తిరుమలకు వెళ్లి స్వామిముందు నాట్యప్రదర్శనలిచ్చేది.

**హనుమసాని-** ఈమెను అచ్యుతదేవరాయలు హంపీనుండి తిరుమలకు స్వామిసేవనిమిత్తం పంపాడు. ఈమె తిమ్మయన్ కూతురు. స్వామికి, సుదర్శనచక్రానికి 13 అప్పపడి, ఒక దోసెపడికోసం 820 నర్పణాలను దానంగా ఇచ్చింది.

**నాగసాని-** ఈమెకూడా అచ్యుతదేవరాయలు పంపగా హంపీ నుండి వచ్చింది. ఈమె ఓబులయ్యన్ కూతురు. ఈమె తిరుమలలో ఒక ఉద్యానవనాన్ని నిర్మించింది. అందులో స్వామి ఆసీనులైనప్పుడు 10 అప్పపడులకోసం కావలసిన ధనాన్ని ఏర్పాటు చేసినట్లు శా.శ.1545 నాటి ఒక శాసనంలో ఉంది. ఇవి పదిబ్రహ్మోత్సవాల్లో ఏడోరోజు జరిగేటట్లు ఏర్పాటు చేసింది. అలాగే తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు కూడా ఏడోరోజు రెండు అప్పపడులు ఇచ్చే ఏర్పాటుకూడా చేసింది.

**లింగసాని, తిరువెంకటమాణిక్కం-** వీరిద్దరూ అక్క చెల్లెళ్లు. ఇద్దరూ కలిసి చాలా దానాలు చేశారు. అచ్యుతదేవ రాయలు, సదాశివరాయలకాలంలో దాదాపు 15 సంవత్సరాలు స్వామికి సేవచేశారు. ఇద్దరూ కలిసి అనేక ఉద్యానవనాలు, మండపాలు నిర్మించారు. వాటి నిర్వహణకోసం కావలసిన ధనాన్ని జమ చేశారు. అయిదారుశాసనాల్లో వీరు చేసిన దానాల, కైంకర్యాల వివరాలున్నాయి. వీరు మొత్తం 4.710 నర్పణాలు దానంగా ఇచ్చారు. తమ భాగానికి వచ్చే ప్రసాద భాగాలను శ్రీవైష్ణవభక్తులకు, గురువులకు దానంగా ఇచ్చారు. తిరువెంకటమాణిక్కంను దేవాలయాల అధికారులు సన్మా నించారు.

ఆమె అద్భుత నాట్యకళాకౌశలానికి మెచ్చి స్థానిక పాలకుడైన పొట్లపాడి తిమ్మరాజు, దేవాలయ స్తానత్తార్లు ఒక దండిక (పల్లకి)ను, పూర్తిభాగం ప్రసాదాన్ని ఆమె ఇంటికి పంపే ఏర్పాటు చేశారు. ఇంకో ప్రసాదాన్ని వారు నిర్మించిన అలిమేలు మంగనాచ్చియార్ ఉద్యానవనాన్ని సంరక్షించే వ్యక్తికి ఇచ్చే ఏర్పాటుచేశారు. మొదటిది తిరుమలలో, రెండోది తిరుపతిలో గోవిందరాజస్వామికి సమర్పించేది. ఈ ప్రసాదాలు వంశపారం పర్యంగా ఉండే ఏర్పాటు చేశారు.

**పెరుచ్చి-** ఈమె మలఘున వెంకటత్తురైవాన్ సెర్పికూతురు. ఈమె గోవిందరాజస్వామి ఆహారనైవేద్యాలకు 250నర్పణాలు దానంగా ఇచ్చింది. తిరిగి అదే స్వామికి శా.శ.1538లో మళ్లీ మకర సంక్రమణంరోజున దోశపడి, తిరుప్పోణకంకోసం 200 నర్పణాలు సమర్పించింది.

*(మిగతాది వచ్చే సంచికలో...)*

ఆయుర్వేదం

# కొత్తిమీర

– డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ,
90007 61390

ఆహారం బాగా జీర్ణమై అజీర్ణం కలుగకుండా ఉండేందుకు ఆహారపదార్థాలు, వంటకాలతయారీలో కొత్తిమీర, కరివేపాకు లాంటి వాటిని జోడించి వాడుకునే సంప్రదాయాన్ని మన కందించారు మన మహర్షులు.

సంవత్సరమంతా తాజాగా లభ్యమవుతూ పోషక విలువలతో కూడిన ఆరోగ్యానికి మేలు చేకూర్చే సుగంధభరిత ఆకుకూర కొత్తిమీర. ఆహారపదార్థాలతయారీలో రుచి, సువాసనకు కొత్తిమీరను వాడతారు.

కొత్తిమీరను పచ్చళ్ళు, పులుసు, రసం, సలాడ్లు, పులిహోర, దధ్యోదనం మొదలైనవాటితయారీలోను మంచి సువాసనద్రవ్యంగా వాడతారు. మన శరీరానికి అత్యంత అవసరమైన సూక్ష్మపోషకాలు కొత్తిమీరలో ఉండి మన ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ఉపయోగపడుతాయి. నిత్య జీవితంలో మనం ఎదుర్కొనే అనారోగ్యాలకు కొత్తిమీరను ఎలా ఔషధంగా వాడుకోవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**మొటిమలు తగ్గేందుకు:** ఒకటీస్పూను కొత్తిమీర ముద్దలో ఒకట్రెండుచిటికెల పసుపుపొడి కలిపి ముఖంపై లేపనం చేసి గంటసేపాగి కడుక్కుంటే నల్లమచ్చలు తగ్గుతాయి.

**అరికాళ్ళు, అరచేతులమంటలు తగ్గేందుకు:** రోజూ ఒకసారి 200మి.లీ. మజ్జిగలో 20మి.లీ. కొత్తిమీరఆకులరసం కలిపి సేవిస్తుంటే మధుమేహసమస్య తగ్గిస్తుంది. ఈ ఔషధం మన శరీరంలో ఇన్సులిన్ఉత్పత్తిని, సామర్థ్యాన్ని పెంచి రక్తంలో చక్కెరనిల్వలు తగ్గేందుకు సహకరిస్తుంది. మధుమేహం లేని వాళ్ళలో ఈ సమస్య ఉంటే ఈ ఔషధద్రవ్యంలో ఒక టీ స్పూను తాటిబెల్లం కలిపి సేవిస్తుండాలి.


**ముక్కునుంచి రక్తస్రావమవుతుంటే :** రోజూ ఒకట్రెండుసార్లు కొత్తిమీరరసాన్ని 2, 3చుక్కలవంతున ముక్కుల్లో వేస్తే త్వరగా సమస్య తగ్గుతుంది.

**పార్శ్వపుతలనొప్పికి:** కొత్తిమీరపేస్టును బిళ్ళలా చేసి శిరస్సు పైభాగాన ఉంచుకుని కట్టుకట్టుకుని గంటసేపాగి తీసేస్తే సత్ఫలితం కలుగుతుంది.

**కామెర్లు తగ్గేందుకు:** రోజు ఒకట్రెండుసార్లు పూటకు 200మి.లీ. తాజామజ్జిగలో 20 మి.లీ. కొత్తిమీరరసాన్ని కలిపి సేవిస్తూ సులభంగా జీర్ణమయ్యే తేలికపాటిఆహారాన్ని సేవిస్తుంటే కామెర్ల వ్యాధి త్వరగా తగ్గిపోతుంది.

**కళ్ళకలక, కళ్ళమంటలు, కళ్ళఎరుపు తగ్గేందుకు:** శుభ్రంగా తయారుచేసిన కొత్తిమీరరసంలో ఒకబట్ట లేదా దూదిని తడిపి కళ్ళపై 15నిమిషాలుంచుకుంటుంటే సత్ఫలితం కలుగుతుంది.

**కాళ్ళు, చేతులవాపులకు:** రోజూ రెండుసార్లు పూటకు 250 మి.లీ. నీటిలో గుప్పెడు కొత్తిమీరఆకులు, అరటీస్పూను జీలకర్ర, పావుటీస్పూను తాటికలకండ వేసి 100మి.లీ. నీరు మిగిలేలా మరిగించి దించి చల్లార్చి వడగట్టి సేవిస్తే ఫలితం కల్గుతుంది.



**శరీరం మంటలుగా ఉంటే:** రోజు ఒకట్రెండుసార్లు కొత్తిమీర రసాన్ని అలాగేగాని లేదా కొద్దిగా శ్రీగంధంపొడిగాని కలిపి లేపనం చేస్తుంటే త్వరగా ఈ సమస్య తగ్గుతుంది. ఇలా వాడటంవల్ల చర్మంపై ఎరుపు, దురద,దద్దుర్లు కూడా తగ్గుతాయి.

**రక్తపోటు నియంత్రణకు:** రోజూ ఉదయం 100 మి.లీ.ల నీటిలో 20 కొత్తిమీరఆకులు, 20తులసిఆకులు, 20 పుదీన ఆకులు, 5గ్రా. జీలకర్ర వేసి మిక్సీలో బాగాకలిపి వడగట్టి త్రాగాలి. రక్తపోటు నియంత్రణలోకి వచ్చిన తర్వాత 100మి.లీ. నీటిలో ఈ పదార్థాలను సగం ప్రమాణం మాత్రమే కలిపి ఔషధం తయారుచేసుకుని సేవిస్తుండాలి. ఈ ఔషధాన్ని ఇలా సేవించటంవల్ల మనదేహానికి హానిచేసే కొలెస్టరాల్(యల్.డి.యల్) తగ్గి మేలుచేసే మంచి కొలెస్టరాల్ (హెచ్.డి.యల్) కూడా పెరుగుతుంది. తద్వారా గుండెపోటు, పక్షవాతంలాంటి జబ్బులు రాకుండా రక్షణ కలుగుతుంది.

భాస్కర శతకం

# ఐరావతవ్రతం


- ఎస్. రమ్య

**భుజబల శౌర్యవంతులగు పుత్రులఁ గాంచిన వారికెయ్యెడన్
నిజ హృద యేప్సితార్థములు నిక్కము చేకుఱుఁ గుంతిదేవికిన్
విజయబలాఢ్యుఁ దర్జునుఁడు వీర పరాక్రమమొప్ప దేవతా
గజమును దెచ్చి తల్లి వ్రతకార్యము దీర్పఁడె తొల్లి భాస్కరా!**

**భావం:** బాహుబలపరాక్రమమున్న పుత్రులను కన్నవారికి ఎక్కడైనా వారి మనసులోని కోరికలు నెరవేరుతాయి. ఎలాగంటే కుంతీదేవి గొప్ప పరాక్రమశాలియైన అర్జునుణ్ణి పుత్రునిగా పొందింది గనుకనే అతడు ఇంద్రుని ఐరావతాన్ని తెచ్చి తల్లి తలపెట్టిన వ్రతాన్ని చేయించినట్లు అని అర్థం.

ఒకరోజు వ్యాసమహర్షి కౌరవులగృహానికి వచ్చాడు. గాంధారి ఆయనకు నమస్కరించి తన సౌభాగ్యంకోసం, పుత్రుల క్షేమంకోసం చేయదగిన గొప్ప వ్రతమేదైనా చెప్పండని మహర్షిని అడిగింది.

అంతట వ్యాసమహర్షి నీ మనోరథం నెరవేరేందుకు ఐరావతవ్రతం చెయ్యాలి అన్నాడు. అందుకు మట్టిఏనుగును సిద్ధం చేశారు కౌరవులు. ఆడవాళ్ళనందరిని వ్రతానికి ఆహ్వా



నించింది గాంధారి. కాని తన తోడికోడలైన కుంతిని పిలువ లేదు. ఐరావతవ్రతం పూర్తి చేసింది. ఆ వ్రతవిధానంప్రకారం వ్రతం పూర్తవగానే గాంధారి ఆ మట్టిఏనుగుపై ఎక్కి ఊరంతా ఊరేగింది.

"గాంధారి ఊళ్ళో ఆడవారినందరిని పిలిచి తనను పిలువనేలేదే?" అని కుంతి మనసుకు చాలా బాధ కలిగింది. అది చూసి అర్జునుడు "అమ్మా! నీ దుఃఖానికి కారణమేమి?" అని తన తల్లిని అడిగాడు. మీ పెద్దమ్మ గాంధారి ఐరావతవ్రతం చేసి ఊళ్ళో ఆడవాళ్ళనందరిని పిలిచి నన్ను పిలవలేదు అంటూ, బిడ్డకు చెప్పి దుఃఖించింది.


వెంటనే అర్జునుడు తనతల్లి వ్రతంకోసం ఐరావతాన్ని పంపుమని దేవేంద్రుణ్ణి అడిగాడు. అందుకు ఇంద్రుడు ఐరావతాన్ని పంపించాడు.

కుంతీదేవి శాస్త్రోక్తంగా వ్రతం పూర్తి చేసింది. తర్వాత ఐరావతాన్నధిరోహించి హస్తినాపురవీథులల్లో ఊరేగుతూ గాంధారిగృహంవద్ద ఆగి దిగి గాంధారికి నమస్కరించి ఆమెకు వాయనమిచ్చి మళ్లీ ఐరావతాన్నెక్కి పురవీథుల్లో ఊరేగింది.

అందరూ కుంతీదేవి అదృష్టాన్ని గొప్పగా ప్రశంసించారు. "అర్జునునివంటి వీరుడు, అసమానశూరుడు, సామర్థ్యం ఉన్నవాడు, తల్లిపట్ల అభిమానం, గౌరవం ఉన్నవాడు, తెలివైన పుత్రుడు ఇలాంటివాడు ఒక్కడున్నా చాలు" అంటూ అందరూ అర్జునుని ఔన్నత్యాన్ని వేనోళ్ళ కొనియాడారు.

**సందేశం:** ప్రతిపుత్రుడు అర్జునుణ్ణి ఆదర్శంగా తీసుకుని తల్లిదండ్రులను ఆదరించి గౌరవించాలి. వారి మనోభావాలను, సలహాలను, సూచనలను గౌరవించి పాటించాలి. వారి అభీష్టాలను తెలుసుకుని వీలైనంతవరకైనా నెరవేర్చాలి. అదియే పుత్రుని ధర్మంఔతుంది.

విశ్వదాభిరామం                    వేమన పద్యసూక్తి



## అల్పులకు అధికారం ఇవ్వరాదు

అల్పబుద్ధివాని కధికార మిచ్చిన
దొడ్డవారి నెల్ల తొలగగొట్టు
చెప్పు దినెడికుక్క చెఱకు తీపెరుగునా?
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** అల్పబుద్ధివాడు= నీచుడు; అధికారము= పెద్దతనం; దొడ్డవారిని= గొప్పవారిని; తొలగగొట్టు= తరిమివేస్తాడు.

**భావం:** నీచునికి అధికారం ఇస్తే మంచివారినందరిని తరిమివేస్తాడు. చెప్పు తినేకుక్కకు చెఱకుతీపి తెలుస్తుందా? నీచుడు కుక్కవంటివాడు.

**వివరణ:** రాజ్యంలో పరిపాలన సక్రమంగా నడవాలంటే రాజు ఆయాశాఖలను పర్యవేక్షించడానికి అధికారులను ఏర్పాటు చేసుకోవాలి. రాజు ఒక్కడే అన్నివిషయాలను సకాలంలో సరియైనపద్ధతిలో నిర్వహించడం సాధ్యం కాదు. అలా ఇతరులకు అధికారం అప్పగించేటపుడు సమర్థులను ఎన్నుకోవాలి. నీచమైనబుద్ధి కలిగినవారిని నియమిస్తే, వారు సమర్థులలోని గొప్పతనం గ్రహించలేక, వారిని రాజుకు దూరం చేస్తారు. అందువల్ల రాజ్యానికి కీడు జరుగుతుంది. కుక్క చెఱుకులో ఉండేతీపిని తెలుసుకోలేదు. దాని నీచబుద్ధిచేత చెప్పునే వెదుక్కుని తింటుంది. అందువల్ల రాజు నీచులకు అధికారం ఇవ్వగూడదు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు



## శ్రీకృష్ణామృతం...

–'అనంత' కృష్ణసుందరి సత్తిరాజు,
99103 45794

ఏమిచూతురే వింతలకేవింత ఈ బాలుడు కనరారోయమ్మ
ఏమిచెబుదునే వింతలకేవింత ఈ బాలుడు వినరారోయమ్మ

పాలుకారు బుగ్గలట ముద్దుముద్దుమోమట
మోముపైన లాస్యము పట్టువంటికురులట
కురులలో పింఛము మిగుల మెరసిపోవునట

పుట్టుపురిటికందు వీడు పూతనను చంపెనట
అడుగులైన వేయలేదు అంత మ్రాను చీల్చెనట
అల్లరిపాపడు అమ్మచెంగు దాగెనట

కొలువ కాయమంత లేదు కొండ వేలినెత్తెనట
బ్రహ్మ అహమునణచెనట బ్రహ్మాండము నోట నట
కొంటెతల కృష్ణుడు కడవ కొల్లగొట్టెనట

కోమలమౌ పదములట కాళీయుని కూల్చేనట
మామ కంసుడాదిగా అసురులతో వైరమట
కరముల వేణువు పెదవుల హాసమట

సుడిగాలిన రక్కసుడు అఘాసుర బకాసురులు
గోదూడలు కాచువాడు గోరక్కసి చంపెనట
రక్కసితో రణమట శాంతిదూత వాడట

చెరసాలను పుట్టేనట తలిదండ్రుల వీడెనట
రమణి రాధ ప్రేమనొదలి వ్రజము వీడి వెళ్ళెనట
జగతిన ప్రేమకు ఈతనే పేరట

## మార్చి నెల క్విజ్–8 సమాధానాలు

**అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానం - లక్ష్మి**

సరైన సమాధానాలు వ్రాసినవారు–

01) వి.ఉమారత్నతన్మయి, రాజమహేంద్రవరం.
02) పి.ధనశ్రీ నాగహర్షిక, చింతలపూడి.
03) ఎస్.శివపర్ణి, అనంతపురం.
04) కె.నాగార్జున, అనంతపురం.
05) బి.సాధ్విక, శ్రీకాకుళం.
06) ఎ.నవ్యశ్రీ, బళ్లారి.
07) బి.శ్రీభద్ర, మధిర.
08) డి.అహాలాదిత, మందమర్రి.
09) ఎమ్.లక్ష్మీశీల, హైదరాబాదు.
10) ఎమ్.మనోజ్ఞ, తాడిపత్రి.
11) అనంతమారుతిభార్గవ, హైదరాబాదు.
12) పి.లక్ష్మీశ్రీ అన్విత, విశాఖపట్నం.

పాఠం-21

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య
నిర్వహణ- కీ.శే. మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య

| | | |
|---|---|---|
| युष्माकम् = మీరు-మీ యొక్క-మీది | यथा = ఎట్లు | भूतकाल: = భూతకాలము |
| अस्माकम् = మాకు-మాయొక్క-మాది | रे, अरे = అరే | प्र. अखादत् = असादन् |
| तेषाम् = వారికి-వారియొక్క-వారిది | वृथा = వ్యర్థముగా | म. अखाद: = अखादत |
| | | उ. अखादम् = अखादाम |

### అ) ఈ క్రింది వాటికి తెలుగులోకి అనువాదం చేయండి?

01) युस्माकं गृहे अद्य वयम् अन्नम् अखादाम।
02) अस्माकम् अत्र गृहमेव नास्ति।
03) स: यथा अखादत्, त्वम् अपि तथा अखाद:।
04) यूयं तत्र वृथा किमर्थमास्त?
05) वयं तत्र वृथा नास्म।
06) किन्तु तेषां गृहे स्नानं कुर्म:।
07) रे बालक! त्वं वृथा मा एधि।
08) युष्मद्गृहे पाक: कियत्पर्यन्तम् आसीत्?
09) शाकमकुर्वन्, अन्नं कुर्वन्ति।
10) ते शीघ्रमखादन्।

### అ) జవాబులు

01) మీ ఇంట్లో ఈ రోజు మేము అన్నము తిన్నాము.
02) మాకు ఇక్కడ ఇల్లే లేదు.
03) అతడు ఎలా తిన్నాడో నీవు కూడా అలాగే తిన్నావు.
04) మీరు ఎందుకు అక్కడ వృథాగా ఉన్నారు?
05) మేము అక్కడ వృథాగా లేము.
06) కానీ వారింట్లో స్నానం చేస్తాము.
07) రే బాలక! నీవు వృథాగా ఉండకు.
08) మీ ఇంట్లో వంట ఎంతవరకు అయినది?
09) కూరలు చేశారు, అన్నము వండుతున్నారు.
10) వారు తొందరగా తినిరి.

### ఆ) ఈ క్రింది వాటికి సంస్కృతంలోకి అనువాదం చేయండి?

01) వారు లోపల ఉన్నారా, వెలుపల ఉన్నారా?
02) వారు మా ఇంట్లో ఎంతవరకుండిరి.
03) మేమిపుడే పండ్లను తిన్నాము.
04) మీ కోసము వారిక్కడ ఉన్నారు.
05) నీవివ్వేళ సాయంకాలమేమి తింటివి?
06) నేను వారియొక్క చెంబునందు కూరను చేసితిని.
07) ఇంతవరకు ఎక్కడ ఉన్నావురా?
08) మీ ఇంట్లోనే ఉంటివిగా.
09) అలాగా! వారెవరు?
10) నిన్నప్రొద్దున మీ ఇంట్లో ఎవరు స్నానము చేసినారో వారే వీరు.

### ఆ) జవాబులు


01) ते अन्त: सन्ति वा, बहि: सन्ति वा?
02) ते अस्माकं गृहे कियत् पर्यन्तं स्यु:।
03) वयम् इदानीमेव फलानि अखादाम।
04) युष्मभ्यं कृते ते अत्र सन्ति।
05) त्वम् अद्य सायंकाले किम् अखाद:?
06) अहं तेषां कलशे शाकम् अकरवम्।
07) एतावत् पर्यन्तं कुत्र आसी:?
08) युष्मद् गृहे एव अभवम् खलु।
09) तथा वा! ते के?
10) ह्य: प्रात: युष्मद् गृहे ये स्नानं कृतवन्त: ते एव एते।


చిత్ర కథ


# కూర్మావతారం

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్

దుర్వాసమహర్షి శాపంమూలంగా దేవతలు బలహీనులయ్యారు. దేవతలు తరచుగా దానవులచేతిలో ఓడిపోసాగారు. అప్పుడు దేవతలు విష్ణువుని ఇలా ప్రార్థించారు...











దేవతలు దానవులతో కలిసి...




మందరగిరిని తెచ్చారు.





నాగరాజు వాసుకిని తెచ్చారు.




చిలకటం ఆరంభించారు..




అంతలో.. మందరగిరి సముద్రంలోకి జారిపోసాగింది. దేవతలూ, దానవులూ కంగారుపడ్డారు.
అయ్యో! కవ్వం లేకుండా చిలికేదెలా?
అవును చిలికేదెలా?
ఓ శ్రీహరీ! కాపాడు.. కాపాడు!
శ్రీహరి ప్రత్యక్షమయ్యాడు. అభయమిచ్చాడు.
శ్రీహరి కూర్మరూపాన్ని ధరించి తన వీపుమీద మందరాన్ని మోస్తూ నిలిచాడు. దేవతలు....
మళ్లీ మథనం ఆరంభమయింది.
ఆటంకం పోయింది. ఇక చిలుకుదాం...
దేవతలూ! దానవులూ ఆదికూర్మానికి నమస్కరించారు...
నమస్తే శ్రీకూర్మనారాయణ!
సర్వే జనాః సుఖినో భవన్తు!

బాలనీతి

# దృఢభక్తి

– శ్రీమతి దణ్యంరాజు జ్యోతిర్మణి

ధ్రువుడు బాలభక్తుల్లో అగ్రగణ్యుడు. పసివయస్సు లోనే పరమాత్మను సాక్షాత్కరింపజేసుకొని పరమపదాన్ని సాధించిన తపస్వి. ఇతడు బ్రహ్మమానసపుత్రుడైన స్వాయంభువ మనువుకు మనుమడు. సునీతి, ఉత్తానపాదుల తనయుడు. ఐదు సంవత్సరాల చిరుప్రాయపువాడు. ఒకనాడు ఉత్తముడు తండ్రి అంకముపై కూర్చునిఉన్నసమయంలో ధ్రువుడు అక్కడికొచ్చి తండ్రిఒడిలో కూర్చోబోగా సురుచి ఈసడించుకొంది. అందుకు ధ్రువుడు తల్లివద్దకు వెళ్లి రోదించాడు. అందుకు సునీతి విష్ణువును ప్రార్థించు. ఆయన పాదాలను ఆశ్రయించు. అదియే దుఃఖనివారణోపాయం అని పుత్రుని ఊరడించింది.

ధ్రువునిహృదయంలో తల్లిమాటలు బలంగా నాటుకొన్నాయి. విష్ణువును ప్రసన్నుణ్ణి చేసుకోవాలని, అరణ్యానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో నారదమహర్షి, ధ్రువుణ్ణి కలిసి "ఓంకారంతో కూడిన పన్నెండుఅక్షరాలున్న "ఓం! నమో భగవతే వాసుదేవాయ!" అను వాసుదేవమంత్రాన్ని జపించు అని చెప్పి






వెళ్లిపోయాడు. మధువనంలో ధ్రువుడు, ఒంటికాలుపై శిలవలె నిశ్చలంగా నిలబడి, దృఢచిత్తంతో మహత్తు మొదలైన తత్త్వములకు ఆధారభూతుడు, శాశ్వతుడు ఐన శ్రీహరిని తన హృదయంలో నిలుపుకొని తీవ్రమైన తపస్సు చేశాడు.

నారాయణుడు గరుడవాహనుడై మధువనానికి వచ్చి ధ్రువుని ఎదుట నిలిచి అతనికి 'ధ్రువక్షితి' అను మహోన్నత స్థానాన్ని ప్రసాదించాడు. గ్రహనక్షత్రములు, తారాగణములు, జ్యోతిశ్చక్రములు, ధర్ముడు, అగ్ని, కశ్యపుడు, ఇంద్రుడు, సప్తఋషులు, తారకలు ఈ ధ్రువస్థానమునకు ప్రదక్షిణ చేస్తారనీ, ఈ స్థానం ఎవ్వరికీ అందనిదనీ, ముల్లోకాలు నశించినప్పటికినీ ప్రకాశిస్తూనే ఉంటావనీ, సర్వోన్నతమైనది, పునారవృత్తిరహితమైనది ఐన ధ్రువపథమును ధ్రువునికి అనుగ్రహించాడు. ధ్రువునికి యుక్తవయస్సురాగానే, వివాహంచేసి, ఉత్తానపాదుడు అతనికి రాజ్యభారం అప్పగించి వానప్రస్థం స్వీకరించాడు. ధ్రువుడు చిరకాలం రాజ్యపాలనచేసి అంత్యమున విష్ణుపథమును చేరుకున్నాడు. ధ్రువుడు దృఢభక్తితో, అతి పిన్నవయస్సులోనే పరమయోగులు సహితం పొందలేని భగవంతుని పరమపదం చేరే వరాన్ని పొందాడు. ధ్రువమండలమున ధ్రువతారగా ప్రకాశించాడు. ధ్రువుని దృఢభక్తి ఎందరికో స్ఫూర్తిదాయకం. శమదమాదులను నిగ్రహించుకొన్నవారికి సాధించలేనిది ఏమియు ఉండదు అని చాటిచెప్పే ఒక చక్కటి వృత్తాంతం ఇది.

**24వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**



# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## ఇందులో భిన్నమైన బొమ్మ ఏది?





అ)................ ఆ)................ ఇ)................ ఈ)................

పై వరుసలలో అ)ప్రహ్లాదుడు, ఆ)క్షీరసాగరమథనం, ఇ)అన్నమయ్య, ఈ)బాల హనుమంతుడు- మొదలైన బొమ్మలకు సంబంధం లేని బొమ్మలను గుర్తించండి?

జవాబులు: అ)ఆదిశంకరాచార్యులు ఆ)సరస్వతి ఇ)వీణ ఈ)బాలకృష్ణుడు



## పిల్లలూ! దారి కనుక్కోండి!!






భక్తప్రహ్లాదుడు
శ్రీనృసింహస్వామిని దర్శించడానికి
వెళ్లే సరైనమార్గాన్ని కనుక్కోండి!!

## చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...



# క్విజ్ 10

01) వేదాలకు మరోపేరు? జ).....................

02) కృష్ణుణ్ణి తనక్షీరంతో అభిషేకించిన గోవుపేరు? జ).....................

03) వేణునాదానికి ఆధారమేది? జ).....................

04) ఇంద్రియాలకు ఈశుడు? జ).....................

05) సింధూరంతో పూజింపబడే స్వామి? జ).....................

06) అష్టాక్షరీ మహామంత్రం? జ).....................

07) దైవీసంపద కలవాని లక్షణం? జ).....................

08) తమలపాకు మధ్యభాగంలో కొలువై ఉన్న దేవత? జ).....................

09) శ్రీమహావిష్ణువు క్షీరాబ్ధిమథనసమయ అవతారం? జ).....................

10) శ్రీవేంకటేశ్వరస్వామిపై శరణాగతి కీర్తనలు చేసినవారు? జ).....................

11) దుర్వాసమహర్షి భార్యపేరు? జ).....................

12) నవబ్రహ్మలలో ఒకరు? జ).....................

13) శ్రీరాముడికి ఆంజనేయుడు అందించాలనుకున్న సేవ? జ).....................

14) అన్ని జన్మలకన్న శ్రేష్ఠమైన జన్మ? జ).....................

15) ఈ జన్మలో చేసిన పాపం లేదా పుణ్యకర్మలకు గల పేరు? జ).....................

16) కవులకు కాణాచి గాయక నిలయం? జ).....................

17) కుంతిదేవి వ్రతానికి ఐరావతాన్ని తెచ్చిందెవరు? జ).....................

18) ధ్రువమండలమున ధ్రువతారగా ప్రసిద్ధికెక్కినవారు? జ).....................

19) జాబాలితీర్థంలో కొలువై ఉన్న దైవం? జ).....................

20) మొట్టమొదట శ్రీవేంకటేశ్వరస్వామిని సేవించిన స్త్రీమూర్తి ఎవరు? జ).....................

## నియమనిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-05-2023.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కు సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. వెతికి రాయండి.

చందాసంఖ్య: ..................... వయస్సు: .....................

పాఠశాల: ..................... తరగతి: .....................

పేరు: .....................

చిరునామా: .....................

.....................

.....................

..................... పిన్‌కోడ్: .....................

ఫోను నెంబరు: .....................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి

**మేషం–** అనుకున్నలక్ష్యాలను సాధిస్తారు. జన్మరాశిలో బృహస్పతి ఈ సమయంలో ఆశా వహదృక్పథాన్ని మేలుకొలిపి మిమ్ములను విజయ పథంవైపు నడిపిస్తాడు.

**వృషభం–** ఉద్యోగవిషయాలు అనుకూలం. ఆకస్మిక ధనలాభం, కార్యజయం, సర్వత్రా అనుకూలత కలుగుతాయి. రక్తప్రసరణ, గుండె సంబంధవిషయాల్లో వైద్యసలహాలు తీసుకోవలసి వస్తుంది.

**మిథునం–** లాభస్థానంలో రవిబుధులు సమస్తైశ్వ ర్యాలను కలుగజేస్తారు. ఆహ్లాదకరమైన జీవనం గడుపుతారు. ఆధ్యాత్మికంగా మీ సంకల్పబలం స్థాయి పెరుగుతుంది. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతారు.

**కర్కాటకం–** కుటుంబంలో శుభకార్యాలు, వృత్తి ఉద్యోగవిషయాల్లో ఆనందంగా ఉంటారు. ఉద్యోగఉన్నతి కల్గుతుంది. కుటుంబవాతావరణం బాగుండి మానసికప్రశాంతత లభిస్తుంది.

**సింహం–** ప్రమోషన్‌తో కూడిన కొత్త అవకాశా లను పొందుతారు. పై అధికారులనుండి గుర్తింపు పొందుతారు. సామాజికపరంగా ప్రశంసలు పొందుతారు. ఆరోగ్యవిషయాలు అనుకూలం.

**కన్య–** వృత్తివిషయాల్లో సంస్థాగతమైన మార్పులు చేయవలసి వస్తుంది. అయితే సంవత్సరమంతా కలసివచ్చే అంశాలు ఎక్కువగా ఉంటాయి. శుభకార్యాల్లో పాలుపంచుకుంటారు. వృత్తివిషయాలు అనుకూలం.

**తుల–** ఆనందకరమైన వాతావరణాన్ని అనుభవి స్తారు. పై అధికారుల అండదండలు ఉంటాయి. వారి ప్రశంసలు కూడా కల్గుతాయి. వృత్తి విషయాల్లో రాణిస్తారు.

**వృశ్చికం–** పదిమందిలో గుర్తింపు కల్గుతుంది. సామాజికపరమైన అంశాల్లో ముందంజ. పిల్లల విషయాల్లో సంతోషాన్ని కలిగిస్తుంది. చెడు సావాసాలకు దూరంగా ఉంటే అభివృద్ధి కల్గుతుంది.

**ధనుస్సు–** ఈ మాసంలో సుబ్రహ్మణ్యారాధన చేయటం మంచిది. ఇతరులకు సహాయం చేయడంలో ముందుంటారు. తలచినపనులు నెర వేరుతాయి. ద్రవ్యలాభం, ధనలాభం కల్గుతాయి.

**మకరం–** సంతానంవిషయాల్లో సంతోషం కల్గు తుంది. ఇది పరీక్షల్లో విజయం, మరిన్ని వినోద అవకాశాలను కల్గించే సమయం. గృహసౌఖ్యానికి ప్రాధాన్యత ఇస్తారు.

**కుంభం–** శుభయోగాలు కల్గుతాయి. ధనం ఖర్చు నియంత్రణ అవసరం. ప్రణాళికలక్ష్యంతో ముందుకు సాగి విజయాన్ని వరిస్తారు. సంతానం విజయాలు సంతోషాన్నిస్తాయి.

**మీనం–** సంపద, ఆస్తి మరియు శారీరక మానసికబలాలు కూడుతాయి. కుటుంబంలో ఆనందం, మంచిఆరోగ్యం కల్గుతాయి. శుభ కార్యాలు కలసివస్తాయి.

కష్టసుఖాలనే అడ్డుగోడల్ని చీల్చుకొని పోగలిగేది కేవలం మంచి ప్రవర్తన మాత్రమే

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________

______________________

______________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

.................................................. తేది : ..................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 88

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | 3 | | 4 | | |
| | ■ | | ■ | | ■ | | ■ | ■ |
| 5 | | ■ | 6 | | | ■ | 7 | 8 |
| ■ | ■ | 9 | ■ | | ■ | 10 | ■ | |
| 11 | | | | ■ | 12 | | | |
| | ■ | | ■ | 13 | ■ | | ■ | |
| 14 | | ■ | 15 | | | ■ | 16 | |
| ■ | ■ | 17 | ■ | | ■ | 18 | ■ | |
| ■ | 19 | | | ■ | 20 | | | ■ |

**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)పంచతంత్రంలో మిత్రభేదకథయందు చెప్పబడిన జంబుక సోదరులు(9); 5)వరిచేనుచుట్టూ రక్షణకై చుట్టూ వేసేది(2); 6)కశ్యపప్రజాపతిభార్య(3); 7)పార్వతి(2); 11)శివునివిల్లు(4); 12)హనుమంతుడు(4); 14)పసిపిల్లలబుగ్గలపై పెద్దలు పెట్టేది(2); 15)కైకసి తండ్రి(3); 16)రక్షించు(2); 19)కవిత్రయం తెనిగించిన గ్రంథం(3); 20)తల్లికి తల్లి(3)

### నిలువు

1)బంగారం(3); 2)మోసము(2); 3)ధనంలేనివాడు(4); 4)పడమరన పుట్టిన తూర్పున కలిసేది. ఎల్లప్పుడూ ప్రవహించేది(2); 8)వైకుంఠంలో ఉన్న ద్వారపాలకులు(6); 9)రావణ, కుంభకర్ణుల తల్లి(3); 10)ఆరంభం(3); 11)కోయిల(3); 13)అమావాస్య(3); 17)నక్షత్రము(2); 18)దెబ్బతగలగానే వెంటనే నోటి వెంట వచ్చే పదం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు






Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

**తిరుమల శ్రీవారికి 22-03-2023న జరిగిన ఉగాది ఆస్థాన వైభవ కార్యక్రమ దృశ్యాలు.**
అందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు మరియు
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., దంపతులు.






**ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామివారికి 05-04-2023న జరిగిన కల్యాణోత్సవం సందర్భంగా**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన గౌ॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులు,
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి దంపతులు, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్. దంపతులు,
తి.తి.దే.అధికారులు, ప్రముఖులు మరియు భక్తులు పాల్గొన్నారు.





SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams' printing on 25-04-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.



తిరుచానూరు

# శ్రీపద్మావతీతాయార్ల తెప్పోత్సవాలు

(30-05-2023 నుండి 03-06-2023 వరకు)